అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 07-11-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 307 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50

బీసీలను విస్మరించిన కాంగ్రెస్ :మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కాంగ్రెస్ పార్టీ బీసీలను విస్మరించిందని మంత్రి హరీశ్ రావు విమర్శించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో కాంగ్రెస్ నేత నగేష్ ముదిరాజ్‌కు గులాబీ కండువా కప్పి మంత్రి ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ 2018లో తెలంగాణ ద్రోహులతో కలిసిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడూ అదే పని చేస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్ కోరుతున్న ఒక్కసారి అవకాశమిస్తే ఆగమవుతామన్నారు. 24 గంటల కరెంట్ ఇచ్చే రాష్ట్రంలో 5 గంటలు కరెంట్ ఇస్తామని కాంగ్రెస్ చెబుతున్నదని తెలిపారు. తెలంగాణ పచ్చదనంగా మారిందనీ, గతంలో సర్కారు దవాఖానాకు రాననే వారు ...ఇప్పుడు అక్కడికే పోదామంటున్నారనీ, ప్రభుత్వాస్పత్రుల్లో డెలివరీలు 30 శాతం నుంచి 76 శాతానికి పెరిగాయని తెలిపారు. ఒక్కొక్క సమస్యను సీఎం కేసీఆర్ తీరుస్తున్నారనీ, ఈ సమయంలో రిస్క్ ఎందుకు తీసుకోవాలి? అని ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముదిరాజ్‌ల సంక్షేమానికి చర్యలు తీసుకున్నామనీ, గ్రామాల్లో చెరువులపై వారికే హక్కులు కల్పించామని గుర్తుచేశారు.

కృష్ణానది జలాల వినియోగంపై ఏపీ పిటిషన్ విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పాలమూరు-రంగారెడ్డి ద్వారా తెలంగాణ 90 టీఎంసీల కృష్ణానది జలాలను వాడుకునేందుకు వీలులేదంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణను అత్యున్నత న్యాయస్థానం ఈనెల 29కి వాయిదా వేసింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా తెలంగాణ ప్రభుత్వం కృష్ణానది జలాలు 90 టీఎంసీలు వాడకుండా అడ్డుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జల వివాద పరిష్కార ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ) ఆశ్రయించింది.

పిటిషన్‌ను విచారించే అధికారం తమకు లేదని, తగిన వేదికను ఆశ్రయించాలని సెప్టెంబర్ 20న ట్రిబ్యునల్ సూచించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సోమవారం ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. వాయిదా కోరుతూ కేంద్ర ప్రభుత్వం తరపున లెటర్ పంపిందని ఏపీ ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు. ఏపీ, తెలంగాణ తరపు న్యాయవాదులు ఉన్నారుగా అని ధర్మాసనం ప్రశ్నించింది. తాము కేవియట్ దాఖలు చేశామని తెలంగాణ తరపు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ తెలిపారు.

కృష్ణా జలాల పంపిణీపై మరో పిటిషన్ పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. ఆ పిటిషన్ తదుపరి విచారణ ఎప్పుడు ఉందని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ నెల 29న ఉందని వైద్యనాథన్ తెలిపారు. ఆ పిటిషన్ తో పాటే ప్రస్తుత పిటిషన్ విచారణ చేపడతామంటూ ధర్మాసనం కేసు విచారణను వాయిదా వేసింది.

కాళేశ్వరం ప్రాజెక్టు అతిపెద్ద స్కాం

- గోవా సీఎం ప్రమోద్ సావంత్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు అతి పెద్ద స్కాం అనీ, దానిపై దేశవ్యాప్తంగా చర్చ నడుస్తున్నదని గోవా సీఎం ప్రమోద్ సావంత్ అన్నారు. సోమ వారం హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం నిరు ద్యోగులను తీవ్రంగా మోసం చేసింద నీ, పేపరు లీకేజీలకు కారణమై నిరు ద్యోగుల ఉసురుతీసిందని విమర్శిం చారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలం గాణను కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చిండన్నారు. బీఆర్ఎస్ నాయకు లు రైతులు, పేదల భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. తెలం గాణ ఏర్పాటు కోసం కాంగ్రెస్ పార్టీ 1200 మంది యువకుల ప్రాణాలను బలి తీసుకున్నదనీ, రక్తపు బొట్టు చిందకుండా బీజేపీ మూడు రాష్ట్రాల ను ఏర్పాటు చేసిందని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తే తెలంగాణ అమరవీరుల కుటుంబాల ను ఆదుకుంటుందని హామీనిచ్చారు. పసుపు బోర్డు ఏర్పాటుకు కేసీఆర్ ప్రభుత్వం సహకరించడం లేదని విమర్శించారు. అమలుకు నోచుకోని హామీలతో ప్రజల్ని మోసం చేస్తున్న కేసీఆర్‌ను నమ్మొద్దని కోరారు. బీజేపీని గెలిపిం చాలని విజ్ఞప్తి చేశారు.

నేపాల్‌లో మళ్లీ కంపించిన భూమి

- తీవ్రత 5.6గా నమోదు
- ఢిల్లీలోనూ ప్రకంపనలు
- సాయం కోసం బాధితుల ఎదురుచూపులు



ఖాట్మండు : పశ్చిమ నేపాల్‌లో సోమవారం మరోసారి భూమి కంపించింది. ఈసారి ప్రకంపనల తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.6గా నమోదైంది. భూకంప కేంద్రం ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యకు ఉత్తరంగా 233 కిలోమీటర్ల దూరంలో వుంది. ఉత్తర భారతంలో కూడా ఈ ప్రకంపనల ప్రభావం కనిపించినట్లు జాతీయ భూకంపనల కేంద్రం తెలిపింది. ప్రకంపనల తీవ్రతతో ప్రజలు భీతిల్లారు. ఇళ్లల్లో నుండి బయటకు పరిగెత్తారు. ఇళ్లల్లోని ఫర్నీచర్ కదిలిపోయాయని, వస్తువులు చెల్లా చెదురుగా పడ్డాయని ఢిల్లీ, ఎన్‌సిఆర్ ప్రాంత ప్రజలు తెలిపారు.

భూకంప మృతులు 153 మందే : నేపాల్

శుక్రవారం రాత్రి సంభవించిన నేపాల్ భూకంపంలో మరణించిన వారి సంఖ్య 153 అని నేపాల్ ప్రభుత్వం పేర్కొంది. తొలుత 157మంది మరణించి నట్లు వార్తలు వెలువడినా అనంతరం మృతుల సంఖ్యను ప్రభుత్వం సవరించిం ది. మృతుల పేర్లు రెండుసార్లు రావడం వల్ల ఈ పొరపాటు జరిగిందని తెలిపింది.

సాయం కోసం ఎదురుచూపులు

చాలాచోట్ల భూకంప బాధితులు ప్రభుత్వ సాయం కోసం ఇంకా ఎదురుచూస్తునే వున్నారు. ఇప్పటికి రెండు రోజులుగా చలిలో బయటనే వుండడంతో వృద్ధులు, చిన్నారులు చాలామంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ప్రకృతి విపత్తులో తమ పంటలు, ఆహార ధాన్యా లు, బట్టలు, విలువైన వస్తువులు అన్నీ పోగొట్టుకున్నామని, శిథిలాల గుట్టలపై కూర్చున్నామని, ఇంతవరకు సాయమంద లేదని పలువురు గ్రామస్తులు వాపోయారు. చలి విపరీతంగా వుందని, భరించలేక పోతున్నామని, నిద్ర వుండడం లేదని చెప్పారు. సహాయ పంపిణీని క్రమబద్ధీక రించేందుకు అవసరమైన డేటాను స్థానిక యూనిట్లు సేకరిస్తున్నా యని, అందువల్లే కొంత జాప్యం జరుగు తోందని భెరి మున్సిపాలిటీ మేయర్ చంద్ర ప్రకాష్ ఘార్తి తెలిపారు.

లోక్‌సభ ఎథిక్స్ కమిటీ సమావేశం వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

డబ్బులు తీసుకుని ప్రశ్నలు వేశారన్న ఆరోపణలను ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై ముసాయిదా నివేదికను రూపొందించేం దుకు జరగాల్సిన లోక్‌సభ ఎథిక్స్ కమిటీ సమావేశం వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం నవంబర్ 7న కమిటీ సమావేశం జరపాలని నిర్ణయించగా ఈ సమావేశాన్ని నవంబర్ 9కి వాయిదా వేశారు. వాయిదా కు కారణం ఏమిటనేది అధికారికంగా వెల్లడించలేదు. మొయిత్రాపై వచ్చిన ఆరోపణలపై బీజేపీ ఎంపీ వినోద్ కుమార్ సోంకర్ అధ్యక్షతన లోక్‌సభ ఎథిక్స్ కమిటీ విచారణ జరుపుతోంది.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 07-11-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 307
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు
వెల : 6.50

దడ పుట్టిస్తున్న ఉల్లి

- రిటైల్ మార్కెట్లో రూ.70 నుంచి 80
- నెల రోజుల్లో నాలుగింతల పెరుగుదల
- సామాన్యుడి పై ధరాభారం



నవతెలంగాణ బ్యూరో, హైదరాబాద్

మనం నిత్యం వండుకునే ఏ కూరలో అయినా తప్పని సరిగా ఉల్లి ఉండాల్సిందే. అది వెజ్ అయినా... నాన్ వెజ్ అయినా, అన్నింటిలో కలిసి పోయే గుణం ఉల్లిది. నెల రోజుల క్రితం కిలో రూ.20 పలికిన ఉల్లి ధర నేడు అమాంతం నాలుగు రెట్లు పెరిగి రూ.80కి చేరింది. మార్కెట్లో బంగారంతో సమానంగా ఉల్లి ...7లో

బిల్లులు నాన్చొద్దు

ఆత్మపరిశీలన చేసుకోండి... గవర్నర్లకు సుప్రీం చురక

- కీలక బిల్లుల ఆమోదంలో కాలయాపనపై తీవ్ర అసంతృప్తి
- వాదనలు విన్పించిన పంజాబ్, తమిళనాడు, కేరళ


పంజాబ్ గవర్నర్
కేరళ గవర్నర్
తమిళనాడు గవర్నర్
తెలంగాణ గవర్నర్

రాష్ట్ర గవర్నర్లు కీలక బిల్లులను ఆమోదించకుండా పెండింగులో ఉంచడంపై సుప్రీంకోర్టు సోమవారం నాడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీల పాలనలోని పంజాబ్, తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయస్థానాల తలుపు తట్టే వరకూ గవర్నర్లు ఎలాంటి చర్య తీసుకోవడం లేదని వ్యాఖ్యానించింది. 'ఇది చాలా తీవ్రమైన విషయం. దీనిని మేం పరిశీలించాల్సి ఉంది. దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి మనం ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఉన్నాం. ఇలాంటి వ్యవహారాలను గవర్నర్లు, ముఖ్యమంత్రులే పరిష్కరించుకోవాలి. కోర్టు దాకా రావడం ఎందుకు?' అని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ అన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం పొందిన బిల్లుల్ని గవర్నర్ విధిగా ఆమోదించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. గవర్నర్లు ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు కారని గుర్తు చేసింది. పంజాబ్ గవర్నర్ తీసుకున్న చర్యలపై తాజా నివేదికను అందజేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది. అనంతరం విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

న్యూఢిల్లీ : రాష్ట్ర శాసనసభల ఆమోదం పొందిన బిల్లులను ఎటూ తేల్చకుండా వాటి విషయంలో గవర్నర్లు నాన్చివేత ధోరణిని విడనాడాలనిసర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఇలాంటి సంస్కృతికి ముగింపు పలకాలని సూచించింది. పంజాబ్ శాసనసభ ఆమోదించిన బిల్లుల్ని గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్ ఆమోదించకుండా కాలయాపన చేస్తున్నారంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో న్యాయమూర్తులు జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య బెంచ్ విచారణ జరుపుతోంది.

రాష్ట్ర గవర్నర్ ఏడు కీలక బిల్లులకు ఆమోదం తెలపకుండా పక్కన పెట్టారని అమ్ఆద్మీ పార్టీ నేతృత్వంలోని పంజాబ్ ప్రభుత్వం ఆరోపించింది. వీటిలో మూడు ద్రవ్య బిల్లులు, ప్రభుత్వ అనుమతి పొందిన కళాశాలలకు సంబంధించిన ఇతర బిల్లులు ఉన్నాయని న్యాయస్థానం దృష్టికి తెచ్చింది. సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసిన తర్వాత రెండు ద్రవ్య బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలిపారని విచారణ సందర్భంగా గవర్నర్ తరఫున హాజరైన పంజాబ్ ...7లో

సీపీఐ(ఎం) రెండో జాబితా

హుజూర్‌నగర్ మల్లు లక్ష్మి.. నల్లగొండ ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

- నేడు కోదాడ అభ్యర్థి ఎంపిక
- మునుగోడు, ఇల్లెందు, కొల్లాపూర్ స్థానాల్లోనూ పోటీపై పరిశీలన
- నిర్ధిష్ట ప్రతిపాదన లేకుండా పొత్తులు కుదరవు
- బాధిత, పీడితుల సమస్యలపై నిలదీసేది కమ్యూనిస్టులే : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


మల్లు లక్ష్మి


సుధాకర్‌రెడ్డి

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ(ఎం) పోటీ చేస్తానన్న 17 నియోజకవర్గాల్లో ఇప్పటికే 14 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించామని, మరో ఇద్దరు అభ్యర్థులు ఖరారయ్యారని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పాలేరు నియోజకవర్గ అభ్యర్థి తమ్మినేని వీరభద్రం స్పష్టంచేశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం కోడలు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి. హుజూర్‌నగర్, సీపీఐ(ఎం) నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి.. నల్లగొండ స్థానం నుంచి బరిలో ఉంటారని చెప్పారు. మరో స్థానం కోదాడ అభ్యర్థిని మంగళవారం మధ్యాహ్నం లోగా ప్రకటిస్తామన్నారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మునుగోడు, ఇల్లెందు, మహబూబ్‌నగర్ జిల్లా కొల్లపూర్ నియోజకవర్గం నుంచి కూడా పోటీపై నాయకత్వం చర్చలు జరుపుతోంద న్నారు. గతంలో తాము 17 స్థానాల్లోనే పోటీ చేస్తామని ప్రకటించామని, వాటిని 21 స్థానాలకు పెంచాలని నిర్ణయించామన్నారు. ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నామన్నారు. తెలుగుదేశం ఆవిర్భావానికి ముందు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 9 స్థానాలు గెలిచిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందన్నారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత కూడా ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ అధిక స్థానాలు గెలిచినా ఖమ్మంలో మాత్రం ఏడు నియోజక వర్గాల్లో కమ్యూనిస్టు అభ్యర్థులు గెలిచిన విషయాన్ని గుర్తు చేశారు.



ప్రజా సమస్యలపై పోరాటాలు చేసేది కమ్యూనిస్టులే..

మిగిలిన పార్టీల్లా ఎన్నికలు, గెలుపు ఓటములతో నిమిత్తం లేకుండా కమ్యూనిస్టులు నిరంతరం ప్రజల సమస్యలపై పోరాడుతూనే ఉంటారని తమ్మినేని అన్నారు. ఖమ్మం జిల్లా సాగునీటి సమస్య పరిష్కారానికి... దుమ్ముగూడెం సాధన కోసం తాను 2,600 కి.మీ పాదయాత్ర చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఉన్నా ఖమ్మం అసెంబ్లీ స్థానంలో స్నేహపూర్వక పోటీ ఉన్నట్టు తెలిపారు. సీపీఐ, టీడీపీ కలిసి పోటీ చేసినా ఆ ఎన్నికల్లో తాను గెలుపొందిన విషయాన్ని ప్రస్తావిస్తూ...పోరాట ...9లో

కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి సవాల్

కొడంగల్‌ను అభివృద్ధి చేస్తే.. నాపై పోటీ చేయాలి

- ఆరు గ్యారంటీలు అమలు జరగాలంటే కాంగ్రెస్ రావాలి
- డీకే శివకుమార్ కన్నా ఎక్కువ మెజార్టీతో గెలిపించండి
- వేలాదిమందితో ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేసిన టీపీసీసీ అధ్యక్షులు



నవతెలంగాణ-కొడంగల్

కొడంగల్‌ను అభివృద్ధి చేస్తే కేటీఆర్ తనపై పోటీ చేయాలని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలో పార్టీ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ తీసి నామినేషన్ దాఖలు ...7లో

16 మందితో మూడో జాబితా

- విడుదల చేసిన కాంగ్రెస్ వివరాలు 9లో

ప్రాజెక్టులతో పాలమూరు సస్యశ్యామలం

పరిణితి చెందిన ప్రభుత్వంతోనే రాష్ట్రం పురోగతి

- కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునుగుడే..
- రాష్ట్రానికి మోడీ తీవ్ర అన్యాయం
- ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి/నారాయణపేట/గద్వాల/దేవరకద్ర

"ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా పాలమూరు సస్యశ్యామలం అయింది. పరిణితి చెందిన ప్రభుత్వాల ద్వారానే రాష్ట్రమైన, కేంద్రమైన అభివృద్ధి చెందుతుంది. 50ఏండ్ల కాంగ్రెస్ పరిపాలనా తీరు వల్లనే జిల్లాలో గంజి కేంద్రాల ఏర్పాటు చేయడం జరిగింది" అని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్ర, గద్వాల, మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొని మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో పాలమూరు దుస్థితిని ఏ రాజకీయ పార్టీ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యక్తి అంజయ్య సీఎంగా అయిన తర్వాతనే జూరాల ప్రాజెక్టుకు మోక్షం కలిగిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన ఈ పదేండ్లలో కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేశామని ...7లో

న్యూస్‌క్లిక్ కేసులో ఢిల్లీ పోలీసులకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : న్యూస్‌క్లిక్ కేసులో ఢిల్లీ పోలీసులకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులిచ్చింది. తమ అరెస్టును సవాలు చేస్తూ న్యూస్‌క్లిక్ వ్యవస్థాపక చీఫ్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థా, హెచ్ ఆర్ విభాగం చీఫ్ అమిత్ చక్రవర్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద ఢిల్లీ పోలీసులు తమను అరెస్టు చేయడాన్ని సమర్థిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన నిర్ణయాన్ని కొట్టేయాలని కోరుతూ దాఖలుచేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ...7లో



కాంగ్రెస్‌తో సీపీఐ పొత్తు ఖరారు

కొత్తగూడెం కేటాయింపు రెండు ఎమ్మెల్సీలకు హామీ

- సీపీఐ(ఎం)తో చర్చలు కొనసాగుతున్నాయ్ : రేవంత్‌రెడ్డి
- నిరంకుశ బీఆర్ఎస్‌ను ఓడించాలి : నారాయణ
- ఈ స్నేహం కేంద్రంలో మార్పునకు దోహదపడాలి : కూనంనేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్‌తో సీపీఐ పొత్తు ఖరారైంది. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ నాయకులు దీపాదాస్ మున్షి, విష్ణుదాస్ సోమవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌కు వచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా, ...9లో

పాలస్తీనాపై మారణకాండ ఆపండి

నేటి నుంచి 10 వరకు దేశ వ్యాపిత నిరసనలకు వామపక్షాల పిలుపు



న్యూఢిల్లీ : గాజాలో ఇజ్రాయిల్ నిరంతర బాంబుదాడులు సాగిస్తోంది. ఇజ్రాయిల్ ఆక్రమణకు అమెరికా పూర్తి మద్దతు ఇస్తున్నది. పాలస్తీనీయులపై సాగిస్తున్న మారణకాండను తక్షణమే ఆపాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి. అమెరికా సామ్రాజ్యద చర్యలకు వ్యతిరేకంగా మంగళవారం నుంచి ఈ నెల 10వ తేది వరకు దేశవ్యాపితంగా నిరసనకార్యక్రమాలు చేపట్టాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. భారత రక్షణ, విదేశాంగ మంత్రులతో 2+2 సమావేశంలో పాల్గొనేందుకు అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ మంగళవారం నుండి మూడు రోజులపాటు భారత్‌లో ఉంటారు. ఈ సమయంలోనే అయిదు వామపక్ష పార్టీలు దేశవ్యాపిత నిరసనలకు పిలుపునిచ్చాయి. తక్షణమే కాల్పుల విరమణ జరిగేలా అమెరికా చర్యలు తీసుకోవాలని, పాలస్తీనీయులను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్ రక్షణ బలగాలకు నిధులు ...7లో



ప్లాట్ ఫాంపై దూసుకెళ్లిన బస్సు

- విజయవాడ బస్టాండ్‌లో ప్రమాదం
- ముగ్గురు మృతి వివరాలు 9లో

నేడు తొలి దశ పోలింగ్

- మిజోరం, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం 6లో..

ఎన్నికల కోడ్ ఉల్లంఘనే

బాండ్ల నోటిఫికేషన్‌పై సీఈసీకి కేంద్ర ప్రభుత్వ ఎనర్జీ శాఖ మాజీ కార్యదర్శి శర్మ లేఖ





న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్లపై ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వ ఎనర్జీ శాఖ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ తప్పుపట్టారు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేనని తెలిపారు. దీనిపై ఆయన కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఓ లేఖ రాశారు. ఐదు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆర్థిక శాఖ తాజా నోటిఫికేషన్ ఇచ్చిందని గుర్తు చేశారు. 'ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చే విరాళాల్లో చాలా వరకూ అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. ఈ నోటిఫికేషన్ కేంద్ర ప్రభుత్వ మంచితనం, వివేకంపై తీవ్రమైన అనుమానాలు రేకెత్తిస్తోంది. అంతర్లీనంగా ఉన్న దాని ఉద్దేశాలను బయటపెడుతోంది. రాబోయే శాసనసభ ఎన్నికల సమగ్రతపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది' అని ఆయన ఆ లేఖలో తెలియజేశారు.


ఎన్నికల్లో అనేక పార్టీలు పోటీ పడుతున్న వాతావరణంలో నోటిఫికేషన్‌ను ఎప్పుడు జారీ చేయాలనే విషయంపై ఒక పార్టీ (ఎన్నికల బాండ్లను అధికంగా పొందే పార్టీ) నిర్ణయం తీసుకుంటే అది ఇతర పార్టీలకు అన్యాయం చేయడమే అవుతుందని శర్మ వివరించారు. ఎన్నికల బాండ్ల ద్వారా పార్టీలకు ఎక్కడ నుండి విరాళాలు అందుతున్నాయనే విషయాన్ని పరిశీలించాలని ఆయన ఎన్నికల కమిషన్‌కు సూచించారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఆ విరాళాలను ఉపయోగిస్తున్నదీ లేనిదీ కూడా పరిశీలించాలని కోరారు.

'ఎన్నికల బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు ఈ నెల 6 నుండి 20వ తేదీ వరకూ విరాళాలు పొందవచ్చునని కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో ఇతర పార్టీలను సంప్రదించకుండా పాలక పార్టీ ఏకపక్షంగా నోటిఫికేషన్ జారీ చేసింది. పైగా ఎన్నికల బాండ్ల చట్టబద్ధతపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. ఇది అధికార బీజేపీకి అనుకూలంగా జారీ చేసిన పక్షపాతపూరితమైన నోటిఫికేషన్. అవాంఛనీయ ప్రతిఫలం పొందిన ప్రైవేటు కంపెనీలు క్విడ్ ప్రోకో రూపంలో పాలక పక్షానికి విరాళాలు అందిస్తాయి. అలాంటి విరాళాలు చట్టవిరుద్ధమైనవి. వాటిపై జరిమానాలు విధించవచ్చు. అలాంటి విరాళాలకు సంబంధించిన వివరాలను తెలుసుకునే హక్కు పౌరులకు, ఓటర్లకు ఉంటుంది' అని శర్మ ఆ లేఖలో వివరించారు.

ఢిల్లీలో సరి-బేసి విధానం!

- రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల మూసివేత
- రాజధానిలో పెరుగుతున్న కాలుష్యం

న్యూఢిల్లీ : ఢిల్లీలో గాలి కాలుష్య స్థాయిలు పెరుగుతుండటంతో.. కేజ్రీవాల్ ప్రభుత్వం మరోసారి సరి - బేసి విధానాన్ని ప్రవేశపెట్టింది. దీపావళి తరువాతి రోజు ఈ నెల 13 నుంచి ఈ విధానం అమల్లోకి రానుందని రాష్ట్ర పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ సోమవారం తెలిపారు. నవంబర్ 20 వరకు ఈ విధానం అమల్లో ఉంటుందని.. అనంతరం పరిస్థితిని సమీక్షించి పొడిగిస్తామని ...7లో




సంపాదకీయం

'ఉల్లి' బాంబు!

దీపావళి పండగ వారం రోజుల ముందే ప్రజల నెత్తిపై 'ఉల్లి' బాంబు పడింది. మొన్నటివరకు టమాట ధర వింటేనే హడలెత్తిపోయే సామాన్యులు ఇప్పుడు ఉల్లి ధరల్ని చూసి ఆందోళన చెందాల్సిన పరిస్థితి. నిత్యం మన వంట కాల్లో ఉల్లి ఎంతటి ప్రాధాన్యతను సంతరించుకుంటుందో వేరే చెప్పనక్కర్లేదు. కానీ నేడు ఉల్లి కోయకుండానే కన్నీళ్లు పెట్టిస్తోంది. దీన్ని బట్టి చూస్తే ఉల్లి మరికొన్ని రోజుల్లో అందనంత ఎత్తుకు ఎగబాకినా ఆశ్చర్యపోనక్కర్లేదు. పదిహేను రోజుల కిందట వంద రూపాయలకు ఆరేడు కిలోలు వచ్చే ఉల్లి నేడు కిలో అరవై రూపాయలు పలుకు తోంది. ఎందుకింత తేడా? కేంద్రం ఈ రెండు వారాల్లో ప్రజల కొనుగోలు శక్తి పెంచే చర్యలు ఏమైనా తీసుకుందా? ఉల్లి ఒక్కటే కాదు నిత్యావసరాల ధరలు కూడా గతంతో పోలిస్తే బాగా పెరిగాయి. అల్లం, వెల్లుల్లి చూస్తే కిలో రూ.రెండు వందలకు తక్కువ లేదు. బహిరంగ మార్కెట్‌లో ధరలు శరవేగంగా దూసుకుపోతుంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నట్టు? ఈ ధరల పెరుగుదలకు, ఉల్లి కొరతకు కారణాలేంటి? ఇవన్నీ మన నేతలకు పట్టవు! ఎన్నికల హడావిడిలో పడి ఓట్ల కోసం పడుతున్న పాట్లలో ప్రజా సమస్యలు గాలికొదిలేసినట్టుంది?

> సాధారణంగా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఉల్లి ధరలు ఎక్కువగా ఉంటాయి. ఎందుకంటే ఆ సమయంలో ఖరీఫ్ పంట నిల్వలు అయిపోతుంటాయి. తర్వాత సీజన్‌లో వేసే పంట అప్పటికీ చేతికి రాదు. కానీ ఈ కాలంలోనే ధరల్ని అదుపులోకి ఉంచేందుకు ప్రభుత్వాలు ప్రయ త్నాలు చేయాలి. కానీ పెరిగిన ధరలను చూస్తే నియంత్రణకు తీసుకున్న చర్యలు శూన్యమనే చెప్పాలి. ఒకప్పుడు ఉల్లి ధరలు ప్రభుత్వాల్నే కూల్చిన సందర్భాలూ లేకపోలేదు. 2013లో ఢిల్లీ, రాజస్థాన్‌లలో కాంగ్రెస్ ఓటమికి ఉల్లి ధరల పెరుగుదలే కారణం. తాజాగా ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో బీజేపీని ఈ ఉల్లి ధరలు ఏం చేయనున్నాయో?

దేశంలో అత్యధికంగా ఉల్లిని సాగుచేసే రాష్ట్రాల్లో మహారాష్ట్ర, కర్నాటక, మధ్యప్రదేశ్, గుజరాత్ ఉన్నాయి. ఈ నాలుగు రాష్ట్రాల్లోనే నాలుగింట మూడొంతుల ఉత్పత్తి జరుగుతోంది. ఆసియాలోనే అతిపెద్ద ఉల్లి మార్కెట్‌గా ప్రసిద్ధి గాంచిన మహారాష్ట్రతో పాటు కర్నాటకలోనూ అకాల వర్షాల వల్ల ఉల్లి పంట దెబ్బతిన్నది వాస్తవం. దీంతో డిమాండ్‌కు సరిపడా సరఫరా చేయని పరిస్థితి తలెత్తింది. అయితే ఈ పరిణామాలతో ధరల కట్టడికి ఉల్లి ఎగుమతులపై విధించే పన్నును నలభై శాతం మేర కేంద్రం పెంచింది. కానీ ప్రజలకు ధరలు అందుబాటులో ఎందుకుండటం లేదనేది ప్రశ్న? రైతుల నుండి పంట సేకరణ చేస్తామని ప్రకటించిన కేంద్రం ఎందుకు అమలు చేయలేదు. దిగుబడులు సరిగా లేకపోవడం, మార్కెట్‌లో చాలినంత సరుకు రాకపోవడం, ఉన్న ఉల్లిని కూడా బడా వ్యాపారులు కొనుగోలు చేయడంతో ఉల్లి ధరలు బాగా పెరిగాయి. అక్టోబర్‌లో ఈ ధరలు



పెరుగుతాయనే ఊహించే ఆగస్టు మధ్య నుండే ఉల్లిని కొనుగోలు చేసి 1.7లక్షల టన్నుల ఉల్లిని నిల్వ చేస్తున్నామని, ఎన్‌సీసీఎఫ్, నాఫెడ్ వంటి సహకార సంస్థల ద్వారా రిటైల్ మార్కెట్లలో వినియోగదారులకు సబ్సిడీపై కిలో రూ.25కే ఉల్లిని అందుబాటులో ఉంచామని వినియోగ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి రోహిత్‌కుమార్‌సింగ్ చెప్పారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అలా లేదు.

గతేడాదితో పోలిస్తే జూన్ వరకు ధరలు స్థిరంగానే ఉన్నాయి. ఆగస్టులోనే 80శాతం పెరిగాయి. క్వింటాల్ ఉల్లి నేడు 3వేల నుంచి 4వేలు పలుకుతోంది. బడా వ్యాపారులు ఉల్లిని కొనుగోలు చేసి దేశంలోని పట్టణ ప్రాంతాలకు రవాణా చేస్తారు. అక్కడి నుంచి గ్రామీణ ప్రాంతాలకు చేరతాయి. ఇలా మధ్య దళారుల చేతిలో నుంచి వినియోగదారుడి వద్దకు వచ్చేసరికి ధర అమాంతం పెరిగిపోతోంది. 2022-23లో దేశంలో 318లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) ఉల్లి ఉత్పత్తి జరిగింది. శీతాకాలపు పంటలో దిగు బడులు బాగా ఎక్కువగా రావడంతో మార్చిలో హోల్ సేల్ మార్కెట్లలో కిలోకు ఒకటి, రెండు రూపాయల ధర మాత్రమే పలికింది. దీంతో చాలామంది పంటను పొలంలోనే వదిలేశారు. అయితే వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఉల్లి ధర ఒక్కసారిగా పెరిగింది. వేసవి ప్రారంభంలోనే అధిక ఉష్ణోగ్రతలు పంటను దెబ్బతీశాయి. ఉల్లి ఎదగకముందే పండిపోయింది. ఆ తర్వాత అకాల వర్షాలు, గాలిలో తేమ పెరగడంతో పంటకు ఫంగస్ ఇన్‌ఫెక్షన్లు సోకాయి. దీంతో పంటను తొందరగా తీసేయడంతో రైతులు నష్టపోయారు. ఉత్పత్తి చేసిన పంటకు ధర తక్కువగా ఉండటం, మరో వైపు పూర్తిగా పంట నష్టపోవడంతో రైతులు ఆందోళనలకు కూడా దిగారు. అయినప్పటికీ కేంద్రం చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. వారికి నష్ట పరిహారం కూడా చెల్లించలేదు.

ఉల్లి ధరలు పెరుగుతుండటం షరా మామూలే అనుకోవడానికి వీల్లేదు. ప్రభుత్వాల అలసత్వమే దీనికి నిదర్శనం. ఇతర పంటల్ని ఎక్కువకాలం కోల్డ్‌స్టోరేజీల్లో నిలువ ఉంచినట్టు ఉల్లిని ఉంచడం కుదరదు. ఈ పంటను పది నెలలు మాత్రమే నిల్వ ఉంచగలం. ఆ తర్వాత మళ్లీ దాన్ని ప్రాసెసింగ్ చేసి మార్కెట్‌కు పంపుతారు. సాధారణంగా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఉల్లి ధరలు ఎక్కువగా ఉంటాయి. ఎందుకంటే ఆ సమయంలో ఖరీఫ్ పంట నిల్వలు అయిపోతుంటాయి. తర్వాత సీజన్‌లో వేసే పంట అప్పటికీ చేతికి రాదు. కానీ ఈ కాలంలోనే ధరల్ని అదుపులోకి ఉంచేందుకు ప్రభుత్వాలు ప్రయ త్నాలు చేయాలి. కానీ పెరిగిన ధరలను చూస్తే నియంత్రణకు తీసుకున్న చర్యలు శూన్యమనే చెప్పాలి. ఒకప్పుడు ఉల్లి ధరలు ప్రభుత్వాల్నే కూల్చిన సందర్భాలూ లేకపోలేదు. 2013లో ఢిల్లీ, రాజస్థాన్‌లలో కాంగ్రెస్ ఓటమికి ఉల్లి ధరల పెరుగుదలే కారణం. తాజాగా ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో బీజేపీని ఈ ఉల్లి ధరలు ఏం చేయనున్నాయో?



నాకో కులం కావాలి

అర్జెంటుగా ఇప్పుడు
నాకో కులం కావాలి..

కొంత రొమ్ము విరుచుకునేందుకు
కొంత కాలర్ ఎగరేసేందుకు
నాయకులంతా నా ముందు
మోకరిల్లెందుకు
నాకో కులం కావాలి.

కార్పొరేషన్ల కమిషన్లు పొందేందుకు
కమ్యూనిటీ హాలు కట్టుకునేందుకు
నాకు ఇప్పుడు ఓ కులం కావాలి.
నాకేమీ చరిత్ర వద్దు
నాకేమీ పోరాట పటిమ
గతాలు వద్దు
నాకేమీ సమాజ అవగాహన లాంటి
చెత్త పదాల ఊక దంపుల్లు వద్దు
నాకో కులం కావాలి ప్లీజ్

శాసన వ్యవస్థలను శాసించడానికి
సరాసరి రాజ్య రాజకీయ
రంకుల సమరంలో
నా రంకుబొంకునంత
వలకబోసుకోవడానికి
గననీయమైన నాయకుల సంఖ్యను
పెంచుకునేందుకు
నాకో కులం కావాలి

నా కులాన్ని చూస్తే మిగతా కులాల
లో దుస్తులు తడిసి ముద్ద అవ్వాలి
నాయకులు.. సినిమా నటులు..
లక్షాధికారులు. బిచ్చగాళ్లు
అందరూ నా కులపోళ్లే ఉండాలే

ఉసిల్ల పుట్టోలే చీమల వరస వోలె
గబ్బిలాల గుంపు వోలె
మిడతల దండోలే
నా కులం నేల నేలంతా పరచుకోవాలే
కుల విస్తరణకు కుటుంబ నియంత్రణ
పరిధి నుండి నా కులాన్ని
తొలగించాలే

కింద ఏడు లోకాలు
పైన ఏడు లోకాలు
నా కుల సంఖ్యను చూసి దద్దరిల్లాలే
నా కులానికి రాజకీయ పార్టీలన్నీ
వంగి సలాములు చేయాలే
చక్రం తిప్పేందుకు..
చంకలు గుద్దుకునేందుకు.
నాకు ఓ కులం కావాలే.

కావాలంటే నా గుణాన్ని తీసుకోండి
కానీ ఓ కులాన్ని ఇవ్వండి
ప్లీజ్ ప్లీజ్ నాకో కులం కావాలి

- చెమన్, 9440385563

సోషలిజమే భవిష్యత్తు కావాలి...



ఆర్. రఘు
9490098422

"రానున్న కాలంలో సోషలిజమా, లేక క్రూరమైన అనాగరిక సమాజమా తేల్చుకోవాల్సిన పరిస్థితి మానవాళి ముందుకు వస్తుంది" అని 150 సంవత్సరముల క్రితమే మార్క్స్ మహనీయుడు హెచ్చరించాడు. ఆ హెచ్చరిక నేటి ప్రపంచానికి, అందులో మనదేశానికి సరిగ్గా సరిపోతుంది. నేడు సాధారణ మనిషి తాను ఓ అల్లకల్లోల ప్రపంచంలో ఉన్నానని పించడం సహజం. కానీ కొంచెం లోతుగా ఆలోచిస్తే విరుద్ధ శక్తులను తన గర్భంలో "ప్రపంచం పురిటినొప్పులు పడుతున్నది." అన్న మార్క్స్ మాటలు ఈరోజు పరిస్థితులకు సరిగ్గా సరిపోతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఆరంభం అయిన తరువాత 1929-30 అతిపెద్ద ఆర్థిక సంక్షోభం (గ్రేట్ డిప్రెషన్) కన్నా ఉధృతమైన, సుదీర్ఘమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్న కొద్ది మన దేశంలో లాగానే అనేక దేశాలలో పచ్చి మితవాద ఫాసిస్టు తరహా ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. మానవాళి రూపొందించుకున్న ప్రగతిశీల, ప్రజాతంత్ర, లౌకిక విలువలన్నింటి మీద పైశాచిక దాడులు జరుగుతున్నాయి. మహిళల మీద అత్యాచారాలు, అల్పజాతులు, కులాల మీద హింస పేట్రేగిపోతున్నది. వెరసి క్రూరమైన మధ్యయుగాలకు మళ్ళించే ప్రక్రియను ఫాసిస్టు ప్రభుత్వాలు తీవ్రతరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 20వ శతాబ్దం చివరి వరకూ కనపడ్డ ప్రపంచశాంతి అనే లక్ష్యం రష్యాలో కార్మికవర్గ ప్రభుత్వం పతనం కావడంతో క్రమంగా మసకబారి పోయింది. రెండవ ప్రపంచ యుద్ధంలో చావు దెబ్బలు తిని అమెరికా మినహా మిగిలిన సామ్రాజ్యవాద దేశాలు చతికిలపడ్డాయి. ఇంగ్లాండ్ ప్రపంచ అధిపత్య స్థానాన్ని అమెరికా కైవసం చేసుకున్నది. ప్రపంచ యుద్ధం ముగిసిన మరుక్షణం నుండి సోవియట్ సోషలిస్ట్ రష్యాని బలహీన పరచడానికి అమెరికా పూనుకున్నది. ప్రచ్ఛన్న యుద్ధాన్ని ప్రారంభించింది. 1990ల్లో రష్యా తదితర దేశాల్లో సోషలిస్టు వ్యవస్థలు కూలిపోయిన తర్వాత 30 సంవత్సరాల పాటు అమెరికా నాయకత్వాన సామ్రాజ్యవాద దేశాల ఆగడాలకు అడ్డే లేకుండా పోయింది. కానీ 2008లో అమెరికాలోనే ఆరంభమైన ఆర్థిక సంక్షోభం ప్రపంచం మొత్తాన్ని చుట్టుముట్టడంతో అమెరికాతో సహా సామ్రాజ్యవాద దేశాలు, మొత్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థే కోలుకోలేని ఇరుకున పడిపోయింది. పర్యవసానంగా యుద్ధాలు, ఘర్షణలు, మారణ హోమాలు ప్రపంచమంతా నిత్య కృత్యమయ్యాయి. యు ఎన్ సి హెచ్ ఆర్ 2023 జూన్ 30 నాటికి విడుదల చేసిన సమాచారం ప్రకారం 32 దేశాలు తీవ్రమైన యుద్ధాల్లో మునిగి ఉన్నాయి. 11 కోట్ల 72 లక్షల మంది తమ దేశాలను విడిచిపెట్టి అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో ఇతర దేశాల్లో తలదాచుకుంటున్నారు. ఈ క్రమంలో పెట్టుబడిదారీ ప్రపంచాన్ని కూడగట్టడానికి అమెరికన్ సామ్రాజ్యవాదం "నూతన ప్రచ్ఛన్న యుద్ధానికి" (న్యూ కోల్డ్ వార్ ఎన్ సి డబ్ల్యూ) తెరలేపింది. పచ్చి చైనా వ్యతిరేకత, పాశ్చాత్య దేశాలలో ఆసియా వ్యతిరేక జాతి ఉన్మాదాన్ని రెచ్చగొట్టడం లక్ష్యంగా ఈ నూతన ప్రచ్ఛన్న యుద్ధాన్ని ప్రారంభించింది అమెరికా. ఐక్యరాజ్యసమితితో సహా అన్ని అంతర్జాతీయ వేదికల్ని అమెరికా నిర్వీర్యం చేస్తున్నది. అంతర్జాతీయ తీర్మానాలను మూర్ఖంగా ఉల్లంఘిస్తున్నది. కానీ మరోవైపు సామ్రాజ్యవాద దేశాలకు వ్యతిరేకంగా బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) వంటి వేదికలు పుట్టుకొస్తున్నాయి. ఇప్పుడు నలభై దేశాలు ఇందులో తమకు సభ్యత్వం కావాలని దరఖాస్తులు పెట్టుకున్నాయి. యుద్ధం-శాంతి, పర్యావరణం, అసమానతలు లేని అభివృద్ధి శరణార్థుల వంటి అంశాలపై జరుగుతున్న చర్చలలో, తీర్మానాలలో, అంతర్జాతీయ వేదికల్లో అమెరికా ఒంటరిపాటు అవటం చూస్తున్నాం.

> పరిస్థితులు నిరంతరం మారుతూనే ఉంటాయి. కానీ చరిత్ర అనేక పాఠాలను నేటి తరాలకు నేర్పుతూనే ఉంటుంది. అందులో కొన్ని చారిత్రక ఘటనలూ, వాటి ప్రభావాలు, అవి నేర్పే గుణపాఠాలు చిరస్థాయిగా ఉంటాయి. అటువంటి ఓ మహత్తర చారిత్రక పాఠమే రష్యన్ కార్మిక వర్గ మహా విప్లవం. 1917 నవంబర్ 7న జయప్రదమైన ఆ మహా విప్లవం మానవ సమాజ చరిత్రను దోపీడీరహిత ప్రపంచం వైపు మళ్లించింది. నేడు రష్యాలో కార్మిక వర్గ రాజ్యం, సోషలిస్టు వ్యవస్థ లేనప్పటికీ ఆ విప్లవ ప్రకంపనలు ప్రపంచాన్ని కుదిపేస్తూనే ఉన్నాయి అనడం అతిశయోక్తి కాదు.





> ప్రపంచశాంతి శాశ్వతంగా నిలబడాలంటే ప్రపంచంలో సోషలిజం ఒక బలమైన శక్తిగా నిర్మితం కావాలి. ఆ శక్తి ఆధునిక కార్మికవర్గానికే ఉంటుందని మార్క్స్, ఏంగెల్స్‌లు పెట్టుబడిదారీ వ్యవస్థ ఊపందుకుంటున్న దశలోనే (19వ శతాబ్దం ఆరంభం నుండే) గ్రహించారు. 1864లో మొదట అంతర్జాతీయ కార్మిక సంస్థ (మొదటి ఇంటర్నేషనల్)ని ప్రారంభించారు. 1870ల నాటికి ఫ్రాన్స్, జర్మనీల మధ్య భీకరమైన యుద్ధం మొదలయ్యింది. ఇరు దేశాల లోనూ పెట్టుబడి దారీ పాలకులు జాతి ఉన్మాదాలను రెచ్చగొట్టి యుద్ధానికి తమ దేశ ప్రజల్లో మద్దతు కూడగటానికి ప్రయత్నిస్తుంటే, ఇరుదేశాలలో కార్మిక వర్గం ఈ యుద్ధాల వలన శ్రామిక వర్గానికి కష్టాలే తప్ప లాభం ఉండదని, అందువలన ఇరుదేశాల కార్మికులనూ కార్మిక అంతర్జాతీయతపై నిలబెడదామని, యుద్ధాన్ని వ్యతిరేకిద్దామని పంపు కున్న ఉత్తర ప్రత్యుత్తరాలను గొప్ప ఉదాహరణగా పేర్కొన్నారు. 'సకల దేశ కార్మికులారా ఏకంకండు... జయించడానికి ఓ ప్రపంచముంది" అని ప్రపంచ కార్మికవర్గానికి పిలుపునిచ్చారు.

చరిత్ర ఏం చెబుతోంది?

పరిస్థితులు నిరంతరం మారుతూనే ఉంటాయి. కానీ చరిత్ర అనేక పాఠాలను నేటి తరాలకు నేర్పుతూనే ఉంటుంది. అందులో కొన్ని చారిత్రక ఘటనలూ, వాటి ప్రభావాలు, అవి నేర్పే గుణపాఠాలు చిరస్థాయిగా ఉంటాయి. అటువంటి ఓ మహత్తర చారిత్రక పాఠమే రష్యన్ కార్మిక వర్గ మహా విప్లవం. 1917 నవంబర్ 7న జయప్రదమైన ఆ మహా విప్లవం మానవ సమాజ చరిత్రను దోపీడీరహిత ప్రపంచం వైపు మళ్లించింది. నేడు రష్యాలో కార్మికవర్గ రాజ్యం, సోషలిస్టు వ్యవస్థ లేనప్పటికీ ఆ విప్లవ ప్రకంపనలు ప్రపంచాన్ని కుదిపేస్తూనే ఉన్నాయి అనడం అతిశయోక్తి కాదు. యుద్ధ రహిత, శాంతి భరిత ప్రపంచాన్ని సృష్టించగల శక్తి ఆధునిక కార్మిక వర్గానికే ఉంటుందన్న చారిత్రక సత్యాన్ని ఆ కార్మిక వర్గ విప్లవం నిరూపించింది.

ఆ విప్లవం జయప్రదం అయింది భయానకమైన మొదటి ప్రపంచ యుద్ధం సాగుతున్న కాలంలో. రెండవ ఇంటర్నేషనల్ అది నాయకత్వం ఆ యుద్ధానికి కారణమైన తమ తమ దేశాల పాలకుల ముందు మోకరిల్లి యుద్ధాన్ని ఆపండని ప్రాధేయపడ్డారు. ఆ సందర్భంలో లెనిన్ "పెట్టుబడిశక్తిని కూలదోయకుండా కార్మికవర్గం చేతిలోకి అధికారం మారకుండా శాంతిని సాధించలేం. సామ్రాజ్యవాదం యుద్ధం నుంచి బయటపడలేం" అన్నాడు. దీనికి ఆయన కారల్ మార్క్స్ బోధనలను ప్రామాణికంగా తీసుకున్నాడు. మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థను అసాంతం స్క్యాన్ చేసి మూడు ప్రధాన లక్షణాలను గుర్తించాడు. ఒకటి ఆర్థిక సంక్షోభాలు, రెండు అసమాన అభివృద్ధి, మూడు పై రెండిటి పర్యావసనంగా నిరంతరం యుద్ధాలు.

'....పెట్టుబడిదారీ రాజ్యాలు దాని సాంఘిక వ్యవస్థలోని నిత్యం పెరిగే ముడి సరుకుల అవసరం, మార్కెట్లు, చౌకగా దొరికే శ్రమశక్తి వంటి పరిణామాల పర్యవసానంగా నిరంతరం యుద్ధాలకు దిగుతాయి. యుద్ధాలను నివారించాలంటే వాటి ప్రధాన కారణాన్ని నిర్మూలించాలి. అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ స్థానంలో సోషలిస్టు వ్యవస్థను నిలబెట్టాలి" అని చెప్పాడు.

ప్రపంచశాంతి శాశ్వతంగా నిలబడాలంటే ప్రపంచంలో సోషలిజం ఒక బలమైన శక్తిగా నిర్మితం కావాలి. ఆ శక్తి ఆధునిక కార్మిక వర్గానికే ఉంటుందని మార్క్స్, ఏంగెల్స్‌లు పెట్టుబడిదారీ వ్యవస్థ ఊపందుకుంటున్న దశలోనే (19వ శతాబ్దం ఆరంభం నుండే) గ్రహించారు. 1864లో మొదట అంతర్జాతీయ కార్మిక సంస్థ (మొదటి ఇంటర్నేషనల్)ని ప్రారంభించారు. 1870ల నాటికి ఫ్రాన్స్, జర్మనీల మధ్య భీకరమైన యుద్ధం మొదలయ్యింది. ఇరు దేశాలలోనూ పెట్టుబడిదారీ పాలకులు జాతి ఉన్మాదాలను రెచ్చగొట్టి యుద్ధానికి తమ దేశ ప్రజల్లో మద్దతు కూడగటానికి ప్రయత్నిస్తుంటే, ఇరు దేశాలలో కార్మిక వర్గం ఈ యుద్ధాల వలన శ్రామిక వర్గానికి కష్టాలే తప్ప లాభం ఉండదని, అందువలన ఇరుదేశాల కార్మికులనూ కార్మిక అంతర్జాతీయతపై నిలబెడదామని, యుద్ధాన్ని వ్యతిరేకిద్దామని పంపుకున్న ఉత్తర ప్రత్యుత్తరాలను గొప్ప ఉదాహరణగా పేర్కొన్నారు. 'సకల దేశ కార్మికులారా ఏకంకండు... జయించడానికి ఓ ప్రపంచముంది" అని ప్రపంచ కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. యుద్ధం - శాంతి సమస్యకు శాశ్వత ముగింపుని వివరిస్తూ "ఆర్థిక కష్టాలు, రాజకీయ చేతగానితనం సృష్టించే గత సమాజాలకు భిన్నంగా ఓ నూతన సమాజం మొగ్గ తొడుగుతున్నది. దాని అంతర్జాతీయ విధానం శాంతి. కారణం (ప్రతి దేశంలో) దాని జాతీయ పాలకులు ఒకరే. - వారే శ్రామికులు" అని స్పష్టం చేశారు. కాగితంపై ఈ రాతల ఇంకు ఆరక ముందే 1871లో పారిస్ కార్మికులు కార్మిక రాజ్యస్థాపన (పారిస్ కమ్యూన్) చేసి 72 రోజుల పాటు పాలించారు. భరించలేని పెట్టుబడిదారీ వర్గం, తన ఆగర్భ శత్రువులైన ఫ్యూడల్ పాలకులతో కలిసి రక్తపుటేరుల్లో ముంచి సంబరాలు చేసుకున్నారు. కానీ వారి సంతోషం తెల్లారకుండానే రష్యాలో కార్మిక వర్గం విప్లవాలను ఆవిష్కరించింది. 1905 విప్లవాన్ని అణిచివేసినా మరల 12 సంవత్సరాలలోనే మహత్తర శ్రామిక విప్లవాన్ని జయప్రదం చేసి తొలి సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించింది రష్యన్ కార్మిక వర్గం. అధికారంలోకి రాగానే కార్మిక రాజ్యం ప్రపంచ యుద్ధం నుండి వైదొలుగుతూ ప్రకటన గావించింది. మొదటి ప్రపంచ యుద్ధాన్ని తొలి కార్మిక రాజ్యం అంతం చేసింది. 20 సంవత్సరములు కూడా తిరగకుండా మరలా వచ్చిన రెండో ప్రపంచ యుద్ధంలో (1939-45) సగం కాలం సామ్రాజ్యవాదం తొలి సోషలిస్ట్ రాజ్యం సోవియట్ రష్యాను కూల్చడానికే వెచ్చించింది. వీరోచితమైన ఎర్రసైన్యం, అశేష ప్రజా బలంతో హిట్లర్ని మట్టి కరిపించింది. ఫాసిస్టు యుద్ధం నుండి ప్రపంచాన్ని విముక్తి చేసింది. ఆ విధంగా యుద్ధాలనే కాదు, ఫాసిజాన్ని కూడా ఓడించగలిగిన శక్తి కమ్యూనిజానికి, కార్మికవర్గ విప్లవాలకే వుంటుందని రష్యన్ కార్మికవర్గ మహావిప్లవం నిరూపించింది.




> రష్యాలో సోషలిస్టు వ్యవస్థ తొలి కార్మిక రాజ్యం కూలి ముప్పై సంవత్సరాలు గడిచిందో లేదో సోషలిజం తిరిగి ప్రపంచ ఎజెండాలోకి వచ్చేసింది. ఆకలి, పేదరికం, నిరుద్యోగం, అవిద్య, ఆర్థిక అసమానతలు లేని మనిషిని మనిషి జాతి, మతం భాష, కులం, ప్రాంతం పేరు మీద దోపిడీ చేయని ఓ ఉన్నత ప్రగతిశీల మానవ సమాజం సోషలిజంలోనే సాధ్యమవుతుందన్న స్పృహ ప్రపంచానికి కలగడం మొదలైంది. ఈ స్థితిలో పోరాటాలు, ఉద్యమాలు అంతిమంగా సాంఘిక విప్లవాలను పెంపొందించడమే మన కర్తవ్యం.

సోషలిజం సాధనే లక్ష్యం కావాలి..

అందువలన రష్యన్ కార్మిక వర్గ మహా విప్లవస్ఫూర్తితో కార్మిక వర్గాన్ని విప్లవోన్ముఖులను చేయడమే ప్రధాన కర్తవ్యంగా కృషి ద్విగుణీకృతం కావాలి. అమెరికాతో సహా అన్ని పారిశ్రామిక, అభివృద్ధి చెందిన దేశాలలో సైతం పెట్టుబడిదారీ వ్యవస్థ ఇంక ఫలితాలనివ్వలేవన్నది జనానికి తేలిపోతున్నది. ప్రత్యామ్నాయం కోసం ముఖ్యంగా యువత వెతుకులాడుతున్న తరుణం ఇది. అంత ధీటుగా కార్మిక, ఉద్యోగ, శ్రామిక పోరాటాలు విస్తృతమవుతున్నాయి. ప్రజలు ఎదుర్కొంటున్న ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం చూపలేని స్థితికి మనదేశంలో లాగానే అనేక దేశాల్లో పాలకులు చేరుకున్నారు. రష్యాలో సోషలిస్టు వ్యవస్థ తొలి కార్మిక రాజ్యం కూలి ముప్పై సంవత్సరాలు గడిచిందో లేదో సోషలిజం తిరిగి ప్రపంచ ఎజెండాలోకి వచ్చేసింది. ఆకలి, పేదరికం, నిరుద్యోగం, అవిద్య, ఆర్థిక అసమానతలు లేని మనిషిని మనిషి జాతి, మతం భాష, కులం, ప్రాంతం పేరు మీద దోపిడీ చేయని ఓ ఉన్నత ప్రగతిశీల మానవ సమాజం సోషలిజంలోనే సాధ్యమవుతుందన్న స్పృహ ప్రపంచానికి కలగడం మొదలైంది. ఈ స్థితిలో పోరాటాలు, ఉద్యమాలు అంతిమంగా సాంఘిక విప్లవాలను పెంపొందించడమే మన కర్తవ్యం.

(నేడు అక్టోబర్ విప్లవ దినోత్సవం)

1000 రోజుల విశాఖ స్టీల్ పోరాటం



సిహెచ్ నర్సింగరావు

విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపేస్తున్నామని బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరకు మా పోరాటం కొనసాగుతుందని వెయ్యి రోజులకు ముందే విశాఖపట్నం కమిషనర్ ఆఫ్ పోలీస్ సమక్షంలో ప్రకటించాము. పెద్ద దీక్షా శిబిరం వేస్తున్నారని కొందరు ఆశ్చర్యపోయారు. పోరాట కమిటీలోని కొంతమంది సభ్యులతో సహా ఎంత కాలం కొనసాగించగలం? అని ఆనాడు అనుమానాలు వచ్చాయి. గుర్తింపు సంఘంలో వున్న సీఐటీయు పోరాటాలపై అకుంఠిత విశ్వాసం గల సంస్థ. అందువల్లనే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టినట్లు సీఐటీయు నాయకత్వం స్పష్టంగా ప్రకటించింది. వెయ్యి రోజులైనా చెక్కుచెదరకుండా ఈ ఉద్యమం సాగడానికి కారణం ఏమిటి? 32 మంది ప్రాణాల బలిదానంతో విశాఖ స్టీల్ ఏర్పడింది. ఆనాడు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులదే కీలక పాత్ర. 52 మంది కమ్యూనిస్టు ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంపీలు రాజీనామా చేశారు. 68 గ్రామాలలో నివసించే ప్రజలు ఇండ్లను, 20 వేల ఎకరాల భూములను త్యాగం చేశారు. ప్రాణాలు పణంగా పెట్టి కార్మికులు ఉత్పత్తి పెంచారు. కేంద్ర ప్రభుత్వం ఆనాడు కేవలం రూ.5 వేల కోట్ల లోపే పెట్టుబడి పెట్టింది. కానీ ఈనాడు స్టీల్‌ప్లాంట్ విలువ రూ.3లక్ష కోట్లలకు పైగా పెరిగింది. దీనిని కాపాడుకోవడానికి విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు, చుట్టూ ప్రజలు, రాష్ట్ర ప్రజల మద్దతుతో అకుంఠిత దీక్షతో నిలబడ్డారు. పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు, ఆఫీసర్లతో ఐక్యత సాధించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటి ఏర్పడింది. ఈ కమిటీ ఆధ్వర్యంలో నవంబరు 8వ తేదీ నాటికి పోరాటం ప్రారంభించి వెయ్యి రోజులు అయ్యింది. ఆ రోజు విశాఖ స్టీల్ ప్లాంట్ ఎదురుగా కూర్మన పాలెం జాతీయ రహదారి దిగ్బంధనం జరుగుతుంది.

బీజేపీ కేంద్ర ప్రభుత్వం 27జనవరి2021న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నూరు శాతం అమ్మివేస్తామని ప్రకటించారు. దక్షిణ కొరియా దేశానికి చెందిన పోస్కో కంపెనీకి అమ్మి కమీషన్ కొట్టేయాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు పథకం వేసాయి. పోరాట కమిటీ ఆధ్వర్యంలో అమ్మకానికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు వేయకుండా కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుకోగలిగాము. నూరు శాతం అమ్మకం జరగాలంటే మొదట విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించిన అన్ని ఆస్తులను విలువ లెక్కలు కట్టాలి. ప్లాంట్‌లోని యంత్రాలు, భవనాలు, సామానులు, టౌన్‌షిప్, దేశంలోని అన్ని మార్కెట్ యార్డులు, దానిలో స్టీల్, మాదారం, జగ్గయ్యపేట గనులతో సహా అన్ని ఆస్తులకు విలువ కట్టాలి. విలువ కట్టడానికి కేంద్ర ప్రభుత్వం రెండు కమిటీలు వేసింది. ఈ కమిటీలు ప్రత్యక్షంగా ప్రతి ఆస్తిని పరిశీలించి లెక్కలు వేయాలి. రెండేండ్ల క్రితం ఈ కమిటీ హెలికాప్టర్‌లో బ్లాస్ ఫర్నేస్ వద్ద దిగబోతున్నారని సమాచారం రావడంతో వేలాది మంది స్టీల్‌ప్లాంట్ కార్మికులు అక్కడికి చేరారు. హెలికాప్టర్ వెనక్కి వెళ్ళింది. తిరిగి రాలేదు. విలువ కట్టిన తరువాత రెండవ దశ ఉంటుంది. విలువ ఆధారంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కొనడానికి ఆసక్తి వున్నవారు ముందుకు రావాలని రెండు నెలల ముందు పత్రికా ప్రకటన చేయాలి. విలువ కట్టలేదు కాబట్టి ఈ ప్రకటన రాలేదు. మూడవ దశ బిడ్డింగ్ (అమ్మకం). అమ్మకం షరతులు ఉంటాయి. మొదటి, రెండు దశలు కాలేదు కాబట్టి మూడవ దశ ప్రసక్తే రాలేదు.

విశాఖ స్టీల్ అమ్మకం సాధ్యం కాదని బీజేపీ ప్రభుత్వానికి తత్వం బోధపడింది. అందువల్ల సంవత్సరం నుంచి విశాఖ స్టీల్‌ను దెబ్బ తీయడానికి బీజేపీ ప్రభుత్వం దొడ్డిదార్లు వెతుకుతున్నారు. 2021-22లో విశాఖ స్టీల్‌కు నికర లాభాలు రూ.940 కోట్లు వచ్చాయి. తరువాత సంవత్సరం ముడిసరుకు కొనడానికి ఆ డబ్బులు వుంచకుండా బ్యాంకులకు అప్పులు చెల్లించారు. ముడి సరుకులు కొనడానికి డబ్బులు లేవనే వంకతో విశాఖ స్టీల్ ఉత్పత్తి 40 శాతం తగ్గించారు. దేశంలోని అన్ని స్టీల్ ప్లాంట్లకు లాభాలు వచ్చాయి. విశాఖ స్టీల్‌కు రూ.3900 కోట్లు నష్టాలు వచ్చాయి. దేశంలో అన్ని స్టీల్‌ప్లాంట్‌లకు స్వంత గనులున్నాయి. విశాఖ స్టీల్‌కు 40 సంవత్సరాల నుంచి ఎన్ని పోరాటాలు చేసినా స్వంత గనులు ఇవ్వడానికి కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు నిరాకరించాయి. ఈ ప్లాంట్ ప్రధాన సమస్య ఇదే. ఈ సమస్యను పరిష్కరించకుండా ప్లాంట్‌ను నిలువునా నాశనం చేయాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నది. ఈ విషయాలను పక్కదారి పట్టించడానికి బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు "విశాఖ స్టీల్"ను ప్రయివేటు చేయడం లేదని, పూర్వ వైభవం తెస్తామని ఇటీవల ప్రకటించారు. ఇప్పుడు మూసివేసిన బ్లాస్ట్ ఫర్నేస్-3ను జిందాల్ కంపెనీకి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు లేఖ రాశారు. బిఎఫ్-3ను జిందాల్‌కు అప్పగించడం అంటే దొడ్డి దారిన విశాఖ స్టీల్‌ను ప్రయివేటుకు అప్పగించడమే. పోరాట కమిటి దీనిని తీవ్రంగా వ్యతిరేకిం చడంలో కేంద్ర ప్రభుత్వం వెనుక్కు తగ్గింది. ఇవి బీజేపీ మోసపూరిత ప్రకటనలు. బీజేపీ మోసాలను ప్రజలకు వివరించడం మన కర్తవ్యం. ప్రజల మధ్య మత వైషమ్యాలు రెచ్చగొట్టి, కులచిచ్చులు పెట్టి పాలించాలని బీజేపీ భావిస్తున్నది.

ఈ వెయ్యిరోజుల పోరాటంలో రాష్ట్ర ప్రజలు, వివిధ సంఘాలు, సంస్థలు విశాఖస్టీల్‌కు అపూర్వ మద్దతు పలికాయి. కానీ ప్రధాన రాజకీయపార్టీలు నాటకాలాడాయి. బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనే నిర్ణయం దుర్మార్గం. రాష్ట్రంలోని అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు టీడీపీ, జనసేన పార్టీలు విశాఖ స్టీల్ ఉద్యమానికి పైకి మద్దతు ఇస్తునే డ్రామాలు ఆడారు. పార్లమెంట్‌లో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటు చేస్తారా అని ప్రశ్నించడం, బీజేపీ మంత్రులు విశాఖ స్టీల్‌ను ప్రయివేటు చేసి తీరుతామని ప్రకటించడం దొంగ నాటకం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు స్వంత గనులు ఎందుకివ్వరు? అని ఒక్కరోజు అయినా పార్లమెంట్‌లో వైఎస్ ఆర్ కాంగ్రెస్, టీడీపీలు బీజేపీ ప్రశ్నించారా? బీజేపీ అన్ని బిల్లులకు వైఎస్ఆర్ కాంగ్రెస్, టీడీపీలు మద్దతు ఇచ్చాయి. మా పోరాటాల ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ప్రజల మద్దతుతో, కార్మికుల పట్టుదలతో ఈ ఉద్యమం ఎంతకాలమైన సాగుతుందని విశ్వాసం కలిగింది. కమ్యూనిస్టులు ఒక్కరే 1966 "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" ఉద్యమం నుండి నేటి వరకు నికరంగా, నిజాయితీగా విశాఖస్టీల్ పక్షాన నిలబడ్డారు. బీజేపీ ప్రయివేటీకరణ విధానాలను ఓడించాలి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో పాటు రైల్వే, విద్యుత్, ఆయిల్ రంగం, బ్యాంక్, ఇన్సూరెన్స్ రంగాలతో సహా అన్ని రంగాలను కాపాడుకోవాలి. కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆస్తులకు మేనేజర్లు మాత్రమే. ప్రభుత్వ రంగం అంటే ప్రజల ఆస్తి. ప్రజల ఆస్తులను అమ్మేందుకు వీరికి ఎవరు హక్కు ఇచ్చారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలంటే వీరి తాతగారి ముల్లె కాదు.



> ఈ వెయ్యిరోజుల పోరాటంలో రాష్ట్ర ప్రజలు, వివిధ సంఘాలు, సంస్థలు విశాఖ స్టీల్‌కు అపూర్వ మద్దతు పలికాయి. కానీ ప్రధాన రాజకీయపార్టీలు నాటకాలాడాయి. బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనే నిర్ణయం దుర్మార్గం. రాష్ట్రంలోని అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు టీడీపీ, జనసేన పార్టీలు విశాఖ స్టీల్ ఉద్యమానికి పైకి మద్దతు ఇస్తునే డ్రామాలు ఆడారు. పార్లమెంట్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటు చేస్తారా అని ప్రశ్నించడం, బీజేపీ మంత్రులు విశాఖ స్టీల్ ను ప్రయివేటు చేసి తీరుతామని ప్రకటించడం దొంగనాటకం.

విశాఖ స్టీల్‌తో పాటు ఛత్తీస్‌గఢ్‌లోని ఒక మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన "నగర్‌నార్" స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుకు అమ్మాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. బిడ్డింగ్ కూడా పూర్తయింది. జిందాల్ స్టీల్ బిడ్డింగ్‌లో నెం.1గా వచ్చింది. ఈ లోగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. నగర్‌నార్ స్టీల్ ప్లాంట్‌ను దేశానికి అంకితం చేయడానికి వచ్చిన రోజే సెప్టెంబరు 2023లో ఛత్తీస్‌గఢ్ లోని బీజేపీయేతర రాజకీయ పార్టీలన్నీ బంద్‌కు పిలుపునిచ్చాయి. దీనితో కేంద్ర ప్రభుత్వం తోక ముడిచి నగర్‌నార్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటు చేయటం లేదని అమిత్‌షా రాయిపూర్ వచ్చి ప్రకటించారు. పోరాడితేనే ప్రభుత్వ రంగ పరిశ్రమలు కాపాడుకోగలమని నగర్‌నార్, విశాఖ స్టీల్ ప్లాంట్‌లు రుజువు చేశాయి. గతంలో సేలం, దుర్గాపూర్ (ఎల్లాయి) స్టీల్ ప్లాంట్‌లు కూడా పోరాడే అమ్మకాలను ఆపగలిగాయి. పోరాటంతోనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోగలం. ఈ పోరాటాలను యావత్తు కార్మికవర్గం మరింత ఉధృతం చేయాలని కోరుతున్నాం.

సెల్ : 9490098789

బోసిబోయిన సచివాలయం

- ఎన్నికల ప్రచారంలో సీఎం, మంత్రులు
- సన్నాహాల్లో ఉన్నతాధికారులు
- హెచ్‌వోడీల ఆఫీసులూ అంతే
- మచ్చుకూ కనపడనివైనం
- మరో నెల రోజులూ ఇంతే

ఎన్నికల ఎఫెక్ట్





నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆశల సౌధం..మన పరిపాలనా భవనం..కొత్త సచివాలయం.. నేడది బోసిబోతున్నది. ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారుల్లేక కళతప్పింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, అఖిల భారత సర్వీసుల అధికారులు కానరాక వెలవెలబోతున్నది. వందలాది గదులతో కూడిన నూతన సచివాలయం, కొద్దిపాటి మందితో పనిచేస్తున్నది. సాధారణ రోజుల్లోనైతే ఉదయం ఎనిమిది గంటలు అయిందంటే చాలు, మంత్రులు, అధికారులు, సాధారణ ప్రజలు, సందర్శకుల సందడి అంతాఇంతా కాదు. భవనంలోని లోపలి అంతస్థుల్లోని వరండాల్లో ఎప్పుడూ అధికారులు, జనంతో వాతావరణం కన్నులునిండుగా ఉండేది. ఇప్పుడా హడావిడి తగ్గింది. మంత్రుల వాహన చప్పుళ్ల లేవు. ఐఏఎస్‌ల హడావిడి అంతకన్నా లేదు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాత్రం ప్రతిరోజూ వస్తున్నా, తన పనిలో తాను నిమగ్నమవుతున్నారు. సచివాలయంలోని ప్రభుత్వ కార్యాలయాలన్నీ కొద్దిమంది ఉద్యోగులతో కనిపిస్తున్నాయి.

అక్టోబరు చివరి వారంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి క్రమేణా గ్రామాలు, జిల్లాల నుంచి వచ్చే సందర్శకుల సంఖ్యతగ్గిపోతూ వస్తున్నది. ఇప్పుడసలే కనిపించడం లేదు. ప్రభుత్వ శాఖల ప్రధాన అధిపతుల(హెచ్‌వోడీలు) కార్యాలయాలూ ఇదే కోవలోకి వస్తాయి. ఈనెల మూడున నోటిఫికేషన్ రాకతో అప్పుడప్పుడు కనిపించే సీనియర్ అఖిల భారత సర్వీసులు అధికారులు సైతం తట్టా, బుట్టా సర్దుకుని ఎన్నికలు జరుగుతున్న ఇతర రాష్ట్రాలకు తరలిపోయారు. సాధారణ. ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించే పరిశీలకులుగా భారత ఎన్నికల సంఘం విధులు కేటాయించడంతో ఆయా రాష్ట్రాల్లో మకాం వేశారు. ప్రధానంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు అంతా దేశంలో ఇప్పుడు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో ఎక్కడో ఒకచోట ఎన్నికల డ్యూటీలో నిమగ్నమయ్యారు. దీంతో సచివాలయంలో కోలాహలం తగ్గిపోయింది. సచివాలయం ప్రధాన గేట్ల వద్ద పోలీసుల అరుపులు లేదు.

సీసీ కెమెరాలు ఇప్పుడు జనంలేని ఫోటోలు తీసుకుంటు, వీడియోలను రికార్డ్ చేస్తున్నాయి. ఫుటేజీ ఎప్పటికైనా అవసరమే కదా ? చుట్టూ ఉన్న రోడ్లన్నీ దాదాపు ఉద్యోగులు ఉదయం వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు తప్ప మిగతా సమయాల్లో నిర్మానుష్యంగానే కనిపిస్తున్నాయి. కొంత మంది అధికారులు, స్టాఫ్‌తో సాధారణ విధులు మాత్రమే జరుగుతున్నాయి.

నిషిద్ధ ప్రాంతం (ప్రొహిబిటెడ్ ఏరియా)లా కనిపిస్తున్నది. సెక్రెటెరియట్‌లో దాదాపు 32 ప్రధాన ప్రభుత్వ శాఖలు, మరో 30 అనుబంధ సంస్థలకు చెందిన వేలాది మంది ఉద్యోగులు విధుల్లో ఉంటారు. ఎన్నికల కోడ్‌తో సాధారణ అధికారిక కార్యకలాపాలు తగ్గాయి. ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ మాత్రమే కొంత జరుగుతున్నది. గ్రామాలు, మండలాలు, జిల్లాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఉన్న సీఎం, మంత్రులు, ఇతరులూ సచివాలయం వైపు ముఖం పెట్టడం లేదు. అసలు అక్కడికి రాకపోతే పనేకాదు అనే పరిస్థితి నుంచి, ఇప్పుడక్కడికి పోవడం అంటే సమయాన్ని వృథా చేసుకోవడమనే స్థాయికి చేరింది.

అక్కడికి వచ్చినా చేసేది ఏమీ ఉండదనే సంగతి తెలిసిందే. ఎన్నికల నియామవళి కారణంగా అధికారిక విధుల్లో సీఎం, మంత్రులు పాల్గొనకూడదు. దీంతోనే మంత్రులు క్వార్టర్లు, ఇండ్ల నుంచి రాజకీయ ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు భారత ఎన్నికల సంఘంతో వీడియోకాన్ఫరెన్స్‌లు నిర్వహించడం కోసం అప్పుడప్పుడు ఇక్కడికి వస్తున్నారు. ఒక్కోసారి బీఆర్‌కేఆర్ భవన్ నుంచే నడిపిస్తుండటం గమనార్హం.

50కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్టు
  రూ.30 వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- ఎస్పీ బీకే రాహుల్ హెగ్డే



నవతెలంగాణ-సూర్యాపేట

రూ.12లక్షల విలువైన 50 కిలోల గంజాయిని కోదాడ పట్టణంలోని రామాపురం అంత్రరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నామని సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే తెలిపారు. సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం గంజాయి పట్టివేతకు సంబంధించిన వివరాలను ఎస్పీ విలేకరులకు వెల్లడించారు. కోదాడ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీల్లో భాగంగా రామాపురం క్రాస్‌రోడ్డులోని నల్లబండగూడెం వద్ద అంత్రరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద ఆంధ్రా నుంచి హైదరాబాద్ వెళుతున్న ప్రయివేటు బస్సులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గుర్ని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు.. మహారాష్ట్రలోని రాయగడ్ జిల్లాలో పండ్లు అమ్ముకునే అవదేశ్ చంద్రశేఖర్ వర్మ అదే ప్రాంతానికి చెందిన గృహిణులు శైల ప్రదీప్ దండకర్, సారిక విలాస్ మోహితె.. ఈనెల 3న మహారాష్ట్ర నుంచి రైలులో విశాఖపట్నం వెళ్లి శివారు ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్న వారి నుంచి రూ.లక్షకు 50కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ఆ గంజాయిని 12 ప్యాకులుగా చేయించి నాలుగు లగేజ్ బ్యాగుల్లో సర్దుకుని విశాఖపట్నం నుంచి బీఎంసీసీ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరారు. అక్కడి నుంచి మహారాష్ట్రకు వెళ్లి ఎక్కువ ధరకు గంజాయిని అమ్ముకోవాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌కు వస్తూ మార్గమధ్యలో చెక్‌పోస్ట్ తనిఖీల్లో పట్టుబడ్డారు. పోలీసులు వారి వద్ద నుంచి 50కిలోల గంజాయి, రూ.30వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కోదాడ డీఎస్పీ ప్రకాష్, సీఐ రామకృష్ణారెడ్డి, రూరల్ ఎస్ఐ సాయిప్రశాంత్, హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కె.అబ్దుల్ సమద్‌ను ఎస్పీ అభినందించారు.

మహారాష్ట్రలో బీఆర్ఎస్ బోణీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భండారా జిల్లాలో తొమ్మిది గ్రామ పంచాయతీలను బీఆర్ఎస్ గెలుచుకుంది. భండారా జిల్లాలోని 66 గ్రామ పంచాయతీలకుగాను 20 గ్రామ పంచాయతీల ఫలితాలు వచ్చాయి. భాండారాలో బీజేపీ, కాంగ్రెస్, ఎన్సీపీలకు మద్దతుగా ఉండగా, 9 గ్రామ పంచాయతీలపై బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేసింది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇప్పటి వరకు రెండు గ్రామ పంచాయతీలను గెలుచుకున్నాయి. ఒక గ్రామ పంచాయతీలో ఎన్సీపీ విజయం సాధించింది.

రుణమాఫీ చేయకుండా బీఆర్ఎస్ మోసం



- జగ్గారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

2014 నుంచి రైతుల రుణమాఫీ చేస్తానని మోసగించిన బీఆర్ఎస్‌ను ఓడించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రజలను కోరారు. సోమవారం గాంధీభవన్‌లో సంగారెడ్డి పార్టీ అభ్యర్థిగా ఆయన బీఫామ్ అందుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సోనియాగాంధీ ఒకేసారి మొత్తం రుణమాఫీని చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం ఎవరనేది అధిష్టానం నిర్ణయిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ గెలుస్తుందని అర్థమైన బీఆర్ఎస్‌కు ఏమి చేయాలో అర్థం కాక మళ్లీ తెలంగాణవాదాన్ని తెరపైకి తెస్తున్నదని విమర్శించారు. 50 ప్రాజెక్టులను కాంగ్రెస్ నిర్మిస్తే, ఒక్క ప్రాజెక్టు నిర్మించిన బీఆర్ఎస్ ఆ ప్రాజెక్టు కూడా కుంగిపోయేలా నిర్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలను నివారించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న వారి కుటుంబాలనూ ఆదుకోలేదని దుయ్యబట్టారు. ఎంఐఎం, బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటేననీ, బీజేపీ ఆడుతున్న ఆటలో బీఆర్ఎస్, ఎంఐఎం పావులని విమర్శించారు. బీజేపీ ఎలాగూ గెలవదని బీఆర్ఎస్‌ను అడ్డుపెట్టుకుందని తెలిపారు. మైనార్టీల ఓట్లు కాంగ్రెస్ కు పడకుండా ఎంఐఎం బీజేపీకి సైనికునిగా మారిందని ఎద్దేవా చేశారు. మతాన్ని అడ్డం పెట్టుకుని పబ్బం గడుపుకుంటున్న ఎంఐఎంను నమ్మొద్దని ముస్లింలకు ఆయన సూచించారు. గత ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో పెట్టినవే అమలు చేయని బీఆర్ఎస్ మళ్లీ మ్యానిఫెస్టోలో హామీలెందుకని ఆయన ప్రశ్నించారు.

నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేవంత్ ప్రచారం

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి మంగళవారం నుంచి ఈ నెల 11 వరకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ఎన్నికల్లో ప్రచారం చేయనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఆ పార్టీ సోమవారం విడుదల చేసింది. మంగళవారం ఉదయం 10 గంటలకు రేవంత్ హైదరాబాద్ నుంచి బయలుదేరి 11.30 గంటలకు అలంపూర్ ఆలయాన్ని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు గద్వాల, సాయంత్రం 4 గంటలకు మక్తల్ బహిరంగసభల్లో పాల్గొంటారు. నవంబర్ 8న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు ఖానాపూర్, 2 గంటలకు ఆదిలాబాద్, సాయంత్రం 4 గంటలకు జహీరాబాద్ బహిరంగసభలనుద్దేశించి ప్రసంగిస్తారు. నవంబర్ 9న మధ్యాహ్నం 12 గంటలకు పాలకుర్తిలో, సాయంత్రం 5 గంటలకు సికింద్రాబాద్, 6.30 గంటలకు సనత్ నగర్ బహిరంగసభల్లో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం హైదరాబాద్ సిటీ కన్వెన్షన్‌లో మైనార్టీ డిక్లరేషన్ ఉంటుంది. తిరిగి నవంబర్ 10న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు కామారెడ్డి బహిరంగ సభ (ఈ సభకు ముఖ్య అతిథి కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య)లో పాల్గొని, అదే రోజు రాత్రి హైదరాబాద్‌లో మైనార్టీలతో విందుకు హాజరవుతారు. నవంబర్ 11న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు బెల్లంపల్లి, 2 గంటలకు రామగుండం, సాయంత్రం 4 గంటలకు ధర్మపురి బహిరంగసభల్లో ప్రచారం నిర్వహించనున్నారు.

మరోసారి ఏఐజీకి చంద్రబాబు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలుగుదేశం అధినేత ఎన్.చంద్రబాబు నాయుడు మరోసారి ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. వైద్యనిపుణుల సూచన మేరకు ఆ ఆస్పత్రిలో అవసరమైన పరీక్షలు చేయించుకున్నట్టు తెలిసింది. మూడు రోజుల క్రితం ఏఐజీలో చేరిన చంద్రబాబు, పలువైద్యపరీక్షలు చేయించుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత రోజు ఇంటికి వెళ్లిపోయారు. శనివారం ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకున్నారు. మళ్లీ సోమవారం కూడా ఏఐజీకి వెళ్లడంతో ఆయన ఆరోగ్యంపై చర్చచోటుచేసుకుంది.

'లైంగిక వేధింపులకు గురైన విద్యార్థినికి న్యాయం చేయాలి'

- ఓయూ ఇఫ్లూలో విద్యార్థుల ఆందోళన
- మద్దతు తెలిపిన విద్యార్థి

సంఘాల నాయకులు, పలువురు అరెస్ట్



నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్ ఓయూ సమీపంలోని ది ఇంగ్లీష్ అండ్ ఫారేన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. యూనివర్సిటీలో లైంగిక వేధింపుల బాధితురాలికి న్యాయం చేయాలని ఇఫ్లూ విద్యార్థులు యూనివర్సిటీ గేట్ నెంబర్ 2 వద్ద సోమవారం నిరవధిక దీక్షకు పూనుకున్నారు. ఈ సందర్భంగా ఇఫ్లూ విద్యార్థి సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. వీసీ రాజీనామా చేయాలని, ప్రొక్టర్ బోర్డ్‌ను రద్దు చేసి నూతన బోర్డును ఏర్పాటు చేయాలని, స్పర్ష్ కమిటీలో విద్యార్థినులకు చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. సదరు విద్యార్థినిపై లైంగిక వేధింపులు జరిగి ఇన్ని రోజులు అవుతున్నా నిందితులను ఎందుకు గుర్తించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల వైఫల్యంపై విద్యార్థులు ఉద్యమిస్తే వారిపై కేసులు నమోదు చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. విద్యార్థులు నినాదాలతో దీక్ష స్థలం మారుమోగింది. కాగా, విద్యార్థులకు ఆందోళనకు ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అరుణ జ్యోతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఎస్.ఆశలత, పీఓడబ్ల్యూ సంధ్య ప్రొఫెసర్ పద్మజ షా, కృష్ణ కుమారి మద్దతు తెలిపారు. అలాగే, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్, ఉపాధ్యక్షులు అదం సృజన్ కుమార్, ఓయూ అధ్యక్షులు మేడి శ్రీనివాస్ అక్కడకు చేరుకుని విద్యార్థులకు మద్దతు తెలిపారు. అయితే వీరిని, ఇఫ్లూ విద్యార్థులను ఓయూ పోలీసులు అరెస్ట్ చేసి నల్లకుంట, అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.

మోసం చేసిన బీఆర్ఎస్‌ను సాగనంపండి

- పవన్ ఖేరా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరసగా రెండు సార్లు అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీని సాగనంపాలని ఏఐసీసీ మీడియా కమిటీ కన్వీనర్ పవన్ ఖేరా ప్రజలను కోరారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. పరీక్షల దరఖాస్తుల పేరుతో రూ.222 కోట్లు వసూలు చేసి ఒక్క పరీక్షను సక్రమంగా నిర్వహించలేదని విమర్శించారు. రాష్ట్రంలో 2020 సంవత్సరంలోనే 3,600 మంది యువత ఆత్మహత్య చేసుకున్న నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డ్ చెప్పిందని గుర్తుచేశారు

చర్యలు తీసుకోండి

- సీఈవోకు ఫిర్యాదు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గాంధీభవన్ నుంచి కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వాహనాలను, ప్రచార సామాగ్రిని పోలీసులు దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. తీసుకెళ్లిన వాటిలో మూడు అంబాసిడర్ కార్లతో పాటు పలు రకాల ప్రచారసామాగ్రి ఉందని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

11న రాష్ట్ర స్థాయి గిరిజన ఆత్మగౌరవ సభ

- మంత్రి సత్యవతి రాథోడ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రస్థాయి గిరిజన ఆత్మగౌరవ సభను ఈ నెల 11న నిర్వహిస్తున్నట్టు గిరిజనశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. గిరిజనులను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ తండాలను గ్రామపంచాయతీలు చేశారనీ, వారి రిజర్వేషన్లను పెంచారనీ, పోడు భూములకు పట్టాలు పంపిణీ చేశారనీ, సాంఘిక సంక్షేమ గురుకులాల సంఖ్య పెంచారని తెలిపారు. గిరిజన విశ్వవిద్యాలయం ఇవ్వకుండా బీజేపీ తాత్సారం చేస్తున్నదని విమర్శించారు. గిరిజన ద్రోహులు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె వారిని కోరారు.

ఎర్రజెండా ముద్దుబిడ్డ..

గిరిజన సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు గుగులోత్ ధర్మా కన్నుమూత

- ప్రజా ఉద్యమాలకు తీరని లోటు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- కుటుంబానికి ప్రగాఢ సంతాపం





(ఫైల్)

నవతెలంగాణ-కొత్తగూడెం

గిరిజన సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి గుగులోత్ ధర్మా మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేరిన గుగులోత్ ధర్మా (69) ఆదివారం అర్ధరాత్రి మృతిచెందారు. ఆయన భౌతికాయాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ కాలనీలోని ఆయన నివాసానికి సోమవారం కుటుంబ సభ్యులు తీసుకు వచ్చారు. ఈ క్రమంలో ఆయన భౌతికకాయాన్ని తమ్మినేని వీరభద్రంతో పాటు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ సందర్శించారు. ధర్మా మృతదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. ధర్మా రాష్ట్రంలో అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారని, ప్రత్యేకంగా గిరిజనుల సంక్షేమం కోసం ఆయన విశేషమైన కృషి చేసారని తెలిపారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలు చేయాలని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని, బంజారా పోరు బాట పేరుతో పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. తాను చనిపోయే వరకూ పార్టీ పూర్తికాలం కార్యకర్తగా, నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారన్నారు. ఆయన మరణం పట్ల తీవ్ర విచారణ వ్యక్తం చేస్తూ, పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటిస్తుందన్నారు. నివాళులర్పించిన వారిలో.. సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు పి.సోమయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్లు, బండారు రవికుమార్, ఏజే రమేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ఉన్నారు. ధర్మా మృతికి కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సంతాపం తెలిపారు.

సీపీఐ(ఎం) సంతాపం

గిరిజన ఉద్యమ నేత, సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీనియర్ నాయకులు గుగులోత్ ధర్మా అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. ఆయన మరణం పట్ల సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఒక ప్రకటనలో తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ని తెలిపారు. దశాబ్దాలపాటు ధర్మా నాయక్ గిరిజన ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ వారి సమస్యలపై నిరంతరం కృషి చేశారని తెలిపారు. జూలూరుపాడు మండలం జెడ్‌పీటీసీగా ప్రజలకు ఎనలేని సేవ చేశారని గుర్తు చేశారు. గిరిజన తండాల్లో, దళిత వాడల్లో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడారని పేర్కొ న్నారు. ఉద్యోగ అవకాశాన్ని వదులుకుని ప్రజా ఉద్య మాల్లో పనిచేయటానికి ముందుకొచ్చారని తెలిపారు. యువజన, గిరిజన, వ్యవసాయ కార్మిక రంగాల్లో పనిచేస్తూ, ప్రజా ఉద్యమాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు. ధర్మానాయక్ మరణం ప్రజా ఉద్యమానికి, పార్టీకి లోటని తమ్మినేని తెలిపారు.

ఉద్యమానికి తీరని లోటు :తెలంగాణ గిరిజన సంఘం

గిరిజన సంఘం వ్యవస్థాపకుల్లో ఒకరైన గుగులోత్ ధర్మానాయక్ అకాల మరణం గిరిజన ఉద్యమాలకు తీరనిలోటనీ, ఆయన మృతికి పలువురు సంతాపాన్ని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మ నాయక్ అధ్యక్షతన సంతాప సభను నిర్వహించారు. ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్. వినయ్‌కుమార్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోబన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటా రమేష్ , సోషల్ మీడియా రాష్ట్ర బాధ్యులు జగదీష్, రజిత, గిరిజన సంఘం నాయకులు ఆర్ పాండు, గోపి నాయక్, గోరియానాయక్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ శ్రీరాం నాయక్ మాట్లాడుతూ గిరిజన హక్కుల కోసం తుది శ్వాస వరకు రాజీ లేని పోరాటాలు నిర్వహించారన్నారు. ఆయన గత ఐదేండ్లుగా క్యాన్సర్ మహమ్మారితో బాధపడుతున్నారని తెలిపారు. మధ్యలో కోలుకున్నారనీ, అనేక గిరిజన ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. చివరిసారిగా మిర్యాలగూడ లో జరిగిన రాష్ట్ర మహాసభల్లో పాల్గొని యువతకు స్ఫూర్తినిచ్చారని గుర్తు చేశారు. పోడు భూముల ఉద్యమంలో కొత్తగూడెం ప్రాంతంలో గిరిజనులకు అండగా నిలిచారని తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి హైదరాబాదులోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో మృతి చెందారని తెలిపారు.

గిరిజనుల్లో చైతన్యానికి ఎనలేని కృషి : సీపీఐ(ఎం) ఏపీ కార్యదర్శి వి శ్రీనివాసరావు

గుగులోత్ ధర్మా అకాల మరణం పట్ల సీపీఐ(ఎం) ఏపీ కార్యదర్శి వి శ్రీనివాసరావు సంతాపం ప్రకటించారు. ఆయన గిరిజన రంగంలో పనిచేస్తూ వారిలో చైతన్యానికి ఎనలేని కృషి చేశారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి రంగం నుంచి పార్టీకి అంకితమై చివరికంటా పనిచేశారని పేర్కొన్నారు. జూలూరుపాడు మండల జెడ్పీటీసీగా పనిచేసి ప్రజల మన్ననలందుకున్నారని తెలిపారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు.

నేడు ఎల్బీ స్టేడియంలో 'బీసీ ఆత్మగౌరవ సభ'

- హాజరు కానున్న ప్రధాని మోడీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో బీజేపీ ఆధ్వర్యంలో బీసీ ఆత్మగౌరవసభను నిర్వహించనున్నారు. ఆ సభకు ముఖ్య అతిథిగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ హాజరుకాబోతున్నారు. ఈ సభ మంగళవారం సాయంత్రం ఐదున్నర గంటల నుంచి ఆరున్నర గంటల వరకు ఉంటుంది. ఈ సభలో పాల్గొనేందుకు గానూ మంగళవారం ప్రత్యేక విమానంలో సాయంత్రం ఐదుగంటల ఐదు నిమిషాలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. రోడ్డు మార్గం ద్వారా సాయంత్రం 5:25 గంటలకు ఎల్బీ స్టేడియానికి చేరుకుంటారు. సభాస్థలిలో ఆయన 45 నిమిషాలుంటారనీ, 20 నుంచి 30 నిమిషాలు మాట్లాడే అవకాశముందని తెలిసింది. సభ అనంతరం 6:30 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి తిరిగి ఢిల్లీకి వెళ్లిపోతారు. రాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ బీసీ నినాదం ఎత్తుకుని ముందుకెళ్తున్న తరుణంలో ఈ సభకు ప్రాధాన్యత నెలకొంది.

కేంద్రంలో బీసీల కోసం మంత్రిత్వ శాఖ ఏర్పాటు, దేశవ్యాప్తంగా బీసీ గణన, తెలంగాణ బీసీ సీఎం అభ్యర్థిగా ఎవరు ఉండబోతున్నారు అనే అంశాలపై ప్రధాని మోడీ ఏం మాట్లాడుతారనే దానిపై అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. బీసీలకు భరోసానిచ్చేలా హామీలుంటాయని బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆశాభావం వ్యక్తం చేస్తున్నది.

ఈ సభ విజయవంతం కోసం బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తున్నది. గ్రేటర్ పరిధితో పాటు హైదరాబాద్ చుట్టుపక్కలున్న జిల్లాల నుంచి పార్టీ శ్రేణులను తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. సోమవారం మధ్యాహ్నం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి సభా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పలు సూచనలు చేశారు. .

ఇలాంటి అవినీతి సర్కార్ ఎక్కడా లేదు

- బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్
- కేసీఆర్ కుటుంబ పాలన, అవినీతిపై బీజేపీ చార్జిషీట్ విడుదల



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వం లాంటి అవినీతి సర్కారు దేశంలో ఎక్కడా లేదని బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, కుటుంబ పాలనపై చార్జిషీట్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, చార్జిషీట్ కమిటీ చైర్మెన్, మధ్యప్రదేశ్ ఎన్నికల ఇన్‌చార్జి మురళీధర్‌రావు, తదితర నేతలతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జవదేకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల్ని గాలికొదిలేసిందని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వ పాలసీల వల్ల డ్రగ్స్, లిక్కర్ టెర్రరిజంకు చోటు దక్కిందన్నారు. ఇస్లామిక్ టెర్రరిజం మూలాలు తెలంగాణలో ఉన్నాయని చెప్పారు. మజ్లిస్ అండతో బంగ్లాదేశ్, బర్మా, రోహింగ్యాల సంఖ్య తెలంగాణలో రోజురోజుకీ పెరుగుతున్నదనీ, వారు స్లీపర్ సెల్స్‌గా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఎంఐఎం ఒత్తిడితో, పోలీసులు రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడితో పనిచేస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ బాగుండేదనీ, ఇప్పుడు దాన్ని రాజకీయం చేశారని ఆరోపించారు. అధికార పార్టీ చెప్పినట్టు చేయకపోతే బదిలీల పేరుతో పోలీసులను వేధిస్తున్నదని విమర్శించారు. మురళీధర్‌రావు మాట్లాడుతూ..తమది రైతు రాజ్యం అని చెబుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో 7800 మందికిపైగా రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో అవినీతి లేనిదే ఏదీ జరగట్లేదని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.

సీపీఐ(ఎం) శ్రేణుల్లో ఫుల్‌జోష్



దుంగార్‌ఘర్ నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి గిర్ధారి మహియా

రాజస్థాన్‌లో భారీ ప్రదర్శనలతో నామినేషన్ పత్రాల దాఖలు

రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగిన సీపీఐ(ఎం) శ్రేణుల్లో ఫుల్‌జోష్ కనిపిస్తోంది. ఓటర్లు పూల వర్షం కురిపిస్తుండగా భారీ ప్రదర్శనలు ఆకట్టు కుంటున్నాయి. బికనీర్ జిల్లాలోని దుంగార్‌ఘర్ నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థిగా గిర్ధారి మహియా నామినేషన్ దాఖలు చేశారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గిర్ధారి కూడా విజయం సాధించారు. రెండోసారి గెలిపించాలని కోరుతూ ఓటర్లను అభ్యర్థించారు. ఇక చురు జిల్లాలోని సర్దార్‌షహర్ నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం)అభ్యర్థిగా ఛగన్‌లాల్ చౌదరి నామినేషన్ దాఖలు చేశారు.



సర్దార్‌షహర్ నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి ఛగన్‌లాల్ చౌదరి

నేడు తొలిదశ పోలింగ్

- మిజోరం, ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల నిర్వహణకు సర్వసిద్ధం

న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా...తొలిదశ పోలింగ్ మంగళవారం జరగనున్నది.తమిజోరం, ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల పోలింగ్‌కు పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మిజోరంలో మొత్తం 40 స్థానాలకు ఒకేసారి పోలింగ్ జరగనుండగా.. ఛత్తీస్‌గఢ్‌లో 20 స్థానాలకు తొలి విడత పోలింగ్ జరగనుంది. అధికార, విపక్ష పార్టీలు నువ్వా నేనా అన్నట్టుగా ప్రచార జోరును కొనసాగిస్తున్నాయి. రాజకీయ పార్టీలు పోటీపడి మరీ జనాకర్షక హామీలు గుప్పించాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీల అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు తేల్చనున్నారు.

ఒకే విడతగా మిజోరంలో పోలింగ్

మిజోరంలో మొత్తం 40 నియోజకవర్గాలకు ఒకే విడతలో మంగళవారం పోలింగ్ జరగనుంది. ఇక్కడ మొత్తంగా 8.50 లక్షల మందికి పైగా ఓటర్లు ఉండగా.. వీరిలో 4,13,064 మంది పురుష ఓటర్లు 4,39,028మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరి కోసం మొత్తంగా 1276 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 50,611 మంది తొలిసారి ఓటు వేయబోతున్నారు. మిజోరంలో మొత్తం 174 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా రాష్ట్రంలో 50 కంపెనీల సాయుధ బలగాలను మోహరించారు. మిజో నేషనల్ ఫ్రంట్ తన అధికారాన్ని కాపాడుకొనేందుకు ప్రయత్నిస్తుండగా.. జడ్‌పీఎం, బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రస్తుత సర్కార్‌ను గద్దె దించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మిజో నేషనల్ ఫ్రంట్‌కు 26 సీట్లు రాగా.. కాంగ్రెస్ ఐదు, బీజేపీ ఒక సీటు గెలిచాయి. ఈసారి మిజో ఓటర్లు ఎటు మొగ్గుచూపుతారో చూడాలి!

ఛత్తీస్‌గఢ్‌లోనూ...

ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలు ఉండగా తొలి విడతలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బస్తర్‌లో 20 స్థానాలకు పోలింగ్ జరగనుంది. మిగతా 70 సీట్లకు రెండో విడతలో ఈ నెల 17న పోలింగ్ నిర్వహించనున్నారు. 20 నియోజకవర్గాల్లో ఎన్నికలకు 5,304 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు 60వేల మంది భద్రతా సిబ్బందితో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. తొలి దశలో 40,78,680 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 19,93,936 మంది పురుషులు కాగా.. 20,84,675మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 1,64,299 మంది యువత తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. తొలి విడతలో 223 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ 68 సీట్లతో ప్రభంజనం సృష్టించగా.. బీజేపీ 15 స్థానాలకే పరిమితమైంది.



ఛత్తీస్‌గఢ్ తొలిదశలో ఆ ఐదుగురు

- బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన ప్రముఖ నేతలు
- డిసెంబర్ 3న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ మొదటి దశలో ఐదుగురు వీఐపీ అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో ఒకరు మాజీ సీఎం, ఒకరు పార్టీ అధ్యక్షుడు. ఛత్తీస్‌గఢ్‌లో తొలి దశలో 20 స్థానాలకు మంగళవారం (నవంబర్ 7న) పోలింగ్ జరగనుంది. ఈ 20 స్థానాలకు ఆదివారంతో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. ఈ 20 స్థానాలకు బీజేపీ-కాంగ్రెస్‌లు పూర్తి స్థాయిలో ప్రచారం చేశాయి. తొలి దశ ఎన్నికల్లో రాష్ట్రంలోని పలువురు ప్రముఖులు బరిలో ఉన్నారు. బీజేపీ-కాంగ్రెస్ నేతల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమవుతుంది. తొలి దశ బరిలో ఉన్న వారి వివరాలుతెలుసుకుందాం.

దాక్టర్ రమణ్ సింగ్



ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం డాక్టర్ రమణ్ సింగ్ రాజ్‌నంద్‌గావ్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. తొలి దశలో రాజ్‌నంద్‌గావ్‌లో పోలింగ్ జరగనుంది. డాక్టర్ రమణ్ సింగ్ ఛత్తీస్‌గఢ్‌కు 15 ఏండ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్నారు. రమణ్ సింగ్ 1983లో కవార్ధా నుంచి మున్సిపల్ కౌన్సిలర్ ఎన్నికలో పోటీ చేయడం ద్వారా తొలిసారి రాజకీయాల్లోకి ప్రవేశించారు.

1989లో తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. ఇప్పటి వరకు ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన ఒకసారి రాజ్‌నంద్‌గావ్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. రాజ్‌నంద్‌గావ్ అసెంబ్లీ నియోజకవర్గంలో వెనుకబడిన తరగతుల జనాభా అత్యధికంగా ఉంది. ఇందులో సాహు, లోధి, యాదవ్ , ఇతరులు ఉన్నారు. దీనితో పాటు, సాధారణ కేటగిరీ జనాభా కూడా చాలా ముఖ్యమైనది.

మహ్మద్ అక్బర్



ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న మహ్మద్ అక్బర్ కవార్ధా అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అజిత్ జోగి ప్రభుత్వంలో మహ్మద్ అక్బర్ కూడా మంత్రిగా ఉన్నారు.

1978లో విద్యార్థి రాజకీయాలతో తొలిసారిగా కెరీర్ ప్రారంభించారు. అతను రాయ్‌పూర్‌లోని కుసుమ్ తాయ్ లా కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు. మహ్మద్ అక్బర్ 1998లో తొలిసారిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

ఆ తర్వాత 2003, 2008, 2018 ఎన్నికల్లో వరుసగా నాలుగోసారి విజయం సాధించి అసెంబ్లీకి చేరుకున్నారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు.

దీపక్ బైజ్



ఛత్తీస్‌గఢ్ రాజకీయాల్లో యువ ముఖం, ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు దీపక్ బైజ్ కూడా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆయనను తొలిసారిగా పోటీకి దింపగా, తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా చిత్రకోట్ అసెంబ్లీ నుంచి గెలిచి ఎమ్మెల్యే అయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మోడీ హవాలో బస్తర్ లోక్‌సభ స్థానం నుంచి గెలిచారు. 2023లో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడయ్యారు.

లతా ఉసెండి



ఈసారి కొండగావ్ అసెంబ్లీ స్థానం నుంచి లతా ఉసేందిని బీజేపీ అభ్యర్థిగా నిలబెట్టింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా టీమ్‌లో లతా ఉసేందికి కూడా చోటు దక్కింది. ఆమె రమణ్ సింగ్ ప్రభుత్వంలో మంత్రిగా కూడా పనిచేశారు. లతా ఉసేంది బస్తర్ ప్రాంతంలో బీజేపీకి కీలక నాయకురాలు.

మోహన్ మార్కం



ఛత్తీస్‌గఢ్ ప్రదేశ్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, భూపేష్ బఘేల్ ప్రభుత్వంలో మంత్రి అయిన మోహన్ మార్కం కొండగావ్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు.

మోహన్ మార్కం కాంగ్రెస్‌కు ముఖ్య నేతగా గుర్తింపు ఉన్నది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు భూపేష్ సర్కార్ క్యాబినెట్‌లో మోహన్ మార్కర్‌ను చేర్చుకున్నారు. ఇంతకు ముందు ఆయన రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు.

కాంగ్రెస్ జాబితాపై గెహ్లాట్ ముద్ర

- రాజస్థాన్ ఎన్నికల్లో సీఎం కీలక పాత్ర
- అంతా అతనిదే పైచేయి



జోధ్‌పూర్: సర్దార్‌పురా నియోజకవర్గం నుంచి రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

జైపూర్ : రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించటానికి రాజకీయ పార్టీలు తలమునకలయ్యాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీలు తమ వంతు ప్రయత్నాలను కొనసాగి స్తున్నాయి. ఓటర్లను ఆకట్టుకోవటానికి పాట్లు పడుతున్నాయి. అయితే, అభ్యర్థుల ఎంపికే అన్ని పార్టీలకు తలకు మించిన భారంగా మారింది. టికెట్లు దక్కినవారు సంతోషంతో ఉండగా.. నిరాకరణకు గురైన నాయకులు రెబల్‌గా పోటీలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు.

టికెట్ల జాబితాను ప్రకటించటంలో అధికార కాంగ్రెస్.. ప్రతిపక్ష బీజేపీ కంటే ముందున్నది. గతనెల 31న నాలుగో, ఐదో జాబితాలను కాంగ్రెస్ విడుదల చేసిన విషయం విదితమే. తాజాగా 61 మంది అభ్యర్థుల పేర్లతో కూడిన జాబితాను విడుదల చేసింది. ఇందులో అనుభవజ్ఞులైనవారు, యువ నాయకులు ముఖాలు ఉన్నాయి. అయితే, ఈ అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ అగ్రనాయకుడు, అశోక్ గెహ్లాట్ తనదైన పాత్రను పోషించారని కాంగ్రెస్ వర్గాలు తెలుపుతున్నాయి.

ఈ జాబితాల ప్రకారం రాబోయే ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థుల సంఖ్య 151కి చేరుకున్నది. ఇప్పటివరకు బీజేపీ 124 మంది అభ్యర్థులను మాత్రమే ప్రకటించింది. ఇప్పటివరకు ప్రకటించిన పేర్లలో ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ తన మద్దతుదారులలో ఎక్కువమందికి టిక్కెట్లు ఇచ్చారని విశ్లేషకులు తెలిపారు. మూడు సార్లు సీఎంగా ఆయనకు అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ అధిష్టానం ప్రాధాన్యతనిచ్చిందని అన్నారు. సచిన్ పైలట్, పార్టీలోని ఇతర వర్గాలు ఉన్నప్పటికీ.. అశోక్ గెహ్లాట్ అభ్యర్థుల జాబితా విషయంలో కీలక పాత్ర పోషంచారని తెలిపారు. తన విధేయులకు టికెట్లు కేటాయించటంతో పాటు ఇద్దరు సిట్టింగ్‌లను సైతం తొలగించారని చెప్పారు. ఈ ఇద్దరు.. గత ఐదేండ్ల గెహ్లాట్ పాలన అవినీతిమయమంటూ లేఖలు రాసిన భరత్ సింగ్, భాను ప్రతాప్ సింగ్‌లు కావటం గమనార్హం.

ఇక తొలగించబడిన ఎమ్మెల్యేలలో ఎక్కువ మంది సచిన్ పైలట్ శిబిరం నుంచే అయినప్పటికీ.. అతని మద్దతుదారులలో కూడా చాలా మంది టిక్కెట్లు పొందగలిగారు. వీరిలో కీలకం మాజీ అసెంబ్లీ స్పీకర్, సిట్టింగ్ ఎమ్మెల్యే దీపేంద్ర సింగ్ షెకావత్(శ్రీమధోపూర్ స్థానం) కావటం గమనించాల్సిన అంశం.

2020లో పైలట్ నేతృత్వంలోని తిరుగుబాటు సమయంలో మనేసర్‌కు వెళ్లిన ఎమ్మెల్యేలలో షెకావత్ కూడా ఉన్నారు. ఆరోగ్య కారణాలను ఉటంకిస్తూ.. షెకావత్ తన కుమారుడికి టిక్కెట్ ఇవ్వాలని కోరుకున్నారు. అయితే పార్టీ మాత్రం విశ్వాసం ఉంచి అనుభవజ్ఞుడైన షెకావత్‌కే టికెట్ కేటాయించింది.

పార్టీ తన మునుపటి జాబితాలలో ఇప్పటికే డజనుకు పైగా వృద్ధ నాయకులను నామినేట్ చేసింది. కొత్త జాబితాలో అమీన్ ఖాన్(84), దీప్‌చంద్ ఖైరియా (82), మహదేవ్ సింగ్ ఖండేలా(80) వంటి వృద్ధ వర్గం నుంచి మరో 10 మంది ఉన్నారు. వీరిలో సైతం ఎక్కువ మంది గెహ్లాట్ తరానికి చెందినవారు, ముఖ్యమంత్రితో సన్నిహిత సంబంధాలకు ప్రసిద్ధి చెందనవారు కావటం గమనార్హం. రాజస్థాన్‌లోని దాదాపు 49 లక్షల మంది కొత్త ఓటర్లను ఈ వృద్ధులలో ఎంతమంది ఆకట్టుకుంటారనేది ఇప్పుడు కీలకం. యువకుల ఓట్లే కాంగ్రెస్, బీజేపీల భవితవ్యాన్ని నిర్ణయిస్తాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. 200 స్థానాలున్న రాజస్థాన్ అసెంబ్లీకి ఈనెల 25న ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబర్ 3 న ఫలితాలు వెల్లడి కానున్నాయి

రాములక్కకు నో ఛాన్స్

- ప్రచారకర్తల బృందంలో దక్కని చోటు
- పార్టీ మారుతారనే భయంతోనేనా?
- 40 మందితో బీజేపీ స్టార్ క్యాంపెయినర్స్ జాబితా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



తెలంగాణలో ప్రచారకర్తల బృందంలో సినీనటి, పోరాట కమిటీ చైర్మెన్ విజయశాంతికి బీజేపీ జాతీయ నాయకత్వం మొండి చేయి చూపింది. ఇప్పుడు ఆ పార్టీలో ఇదే చర్చనీయాంశంగా మారింది. ఆమెను ఎన్నికల నేపథ్యంలో పోరాటాల కమిటీ చైర్మెన్‌గా బీజేపీ నియమించింది. కానీ, ఆమె ఆ పనిని చేయట్లేదు. పైగా, తనకు మొక్కుబడిగా ఆ పదవి ఇచ్చారనే అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల రాష్ట్రంలో జరిగిన ప్రధాని మోడీ, అమిత్‌షా సభల్లో, రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆమె పాల్గొనలేదు. పైగా, పార్టీకి నష్టం చేకూరేలా వరుసగా సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెడుతూ చర్చనీయాంశం అవుతున్నది. పార్టీపై తీవ్ర అసంతృప్తిలో ఉన్న ఆమె త్వరలో హస్తం పార్టీ గూటిలో చేరబోతున్నారనే పక్కా సమాచారంతోనే ఛాన్స్ ఇవ్వలేదని తెలుస్తోంది. దీనిని బట్టే ఆమె త్వరలో పార్టీ మారబోతున్నారనే ఊహాగాహనాలకు మరింత బలం చేకూరి నట్లయింది. మొత్తం 40 మందితో స్టార్ క్యాంపెయినర్ల బృందాన్ని బీజేపీ జాతీయ నాయకత్వం ప్రకటించింది. ప్రచార కమిటీలో ప్రధాని నరేంద్రమోడీ, ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా, హోంమంత్రి అమిత్‌షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, సీనియర్ నేతలు రాజ్‌నాథ్‌సింగ్, నితిన్‌గడ్కరీ, బీఎస్.యడ్యూరప్ప, కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, స్మృతిఇరానీ, పీయూష్‌గోయల్, పర్షోత్తమ్ రూపాలా, అర్జున్ ముండా, భూపేంద్రయాదవ్, జి.కిషన్‌రెడ్డి, సాధ్వి నిరంజన్ జ్యోతి, ఎల్.మురుగన్, ప్రకాశ్ జవదేకర్, తరుణ్‌చుగ్, సునీల్ బన్సాల్, బండి సంజయ్ కుమార్, అర్వింద్ మీనన్, డీకే అరుణ, పి.మురళీ ధర్‌రావు, డి.పురందేశ్వరి, రవి కిషన్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఏపీ.జితేందర్‌రెడ్డి, గరికెపాటి మోహన్‌రావు, డి.అర్వింద్, సోయం బాపూరావు, రాజాసింగ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, జి.ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, బంగారు శృతి, కాసం వెంకటేశ్వర్లు యాదవ్, టి.కృష్ణప్రసాద్ ఉన్నారు.

బలం లేకున్నా మెజార్టీ సీట్లు గెలుస్తాం

- హంగ్ వస్తే ఏర్పడేది బీఆర్ఎస్-కాంగ్రెస్ ప్రభుత్వమే
- కేసీఆర్‌కు ఓటమి భయం.. మేకపోతు గాంభీర్యం పైకే : మీట్ ది ప్రెస్‌లో బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాష్ట్రంలో 119కి గానూ అన్ని నియోజకవర్గాల్లో బలం లేకపోయినప్పటికీ తమ పార్టీనే అధిక స్థానాల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పరుస్తుందని బీజేపీ ఎమ్మెల్యే ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్ ఆశాభావం వ్యక్తం చేశారు. నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వీక్‌గా ఉన్నా ఉత్తర తెలంగాణలో తమకే అధిక సీట్లు వస్తాయని నొక్కి చెప్పారు. ఒకవేళ తెలంగాణలో హంగ్ వస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని చెప్పారు. ఎంఐఎం, కాంగ్రెస్, టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకున్న చరిత్ర బీజేపీకి ఎన్నడూ లేదన్నారు. ఆ మూడు పార్టీలే పరస్పరం ఎన్నికల్లో సహకరించుకుంటాయని చెప్పారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఐజేయూ జాతీయ కార్యదర్శి వై.నరేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ప్రధాన కార్యదర్శి విరావత్ అలీ అధ్యక్షతన నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ఈటల మాట్లాడారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి మాదిరిగా సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్నారనీ, అభివృద్ధి పేరుతో హైదరాబాద్ చుట్టు పక్కల ఉన్న 5,800 ఎకరాల భూమిని అతి చౌక ధరలకు అమ్మేసిందని ఆరోపించారు. ఒక్క గజ్వేల్‌లోనే ఆయన బాధితులు 30 వేల మంది ఉన్నారనీ, ఆ బాధితుల సంఘానికి తననే అధ్యక్షులుగా ఉండాలని కోరారని చెప్పారు. వారంతా కలిసికట్టుగా కేసీఆర్‌ను ఓడించబోతున్నారన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామనీ, ఆ మూడింటిలోనూ కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత ప్రభుత్వాలు అవకాశమున్నా గ్యారెంటీ, ఎఫ్ఆర్‌బీఎమ్ రుణాలు ఎక్కువగా తీసుకురాలేదన్నారు. రూ.74వేల కోట్ల రుణంతో మొదలైన తెలంగాణ..5.5 లక్షల కోట్లకు అప్పు చేరుకున్నదన్నారు. ఒక్కో తలపై 1.25 లక్షల అప్పు ఉందని చెప్పారు. ఎఫ్ఆర్‌బీఎమ్ శాతం 25 శాతం దాటిపోయిందని విమర్శించారు. జీడీపీలో 25 శాతం కంటే ఎక్కువ అప్పు దాటిపోయిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ పూటకాపూట అన్నట్టుగా ఉందనీ, భవిష్యత్తులో అప్పులు కూడా పుట్టే పరిస్థితి లేదన్నారు. ధనిక రాష్ట్రమే అయితే సర్పంచులు, ఎంపీటీసీలకు చిన్న చిన్న బిల్లులు కూడా ఎందుకు ఇవ్వలేకపోతున్నదని ప్రశ్నించారు. ఉద్యోగ నియామకాల విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనీ, 17 పేపర్లు లీకు కావడం దారుణమని విమర్శించారు. ఏటా 360 టీఎంసీలు ఎత్తివేయాలనే లక్ష్యంతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు దాన్ని చేరుకోలేదనీ, నాలుగేండ్లలో ఎత్తిపోసింది 72 టీఎంసీలేనని విమర్శించారు. దానికి రూ.9 వేల కోట్ల దాకా కరెంటు బిల్లులు కట్టారని చెప్పారు. లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టేందుకు మిగతా ప్రభుత్వ కార్యక్రమాలను ఆపారని విమర్శించారు. దళిత సీఎం, దళితులకు మూడెకరాల పంపిణీ, దళిత బంధు హామీల్లో ఒక్కదాన్నీ నెరవేర్చలేదన్నారు.

భోపాల్ ఎమ్మెల్యే కుర్చీకి రేసు

- 96 మంది అభ్యర్థుల పోటీ, 21 మంది నామినేషన్ విత్ డ్రా



భోపాల్ : మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని 7 అసెంబ్లీ స్థానాల్లో 21 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మొత్తం 96 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. దాదాపు మూడు దశాబ్దాలుగా కాషాయ పార్టీ ఓడిపోని భోపాల్ నార్త్ సీటులో బీజేపీ కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు గండి పడే కొట్టాలనుకుంటోంది. జిల్లాలోని మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు ఎవరో స్పష్టత వచ్చింది.

భోపాల్ నార్త్‌లో స్వతంత్ర అభ్యర్థులు నాసిర్ ఇస్లాం , అమీర్ అకిల్‌లు ఎలాగైనా గెలవాలని ప్రయత్నిస్తున్నారు, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆరిఫ్ అకిల్. 1990లో కాంగ్రెస్ అభ్యర్థి దివంగత హస్నత్ సిద్ధిఖీపై విజయం సాధించారు. అకిల్ స్వతంత్ర అభ్యర్థిగా గెలిచారు. ఈ ఏడాది ఉత్తర భోపాల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అఖిల్ కుమారుడు అతిఫ్ బరిలో నిలిచారు. ప్రస్తుతం బీజేపీ అభ్యర్థి అలోక్ శర్మ బరిలో దిగారు.

మరో ప్రధాన పోటీదారు మహమ్మద్ సౌద్, భోపాల్ నార్త్ నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అభ్యర్థి. ఈ నియోజకవర్గంలో దాదాపు 51% మైనారిటీ ఓట్లు ఉన్నాయి. ఇక్కడ కొన్ని వేల ఓట్ల తేడాతో గెలుపు ఓట్ల తేడాతో తేలిపోయింది. టికెట్ ఆశించి కాంగ్రెస్‌లో చేరిన హుజూర్ మాజీ ఎమ్మెల్యే జితేంద్ర దాగా సోమవారం హుజూర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి ,బుజ్జగింపుల తర్వాత తన పేరును ఉపసంహరించుకున్నారు. అనంతరం పార్టీ అభ్యర్థి నరేష్ జ్ఞాన్‌చందానీతో కలసి కనిపించారు.

బుధవారం బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే రామేశ్వర్ శర్మ కూడా దగా కలిశారు. నరేలాలో, స్వతంత్ర అభ్యర్థి బాబు మస్తాన్ , ఆప్ పార్టీ అభ్యర్థి రైసా మాలిక్ కాంగ్రెస్ పార్టీ ఓట్లను చీల్చాలని భావిస్తున్నారు, దీని అధికారిక అభ్యర్థి మనోజ్ శుక్లా పరిస్థితి నుంచి బయటపడటానికి మార్గం కనుగొనలేకపోయారు. 2008లో ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నడూ ఓడిపోని బీజేపీ నేత విశ్వాస్ సారంగ్‌పై శుక్లా ఆ నియోజకవర్గంలో పోటీ చేస్తున్నారు.

ప్రత్యర్థి నుంచి గట్టిపోటీ ఎదుర్కొంటున్నారు.

నవతెలంగాణ మానవి 7
www.navatelangana.com
మంగళవారం 07 నవంబర్ 2023 హైదరాబాద్



లింగ వివక్ష, మూస పద్ధతులను బద్దలు కొట్టుకొంటూ వెల్స్ ఫార్గోకు చెందిన హేమ శర్మ తన కెరీర్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. టెక్నాలజీ రంగంలో ఆమె తన 23 ఏండ్ల ప్రయాణం, విభిన్న అనుభవాలను మనతో పంచుకుంటుంది. అలాగే శతాబ్దాలుగా సమాజంలో మహిళలను వెనక్కి నెట్టివేస్తున్న అణిచివేత, లింగ వివక్ష గురించి ఆమె ఏమంటున్నారో తెలుసుకుందాం...



వివక్ష కుటుంబం నుండే మొదలవుతుంది

హేమ 1990ల ప్రారంభంలో ఢిల్లీలోని ఒక కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో ఇంజనీరింగ్ డిగ్రీ కోసం నమోదు చేసుకున్నప్పుడు, 42 మంది విద్యార్థులతో కూడిన ఆ తరగతిలో ఎనిమిది మంది బాలికలలో ఆమె ఒకరు. బాలికలు ప్రతిరోజూ క్యాంపస్‌లో సాధారణం లింగ విక్షను ఎదుర్కోవాల్సి వచ్చిందని ఆమె గుర్తుచేసుకున్నారు. కాలేజీలో అబ్బాయిల సీట్లు అమ్మాయిలు ఆక్రమించేస్తున్నారని, పెండ్లి చేసుకొని పిల్లల్ని కనాల్సిన వారు ఇంజినీరింగ్ చదవడం అవసరమా అంటూ నానా మాటలు అనేవారు.

సరిహద్దులు గీయని పని ప్రదేశం

'మహిళలు ఉద్యోగంలో చేరక ముందు నుండే వివక్షను అనుభవి స్తున్నారు. ఇది మన కుటుంబాలు, సమాజాల నుండి మొదల వుతుంది. ఈ వివక్షే పని ప్రదేశంలో కూడా కొనసాగుతుంది. 'కార్యాలయ నిబంధనలను అనుసరిస్తూనే మనకు వ్యక్తిగత జీవితం ఉందని అర్థం చేసుకుంటూ సరిహద్దులను గీయగల పని ప్రదేశం మహిళలు విజయం సాధించడంలో సహాయ పడుతుందని నేను భావిస్తున్నాను. ప్రస్తుత సమాజంలో చాలామంది మహిళలు అలా చేయడం నాకు సంతోషంగా ఉంది' అంటున్నారు హేమ.

కామెంట్ చేశారు

'మొదటిసారి మేము కాలేజీకి వెళ్ళినపుడు అందమైన మహిళలు ఎలా ఉండరు అంటూ ర్యాగింగ్‌లో అబ్బాయిలు మాపై జోక్‌లు వేశారు. మా నడక, ధరించే బట్టలు, వస్తువులపై అనేక కామెంట్లు చేశారు' అని హేమ గుర్తు చేసుకున్నారు. 23 ఏండ్లకుపైగా ఉన్న కెరీర్‌లో ఆమె ట్రైసాఫ్ట్, సేపియంట్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ వంటి ముఖ్యమైన పాత్రలు పోషించారు. ప్రస్తుతం ఆమె టెక్నాలజీ డైరెక్టర్ - ఎంటర్‌ప్రైజ్ ప్రొడక్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్ లీడ్, ఇండియా (WiT) ఫిలిప్పీన్స్‌లో వెల్స్ ఫార్గో అండ్ కో-చైర్‌పర్సన్‌గా ఉన్నారు.

మెషీన్ అనుభం లేదని

'చదువు పూర్తి చేసిన తర్వాత కూడా అనేక విషయాల్లో లింగ వివక్షను ఎదుర్కొంటూనే ఉన్నాము. షాప్ ఫ్లోర్‌లో పాత్రల కోసం మహిళలను తీసుకోవ డానికి చాలా కంపెనీలు పూర్తిగా నిరాకరించాయి. నేను ఒక కంపెనీలో ఉద్యోగం కోసం రెండు రాతపూర్వక రౌండ్‌లను పూర్తి చేసిన తర్వాత తదుపరి దశకు నన్ను పిలిచారు. అయితే ఆ రౌండ్ మెషీన్ అనుభవానికి సంబంధించినదని దాని నుండి నన్ను నేను మినహాయించారు. నాకు ఇది చాలా విచిత్రంగా అనిపించింది. వాళ్ల అమ్మాయిలను ఫ్లోర్ జాబ్స్‌కి తీసుకోమని బహిరంగంగా చెప్పినట్టు అనిపించింది' అని ఆమె చెప్పారు.

వివక్షను ఎదుర్కొంది

ఆమె మొదటి ఉద్యోగం మార్కెటింగ్ పాత్రగా మారింది. అది ఆమె కోరుకున్న ఉద్యోగం కాదు. ఇక్కడ ఆమె ఎటువంటి భేదాభిప్రాయాన్ని ఎదుర్కోలేదు, కానీ ఎదగడానికి అవకాశం లేవు. దాంతో కొన్ని నెలల అయిష్టంగానే అందులో కొన సాగింది. ఇన్ఫ్లుయెన్స్ అనే ట్రేడింగ్ హౌస్‌లో నాలుగేండ్లు పనిచేసిన తర్వాత 2000లో దేశంలోకి పెద్దఎత్తున ప్రవేశించిన ఐటీ బూమ్‌లో భాగం కావాలని నిర్ణయించుకుంది. ఒక ఐటీ కంపెనీలో డెవలపర్‌గా చేరింది. అక్కడ సుమారు ఐదేండ్లు కొనసాగింది. అయితే వివక్షను ఎదుర్కోవలసి వచ్చింది. తర్వాత ఆమె ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికాం ఇంజనీర్స్, ఆ తర్వాత ట్రైసాఫ్ట్‌లో ప్రాజెక్ట్ మేనేజర్‌గా చేరింది. తన కెరీర్‌లో ఒక దశాబ్దానికి పైగా పబ్లిసిస్ సేపియంట్‌లో గడిపింది.

నాయకత్వం వహిస్తున్నారు

ఎజైల్ అనుభవం పబ్లిసిస్ సేపియంట్‌లో హేమ తన ప్రయాణాన్ని ఎజైల్ (ఒక రకమైన సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ మెథడాలజీ)తో ప్రారంభించింది. ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్‌గా మారింది. లాయిడ్స్, హెచ్ఎస్‌బిసి వంటి క్లయింట్‌లతో కలిసి పనిచేయడానికి కొన్నేండ్ల పాటు ఆమెను లండన్‌కు తీసుకెళ్లింది. 2019లో హేమ వెల్స్ ఫార్గోలో చేరారు. ఇప్పుడు భారతదేశం, ఫిలిప్పీన్స్‌లో కంపెనీకి ఎజైల్ పరివర్తనకు నాయకత్వం వహిస్తుంది. 'గతంలో నేను బ్యాంకులకు థర్డ్-పార్టీ కాంట్రాక్టర్‌లా ఉన్నాను. ఇక్కడ నేను బ్యాంకుతోనే ఉన్నాను. వెల్స్ ఫార్గో అందించే స్కేల్ ప్రత్యేకమైనది. నేను ఇక్కడ పని ప్రారంభించినప్పుడు భారతదేశంలో చురుకైన పాత్ర పోషించాము' ఆమె వివరిస్తుంది.

సమాన భాగమని భావించేలా...

శర్మ వెల్స్ ఫార్గోలో (WiT) (ఉమెన్ ఇన్ టెక్నాలజీ) చాప్టర్‌కు కో-చైర్‌గా కూడా ఉన్నారు. ఔటు అనేది వెల్స్ ఫార్గో టెక్నాలజీలో పనిచేసే మహిళలకు మద్దతు ఇచ్చే న్యాయవాద సమూహం. 'మా ఉద్దేశం వెల్స్ ఫార్గోలో మహిళల ప్రాతినిధ్యాన్ని మెరుగుపరచడం. మహిళలు సంస్థలో సమాన భాగమని భావించే సంస్కృతిని సృష్టించడం. మేము గ్లైడ్ ప్రోగ్రామ్ కూడా ఏర్పాటు చేశాం. ఇది విరామం తర్వాత మహిళలను తిరిగి పనిలోకి స్వాగతించేలా చేస్తుంది. సీనియర్ వ్యక్తులు, పురుషులు, మహిళలు ఇద్దరూ నాయకులుగా, అనుబంధ ప్రోగ్రామ్‌గా మారడానికి సహాయపడే బోల్డ్ ప్రోగ్రామ్ ఇది' అని ఆమె చెప్పింది.

ఉత్సాహంగా ఉండలేకపోతున్నారు

టెక్ కెరీర్‌లో మహిళలు తమను తాము నిలబెట్టుకోవడం ఎందుకు కష్టంగా ఉంది అనే విషయంపై హేమ మాట్లాడుతూ, పని ప్రదేశంలో, ఇళ్లలో సరైన మద్దతు లభించనందున వారు తమ పని పట్ల అంత ఉత్సాహంగా ఉండలేకపోతున్నారు. అందుకే తరచూ ఉద్యోగాలు మానేస్తుంటారు. 'నా అనుభవంలో మేము వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం, తగినంత దృఢంగా వారిని తయారు చేయడం వంటికి చేస్తుంటాము. ఎవరైనా మేము సరైన స్థాయిలో లేమని చెబితే వారి అభిప్రాయాన్ని అంగీకరిస్తాం. నిరూపించుకోండి అంటూ వారిని మేము ఎదురు ప్రశ్నించము' అంటూ ఆమె వివరించింది.



కాంతులీనే చర్మానికి

చర్మం ప్రకాశవంతంగా ఉండాలని అందరూ కోరుకుంటారు. అందుకు ఏవేవో లోషన్లని, ఫౌండేషన్స్‌లని వాడుతూ ఉంటారు. అలా కాకుండా సహజ సిద్ధంగా ప్రయత్నించే కొన్ని చిట్కాలు చర్మానికి సహజ కాంతిని అందిస్తాయి. మరి అవేంటో తెలుసుకుందామా..!



- అర చెంచా పసుపు, నాలుగు చెంచాల పాలను ఓ గిన్నెలో కలపండి. దీన్ని ముఖం, మెడ చుట్టూ రాసుకోండి. 20 నిమిషాల తర్వాత కడిగేయండి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే... మెరిసే చర్మం మీ సొంతం.
- క్యారెట్ జ్యూస్ తీసి అందులో కొద్దిగా తేనె, కొద్దిగ పుల్లటి పెరుగు కలిపి ముఖానికి రాయండి. 20 నిమిషాల తర్వాత కడిగేయండి. చర్మం మెరుస్తూ... మృదువుగా అవుతుంది. వారానికి ఓసారి ఇలా చెయ్యండి.
- చెంచా నిమ్మరసం, చెంచా చక్కెర కలిపి ముఖంపై గుండ్రంగా రుద్దుతూ మసాజ్ చేసుకోండి. చక్కెర కరిగిపోగానే ముఖాన్ని నీటితో కడిగేయండి. తేడా మీకే తెలిసిపోతుంది.
- చెంచా బొప్పాయి జ్యూస్, దోసకాయ జ్యూస్ రెండు చెంచాలు, ఓ అరటిపండులో సగం జ్యూస్‌గా తీసుకుని, అన్ని కలిపి పేస్టులా రాసుకోవాలి. అరగంట తర్వాత కడిగేయండి.
- రోజ్ వాటర్‌ను అరగంట పాటూ ఫ్రిజ్‌లో ఉంచాలి. అందులో దూదిని ముంచి దాంతో ముఖానికి మసాజ్ చేసుకోవాలి. రోజూ ఉదయం, సాయంత్రం వేళ ఇలా చేస్తే చాలా మంచిది. రోజ్ వాటర్‌ని ఐస్ ముక్కలుగా మార్చి ఆ ముక్కలను రుద్దుకున్నా మంచిదే.
- ఓ చెంచా కమలా పండు తొక్క గుజ్జు, ఓ చెంచా రోజ్ వాటర్ కలిపి ముఖానికి రాసుకుని పావు గంట తర్వాత కడిగేస్తే చర్మం కాంతివంతంగా మారుతుంది.
- చెంచా కలబంద గుజ్జు, చెంచా తేనె, చెంచా పాలు కలిపి ముఖానికి రాసుకొని 20 నిమిషాల తర్వాత గోరు వెచ్చటి నీటితో కడిగేస్తే చర్మం పొడిబారకుండా ఉంటుంది.
- చెంచా తినేసోడా, చెంచా తేనె, అర చెంచా ఆలివ్ ఆయిల్ కలిపి ముఖానికి రాసుకోవాలి. 10 నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేయండి.

న్యూస్‌క్లిక్ కేసులో ఢిల్లీ పోలీసులకు సుప్రీం నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ కేసును అత్యవసర విచారణ చేపట్టాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ముందు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ప్రస్తావించారు. అయితే ఈ కేసు సోమవారం విచారణకు వచ్చినప్పుడు, ధర్మాసనం ఢిల్లీ పోలీసుల ప్రతిస్పందనను కోరుతూ రెండు పిటిషన్లకు సంబంధించి నోటీసు జారీ చేసింది.

పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ 'అరెస్టుకు సంబంధించిన ఆధారాలను రాతపూర్వకంగా అందించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన పంకజ్ బన్సల్ తీర్పును విస్మరించారు. అరెస్టు మెమో చూడండి. ఏమీ అందించలేదు' అని పేర్కొన్నారు. జస్టిస్ గవాయ్ జోక్యం చేసుకుని 'సెలవు ముగిసిన వెంటనే మేం ఈ పిటిషన్‌ను తీసుకుంటాం' అన్నారు. 'వైద్య కారణాలపై మధ్యంతర ఉత్తర్వుల కోసం ఒక దరఖాస్తు కూడా ఉంది. పిటిషనర్ వయస్సు 71 సంవత్సరాలు' అని పుర్కాయస్థ ప్రస్తుత వయస్సును ప్రస్తావిస్తూ కపిల్ సిబల్ ఎత్తి చూపారు. ప్రధాన పిటిషన్లతో పాటు మధ్యంతర ఉపశమనం కోసం దాఖలు చేసిన దరఖాస్తును కూడా అదేరోజు విచారిస్తామని జస్టిస్ గవాయ్ సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కు తెలిపారు.

న్యూస్‌క్లిక్ పై దాడికి వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలు విజయవంతం

సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపు మేరకు న్యూస్‌క్లిక్ మీడియా సంస్థపై జరిగిన అన్యాయమైన దాడులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలను విజయవంతంగా నిర్వహించినందుకు దేశవ్యాప్తంగా రైతులను అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అభినందించింది. చారిత్రాత్మకమైన రైతుల ఉద్యమాన్ని అణగదొక్కే లక్ష్యంతో ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టారు. ఈ మేరకు ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్ ప్రకటన విడుదల చేశారు. 'న్యూస్‌క్లిక్‌పై ఎఫ్ఐఆర్‌లో రైతుల ఉద్యమం దేశవ్యతిరేకమని, విదేశీ, తీవ్రవాద శక్తులు నిధులు సమకూరుస్తున్నాయని నిరాధారంగా ఆరోపించింది. నిబద్ధత, దేశభక్తి కలిగిన రైతుల పోరాటాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నం ఇది. చారిత్రాత్మక ఉద్యమాల స్ఫూర్తితో రైతులు, వ్యవసాయం, మండీలు, ఆహార పంపిణీపై నియంత్రణను కార్పొరేట్ దిగ్గజాలకు అప్పగించడానికి రూపొందించిన మూడు వ్యవసాయ చట్టాల వెనుక మోసపూరిత ఎజెండాను చూశారు" అని పేర్కొన్నారు.

పాలస్తీనా హక్కుల కార్యకర్త తమీమ్‌ను అరెస్ట్ చేసిన ఇజ్రాయిల్ సైన్యం

టెల్ అవీవ్ : పాలస్తీనా హక్కుల కార్యకర్త అహద్ తమీమ్ (22)ను ఇజ్రాయిల్ సైన్యం అరెస్ట్ చేసింది. హింస, ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్నారన్న అనుమానంతో సోమవారం ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు ఆర్మీ అధికార ప్రతినిధి తెలిపారు. తదుపరి విచారణ కోసం ఇజ్రాయిల్ భద్రతా దళాలకు అప్పగించినట్లు వెల్లడించారు. వెస్ట్‌బ్యాంక్‌లో నివసిస్తున్న వలసదారులను హత్య చేయాలని అమీమ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారని.. అందుకే అరెస్ట్ చేసినట్లు ఇజ్రాయిల్ మీడియా ఆరోపించింది. ఆ పోస్టును ఇజ్రాయిల్ దళాలు మీడియాకు పోస్ట్ చేశారు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఆదివారం రాత్రి ఇజ్రాయిల్ మరో రౌండ్ దాడులకు దిగిన సంగతి తెలిసిందే.

వెస్ట్‌బ్యాంక్ అంతటా ఇజ్రాయిల్ సైన్యం దాడులు చేపడుతోందని జాతీయ మీడియా పేర్కొంది. రమల్లా సమీపంలోని తమీమ్ స్వగ్రామమైన నబీ సలేహ్ నుండి ఆమెను అరెస్ట్ చేసినట్లు తెలిపింది.

ఇజ్రాయిల్ దళాలు తమ ఇంట్లో సోదాలు చేసి, కుటుంబసభ్యుల మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నాయని తమీమ్ తల్లి నామిమన్ తమీమ్ తెలిపారు. ఆమె తండ్రిని గతవారం అరెస్ట్ చేశాయని, ఇప్పటి వరకు ఆయన ఆచూకీ లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ ఆరోపిస్తున్నట్లు ఆ పోస్టులను తన కుమార్తె రాయలేదని, ఆమె పేరుమీద డజన్ల కొద్దీ పేజీలు ఆమె ఫోటోతో పాటు ఉన్నాయని, వాటితో ఆమెకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు.

బిల్లులు నాన్చొద్దు

(మొదటిపేజీ తరువాయి)

అడ్వకేట్ జనరల్ వివరణ ఇచ్చారు. జూలైలో గవర్నర్‌కు పంపిన నాలుగు ఇతర బిల్లులు ఇప్పటికీ పెండింగులోనే ఉన్నాయని తెలిపారు.

గవర్నర్ తరపున అడ్వకేట్ జనరల్, ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వి వాదనలు విన్పించారు. శాసనసభను మార్చిలో నిరవధికంగా వాయిదా వేశారని, విధానసభ నిబంధనల్లోని 16వ నిబంధనను అనుసరించి తిరిగి జూన్‌లో స్పీకర్ సమావేశాలు ఏర్పాటు చేశారని సింఘ్వి కోర్టుకు తెలియజేశారు. ఏడు కీలక బిల్లుల ఆమోదం కోసమే సమావేశాలు నిర్వహించారని వివరించారు. అయితే దీనికి గవర్నర్ అభ్యంతరం తెలిపారని అన్నారు. చరిత్రలో ఇలాంటి ఘటనలు ఎన్నడూ జరగలేదని సింఘ్వి తెలిపారు. తనకు సమర్పించిన బిల్లులపై గవర్నర్ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని అడ్వకేట్ జనరల్ చెప్పారు.

'ఇక్కడ దిగ్భ్రాంతి కలిగించే విషయాలు జరుగుతున్నాయి. వారు అసెంబ్లీని వాయిదా వేయకుండా అలాగే కొనసాగించారు. ప్రజలను అవమానించాలని అనుకున్నప్పుడల్లా సమావేశం నిర్వహించారు. ఇది అనవసరపు వ్యాజ్యం. గవర్నర్ చర్య తీసుకున్నారు. ఆయన బిల్లుల్ని పరిశీలించడమో లేదా రాష్ట్రపతికి నివేదించడమో చేశారు. నేను ఆయన నుండి ఆదేశాలు తీసుకొని శుక్రవారం విచారణకు వస్తాను' అని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. మార్చిలో నిరవధికంగా వాయిదా వేసి తిరిగి మూడు నెలలకే సమావేశాలు నిర్వహించడమేమిటని సుప్రీంకోర్టు అసెంబ్లీ చర్యను ప్రశ్నించింది. కేరళ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కేకే వేణుగోపాల్ జోక్యం చేసుకుంటూ కీలక బిల్లులను ఆమోదించకుండా రాష్ట్ర గవర్నర్ పక్కన పెట్టడాన్ని ప్రశ్నిస్తూ తమ ప్రభుత్వం కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించిందని తెలిపారు. 'కొన్ని బిల్లులు రెండేళ్లకు పైగా ఆయన వద్ద పెండింగులో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు వెళుతోందని ఆయనకు చెబితే చూద్దాం...మేము దీనిపై పోరాడతాం అని జవాబిచ్చారు' అని అన్నారు.

తమిళనాడు తరపున సీనియర్ న్యాయవాది పి.విల్సన్ హాజరయ్యారు. గవర్నర్ వైఖరిని ఆయన తప్పుపట్టారు. రాష్ట్ర ప్రజల తీర్పును గవర్నర్ అవహేళన చేస్తున్నారని అన్నారు. బిల్లుల్ని పంపితే గవర్నర్ వాటిని ఆమోదించడం లేదు...తిప్పి పంపడమూ లేదు అని తెలిపారు. రాష్ట్రంలో గవర్నరే రాజకీయ శత్రువుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నెలల తరబడి బిల్లుల్ని తన వద్ద అట్టే పెట్టుకొని రాజ్యాంగ ప్రతిష్టంభనకు కారణమవుతున్నారని చెప్పారు.

తెలంగాణలో గత సంవత్సరం సెప్టెంబర్ నుండి పెండింగులో ఉన్న బిల్లుల్ని గవర్నర్ చాలా నెమ్మదిగా ఆమోదిస్తున్న వ్యవహారంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్న విషయం తెలిసిందే. కాగా ప్రభుత్వ యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల నియామకం విషయంలో గవర్నర్లు అనుసరిస్తున్న వైఖరిని ఎత్తిచూపుతూ పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో ఇప్పటికే పిటిషన్లు దాఖలు చేశాయి.

కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి సవాల్

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. అనంతరం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ చరిత్రలో కొడంగల్‌కు మొదటిసారి మంచి అవకాశం వచ్చిందని, ఇదంతా కొడంగల్ ప్రజలు ఇచ్చిందేనని తెలిపారు. కొడంగల్‌కు కృష్ణా జలాలు, జూనియర్ కళాశాలలు, కంపెనీలు వస్తాయని, సిద్దిపేట, సిరిసిల్ల వలే ఈ ప్రాంత అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యేని గెలిపిస్తే ఏం చేశారని ప్రశ్నించారు. ఈ ప్రాంతానికి కృష్ణా జలాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, సిమెంటు ఫ్యాక్టరీలు, మహబూబ్ నగర్-చించోలి జాతీయ రహదారి పనులు పూర్తికాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని తీసుకువస్తే దాన్ని కలరాసారన్నారు, గొల్ల, కురుమ సోదరులు రూ.40 వేలు డీడీలు కట్టినా ఇప్పటికీ గొర్రెలు పంపిణీ చేయలేదని విమర్శించారు. కొడంగల్ ప్రజలు ఓట్లు వేసి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించుకుంటే కొడంగల్ ప్రాంతానికి ఎందుకు న్యాయం చేయలేదన్నారు.

కొడంగల్ బిడ్డలు ఏ ప్రాంతానికి వెళ్లినా కొడంగల్ అంటే కుర్చీ వేసి కూర్చోబెట్టే విధంగా కృషి చేస్తానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించాలని, మీ బిడ్డగా వెళుతున్నానని, కొడంగల్ ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జగదీశ్వర్ రెడ్డి, మండలాధ్యక్షులు నందరం ప్రశాంత్, టీపీసీసీ ప్రతినిధి యూసుఫ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణంరాజు, పట్టణ అధ్యక్షులు నయుం, దౌల్తాబాద్ మండల అధ్యక్షులు వెంకట్ రావు, బోడి వెంకట్ రెడ్డి, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాజెక్టులతో పాలమూరు సస్యశ్యామలం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. కృష్ణ, తుంగభద్ర ప్రధాన నదుల మధ్యలో ఉన్న నడిగడ్డ ప్రాంతాన్ని సమైక్యరాష్ట్రంలో ఏనాడు పట్టించుకోలేదని, కానీ నేడు తుమ్మిళ్లగట్టు ఎత్తిపోతల పథకాల ద్వారా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. గద్వాల ప్రాంతంలో వాల్మీకి, బోయలు ఎక్కువగా ఉంటారని, ఆంధ్రాలో వారు ఎస్టీలని, ఇక్కడ మాత్రం బీసీలని, అందుకే మన రాష్ట్రంలోనూ వారిని ఎస్టీల్లో కలిపేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని, అయినా ఫలితం లేదని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ పార్టీ మంచి కార్యక్రమాలు చేసి ఉంటే.. దళితుల పరిస్థితి ఈ రోజు ఇలా ఉండేది కాదన్నారు. దళితులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని, తాము అలా చేయడం లేదని తెలిపారు. పచ్చగా ఉన్న తెలంగాణను మళ్లీ కరగనాకేందుకే కాంగ్రెస్ సిద్ధమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమైక్య రాష్ట్రంలో పాలమూరును మరిచిపోయినప్పటికీ అక్కడి నాయకులు వస్తే గద్వాలలో వారికి మంగళ హారతులతో స్వాగతం పలికారని గుర్తుచేశారు. రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని, మెడికల్ కళాశాలలు, నవోదయ పాఠశాలల వంటి విషయంలో వివక్ష కనబరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ తర్వాత రెండో మున్సిపాలిటీగా నారాయణపేట ఏర్పడిందన్నారు. నారాయణపేట, కొడంగల్, మక్తల్‌కు నీళ్లు ఇచ్చే కాల్వలను మంజూరు చేశారని, టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే కాల్వలను పూర్తి చేసుకుందామని తెలిపారు. రైతుబంధు, 24 గంటల విద్యుత్తు, ధరణి వంటి ప్రజా పథకాలను రద్దుచేస్తామన్న కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో విసిరేయాలని పిలుపునిచ్చారు. గద్వాల్‌ను గబ్బు పట్టించింది కాంగ్రెస్ నాయకులేనని, ఆర్‌డీఎస్ కాలువను ఆగం పట్టించారని విమర్శించారు. ఆ పార్టీని నమ్మితే నట్టేటముంచుతారని తెలిపారు.

కరివెన రిజర్వాయర్ పనులు పూర్తి కావొచ్చాయని, అందుబాటులోకి వస్తే దేవరకద్ర నియోజకవర్గంలో మొత్తం 1.50లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పాలమూరు-రంగారెడ్డి పథకం అడ్డంకులన్నీ తొలగిపోతున్నాయని తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఏం జరిగిందో మీ కండ్ల ముందే ఉందని, ఆ అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎలక్షన్లు వస్తాయి.. పోతాయి.. కానీ మీరు వేసే ఓటు మీ ఐదేండ్ల భవిష్యత్తును నిర్ణయిస్తుందని, మీ తలరాతను మార్చేస్తుందని స్పష్టంచేశారు. అభ్యర్థులను ఎంపిక విషయంలో గాబరా కావద్దని, వజ్రాయుధం లాంటి ఓటును ఉపయోగించి మంచి సేవకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. సభల్లో మంత్రులు శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి, పి. చంద్రశేఖర్, మాజీ ఎంపీలు రావుల చంద్రశేఖర్ రెడ్డి, జగన్నాథం, ఎంపీ రాములు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో సరి-బేసి విధానం!

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. అలాగే 11వ తరగతి వరకు పాఠశాలల సెలవులను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు.

గత వారం రోజులుగా రాజధాని ఢిల్లీతో పాటు ఎన్‌సీఆర్ పరిధిలో దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నేడు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశం అనంతరం పర్యావరణ మంత్రి గోపాల్ రారు మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ వ్యాప్తంగా అన్ని పాఠశాలలను నవంబర్ 10 వరకు మూసివేయాల్సిందిగా తెలిపారు. అయితే 10, 12 తరగతులకు మినహాయింపునిస్తున్నట్లు ప్రకటించారు. గతంలో ప్రాథమిక పాఠశాలలకు మాత్రమే సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. బాణాసంచా కాల్చడంపై నిషేధం, స్మాగ్ గన్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బిఎస్3 పెట్రోల్, బిఎస్4 డీజిల్ వాహనాలపై నిషేధాన్ని పొడిగిస్తున్నామని పేర్కొన్నారు.

డీజిల్ ట్రక్కులను అనుమతించకూడదని, నిర్మాణ కార్యకలాపాలపై నిషేధం విధించేలా ఢిల్లీ వ్యాప్తంగా స్టేజ్ -4 చర్యలు అమలు చేయాలని గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్ఏపీ) ఆదేశించింది.

దడ పుట్టిస్తున్న ఉల్లి

(మొదటిపేజీ తరువాయి)

అమ్మకాలు సాగిస్తుంటే సామాన్యుని మెనులో గత కొద్ది రోజులుగా అది మిస్సవుతోంది. డిమాండ్, సప్లై అధారంగా నడిచే నేటి మార్కెట్ ప్రపంచంలో అయితే అతి వృష్టి, లేకుంటే అనావృషి... ఏ సరుకుల ధరలు ఎప్పుడు ఆకాశాన్నంటుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు పక్కింటి వాళ్ల ఒక్క ఉల్లి అడిగితే గిన్నె నిండా ఇచ్చే వారు. కాని నేడు సామాన్యుని మొదలుకుని సంపన్నుని వరకు ఉల్లిని దాచి దాచి కూరల్లో వాడుకుంటున్నారు. మొన్న టమాట నేడు ఉల్లి ధరలు సామాన్యులకు కన్నీరు పెట్టిస్తున్నాయి. నెల రోజుల క్రితం 5 కిలోలకు రూ.100 పలికిన ఉల్లి నేడు కిలోన్నరకు వంద పలుకుతోంది. డిమాండ్‌కు సరిపడా ఉల్లి రవాణా లేక పోవడంతో ధర అమాంతం పెరిగిందని వ్యాపారులు అంటున్నారు. కొత్త పంట వచ్చే వరకు మరో నెల రోజుల పాటు ఉల్లి ధర ఇలాగే ఉంటుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


తగ్గిన సరఫరా

నాలుగు కోట్ల జనాభా ఉన్న తెలంగాణ రాష్ట్రానికి ప్రతి నెలా దాదాపు 40 వేల మెట్రిక్ టన్నుల ఉల్లి పాయలు అవసరమవుతాయని మార్కెటింగ్ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.రాష్ట్ర ప్రజల అవసరాలకు కావల్సిన ఉల్లిలో సగం మాత్రమే స్థానికంగా ఉత్పత్తి అవుతోంది. రాష్ట్రంలో ఉల్లిని సాగు చేసే మహబూబ్‌నగర్, నిజామాబాద్, కామారెడ్డి తదితర జిల్లాల్లో సైతం ఈ సారి సాగు విస్తీర్ణం తగ్గించడంతో దిగుబడి తగ్గింది. దీనికి తోడు తెలంగాణకు ప్రధాన ఉల్లి సరఫరా చేసే రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు దేశ వ్యాప్తంగా ఉల్లి దిగుబడి తగ్గడంతో నెల కొన్న సంక్షోభ నేపథ్యంలో ఒక్కసారిగా ధరలకు రెక్కలొచ్చాయి. రాష్ట్రంలోనే అతి పెద్ద ఉల్లి మార్కెట్‌గా పేరు గాంచిన మలక్‌పేట మార్కెట్‌కు సాధారణ రోజుల్లో 100 మెట్రిక్ టన్నుల ఉల్లి దిగుమతి అవుతుంది. కాని గత నెల రోజులుగా సగానికి తగ్గి 50 మెట్రిక్ టన్నులకు తగ్గి పోయింది. ఇదే పరిస్థితి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నెలకొందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

పాలస్తీనాపై మారణకాండ ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

ఆయుధాల సరఫరాను వెంటనే ఆపాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా,ఎఐఎఫ్‌బి నేత జి.దేవరాజన్, సిపిఐ(యంఎల్)నేత దీపాంకర్ భట్టాచార్య ఆర్ఎస్‌పి నేత మనోజ్ భట్టాచార్య సోమవారం నాడిక్కడ ఈ మేరకు ఒక సంయుక్త ప్రకటన విడుదలజేశారు. పాలస్తీనియన్లపై అమెరికా-ఇజ్రాయిల్ జరిపే ఊచకోతకు మద్దతునివ్వడం ఆపాలని మోడీ ప్రభుత్వాన్ని కోరాయి. తక్షణమే కాల్పుల విరమణ జరిగేలా చూడాలని అంతర్జాతీయ సమాజం ఇస్తున్న పిలుపులో భాగస్వామ్యం కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. నిరసనలు, ఆందోళనలకు సంబంధించిన విధి విధానాలను వామపక్ష పార్టీల రాష్ట్ర శాఖలు నిర్ణయిస్తాయని ఆ ప్రకటనలో తెలిపారు.






ప్రపంచకప్‌లో నేడు
అఫ్గనిస్థాన్ x ఆస్ట్రేలియా
వేదిక : ముంబయి
సమయం : మ॥ 2.00
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

చాంపియన్ పంజాబ్

మొహాలి : దేశవాళీ సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీ చాంపియన్‌గా పంజాబ్ నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్లో బరోడాపై 20 పరుగుల తేడాతో ఆ జట్టు గెలుపొందింది. అన్మోల్‌ప్రీత్ సింగ్ (113, 61 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సులు), నెహల్ వదేరా (61 నాటౌట్) ధనాధన్ ఇన్నింగ్స్‌లతో తొలుత పంజాబ్ 223/4 పరుగులు చేసింది. ఛేదనలో అభిమన్యు (61), నినద్ (47), కృనాల్ పాండ్య (45) మెరిసినా బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులే చేసింది.



శ్రీలంకపై బంగ్లా గెలుపు

● ఛేదనలో నజ్ముల్, షకిబ్ దూకుడు ● శ్రీలంక 279/10, బంగ్లాదేశ్ 282/7

న్యూఢిల్లీ : ఐసీసీ ప్రపంచ కప్ గ్రూప్ దశ మ్యాచ్‌లో శ్రీలంకపై బంగ్లాదేశ్ ఊరట విజయం సాధించింది. సెమీ ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించిన ఈ రెండు జట్లు ఐసీసీ 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించేందుకు పోటీపడుతున్నాయి. సోమ వారం న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంకపై బంగ్లాదేశ్ 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. 280 పరుగుల లక్ష్యాన్ని బంగ్లాదేశ్ ఏడు వికెట్లు కోల్పోయి 41.1 ఓవర్లలో ఛేదించింది. నజ్ముల్ హుసేన్ షాంటో (90, 101 బంతుల్లో 12 ఫోర్లు), షకిబ్ అల్ హసన్ (82, 65 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సులు) అర్థ సెంచరీలతో బంగ్లాదేశ్ విజయాన్ని ఖరారు చేశారు. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగులకు ఆలౌటైంది. చరిత్ అసలంక (108, 105 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సులు) సెంచరీతో శ్రీలంకకు మెరుగైన స్కోరు అందించాడు. ఛేదనలో బంగ్లాదేశ్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. గ్రూప్ దశలో బంగ్లాదేశ్‌కు ఇది రెండో విజయం కాగా.. శ్రీలంకకు ఆరో ఓటమి.

మాథ్యూస్ టైమ్డ్ అవుట్



బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో శ్రీలంక బ్యాటర్ ఏంజెలో మాథ్యూస్ ఊహించని రీతిలో అవుటయ్యాడు. శ్రీలంక ఇన్నింగ్స్ 24.2 ఓవర్లో సదీర సమరవిక్రమ నిష్క్రమణతో క్రీజులోకి వచ్చిన మాథ్యూస్ బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యాడు. హెల్మెట్‌ను కాస్త బిగించి కట్టుకునే సమయంలో ఆ స్ట్రిప్ తెగిపోయింది. దీంతో మరో హెల్మెట్ కావాలని డ్రెస్సింగ్‌రూమ్‌కు సైగలు చేయగా.. చామిక కరుణరత్నె హెల్మెట్‌తో గ్రౌండ్లోకి వచ్చాడు. ఈ ప్రక్రియకు మూడు నిమిషాల 20 సెకండ్ల సమయం పట్టింది. బంగ్లాదేశ్ కెప్టెన్, ఆ ఓవర్ బౌలర్ షకిబ్ అల్ హసన్ టైమ్డ్ అవుట్ కోసం అంపైర్ మరియస్ ఎరాస్మస్‌కు అప్పీల్ చేశాడు. మాథ్యూస్‌ను టైమ్డ్ అవుట్‌గా ప్రకటించిన ఎరాస్మస్.. శ్రీలంక శిబిరంలో, అభిమానుల్లో కలవరానికి తెరతీశాడు. తొలుత అంపైర్ నిర్ణయాన్ని నమ్మలేకపోయిన మాథ్యూస్ ఫీల్డ్ అంపైర్లతో, బంగ్లా కెప్టెన్‌తో మాట్లాడాడు. హెల్మెట్ కారణంగా ఆలస్యమైందని, అప్పీల్‌ను వెనక్కి తీసుకోమని షకిబ్‌ను కోరాడు. కానీ షకిబ్ అల్ హసన్ అందుకు నిరాకరించాడు. క్రికెట్ చరిత్రలో టైమ్డ్ అవుట్‌గా నిష్క్రమించిన తొలి ఆటగాడిగా మాథ్యూస్ నిలిచాడు. ఐసీసీ నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. రూల్ 40.1.1 ప్రకారం.. వికెట్ పడిన తర్వాత 120 సెకండ్ల లోపు నూతన బ్యాటర్ క్రీజులోకి వచ్చి బంతిని ఎదుర్కోవాలి. లేదంటే టైమ్డ్ అవుట్‌గా కొత్త బ్యాటర్ నిష్క్రమించాల్సి ఉంటుంది'. షకిబ్ క్రీడా స్ఫూర్తిని సమాధి చేశాడంటూ సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తగా.. నిబంధనల ప్రకారమే నడుచుకున్నాడని బంగ్లా శిబిరం సమర్థిస్తోంది.

గ్రాండ్ స్విస్‌లో డబుల్ ధమాకా

● చాంపియన్లుగా విదిత్, వైశాలి ● ఫిడె గ్రాండ్ స్విస్ టోర్నీ 2023



న్యూఢిల్లీ : చారిత్రక ఫిడె గ్రాండ్ స్విస్ టోర్నీలో భారత చెస్ స్టార్స్ చరిత్ర సృష్టించారు. 113 మంది పోటీపడిన మెన్స్ విభాగంలో విదిత్ గుజరాతీ, 50 మంది పోటీపడిన మహిళల విభాగంలో ఆర్. వైశాలి చాంపియన్లుగా నిలిచారు. చెస్ దిగ్గజాలు బరిలో నిలిచిన ఈ టోర్నీలో విదిత్ గుజరాతీ, ఆర్. వైశాలి అంచనాలకు మించి రాణించారు. మెన్స్ విభాగంలో 113 మంది ఆటగాళ్లు పోటీపడగా అందులో ఏకంగా 106 మంది గ్రాండ్‌మాస్టర్లు, ఏడుగురు అంతర్జాతీయ మాస్టర్స్ ఉన్నారు. 15వ సీడ్‌గా బరిలో నిలిచిన విదిత్ గుజరాతీ కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. ఫైనల్ రౌండ్‌ను మూడో స్థానంలో నిలిచి మొదలుపెట్టిన విదిత్ గుజరాతీ.. రష్యా గ్రాండ్‌మాస్టర్ అలెగ్జాండర్ ప్రెడ్కెపై 47 ఎత్తుల్లో విజయం సాధించి అగ్రస్థానంలోకి దూసుకెళ్లాడు. సహచర మాస్టర్లు అర్జున్, అనిశ్‌లు సైతం విదిత్ విజయంలో తమ వంతు పాత్ర పోషించారు. ఫైనల్ రౌండ్లో నకమురను అర్జున్, ఎస్పెంకోను అనీశ్ ఓడించటంతో విదిత్ నం.1 స్థానంలోకి వచ్చాడు. 8.5 పాయింట్లతో విదిత్ గుజరాతీ అగ్రస్థానంలో నిలువగా.. నకముర 8 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచాడు. విదిత్, నకముర ఇద్దరూ 2024 చెస్ క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధించారు. 2716 రేటింగ్‌తో టోర్నీకి వచ్చిన విదితి గుజరాత్..8.5 రేటింగ్ పాయింట్లతో 2876కు చేరుకున్నాడు. ప్రపంచ లైవ్ ర్యాంకింగ్స్‌లో 16వ స్థానానికి ఎగబాకాడు.

మహిళల విభాగంలో 12వ సీడ్ ఆర్. వైశాలి (ఆర్. ప్రజ్ఞానంద సోదరి) చరిత్ర సృష్టించింది. అసమాన ప్రదర్శనతో 2024 క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధించిన వైశాలి.. గ్రాండ్ స్విస్ విజేతగా నిలిచింది. 50 మంది పోటీపడిన మహిళల విభాగంలో 16 మంది గ్రాండ్‌మాస్టర్లు, 22 మంది ఇంటర్నేషనల్ మాస్టర్స్ సహా ఐదుగురు మహిళా గ్రాండ్‌మాస్టర్స్ ఉన్నారు. తుది రౌండ్‌కు ముందే క్యాండిడేట్స్ టోర్నీ బెర్త్ సొంతం చేసుకున్న వైశాలి.. ఫైనల్ రౌండ్లో విజయంతో టైటిల్‌ను సైతం ఖాతాలో వేసుకుంది. తుది రౌండ్లో మంగోలియా మాస్టర్ ముంగుంటుల్‌ను నిలువరించిన వైశాలి 8.5 పాయింట్లతో నం.1గా నిలిచింది. ఐదో సీడ్ అనా ముజిచక్ 8 పాయింట్లతో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మాజీ ప్రపంచ చాంపియన్ టాన్ (చైనా) పదో రౌండ్లో వైశాలి చేతిలో ఓటమితో మూడో స్థానానికి పరిమితమైంది.

2448 రేటింగ్ పాయింట్లతో గ్రాండ్ స్విస్ టోర్నీని ఆరంభించిన వైశాలి ఏకంగా 30 రేటింగ్ పాయింట్లు కైవసం చేసుకుంది. మహిళా గ్రాండ్‌మాస్టర్ హోదాకు వైశాలి మరో 2.90 రేటింగ్ పాయింట్ల దూరంలోనే నిలిచింది. భారత్ నుంచి కోనేరు హంపి, ద్రోణవల్లి హరిక మాత్రమే గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించారు.

ముగిసిన 50 కిమీ ప్రపంచ రేసు



హైదరాబాద్ : ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ అల్ట్రా రన్నర్స్ (ఐఏయు) 50 కిమీ ప్రపంచ చాంపియన్‌షిప్స్ విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగిన అల్ట్రా రన్ రేసు టైటిళ్లను కొత్త చాంపియన్లు గెల్చుకున్నారు. తొలిసారి భారత్‌లో జరిగిన ఈ ఈవెంట్‌లో మహిళల ఐఏయు 50 కిలోమీటర్ల రేసులో కార్లా మోలినరో (గ్రేట్ బ్రిటన్) 3.18.23 సెకండ్లతో విజేతగా నిలువగా.. ఆండ్రియ పొమరాన్స్కి (3.19.07, అమెరికా), సారా వెబ్‌స్టర్ (3.20.07, గ్రేట్ బ్రిటన్) టాప్-3లో నిలిచారు. మెన్స్ 50 కిమీ రేసును 2.48.20 సెకండ్లలో ముగించిన స్పెయిన్ అల్ట్రా రన్నర్ చాకిబ్ లాచ్‌గర్ టైటిల్ సొంతం చేసుకోగా.. స్పెయిన్‌కే చెందిన అలెగ్జాండ్రో (2.49.30), జీసెస్ ఏంజిల్ (2.50.12) రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. జట్టు విభాగాల్లో గ్రేట్ బ్రిటన్ (ఉమెన్), స్పెయిన్ (మెన్) విజేతలుగా నిలిచాయి.

డిసెంబర్ 19 నుంచి టీపీఎల్

● తొలి సీజన్ రెండో అంచె పోటీలు



హైదరాబాద్ : తైక్వాండో ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) తొలి సీజన్ రెండో అంచె పోటీలు డిసెంబర్ 19 నుంచి 21 వరకు జరుగనున్నాయి. ఈ మేరకు సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు వెల్లడించారు. రెండో అంచె పోటీలు ప్రత్యేకించి యువ క్రీడాకారుల(అండర్-17) ఉద్దేశించి నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ గ్లైడర్స్, హర్యానా హంటర్స్, బెంగళూర్ నింజాస్, ఢిల్లీ వారియర్స్, మహారాష్ట్ర అవెంజర్స్, అస్సాం హీరోస్, గుజరాత్ థండర్స్, రాజస్థాన్ రెబల్స్ జట్లు టీపీఎల్ టైటిల్ కోసం పోటీపడుతున్నట్టు లీగ్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీపీఎల్ డైరెక్టర్ దువ్వూరి గణేశ్, వెంకట జంగం, నవనీత బాచు, జయంత్ రెడ్డి సహా ఫ్రాంచైజీల యజమానులు పాల్గొన్నారు.

ఎంజీఏటీ నూతన కార్యవర్గం ఎన్నిక

● అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రసాద్, రామారావు



హైదరాబాద్ : మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (ఎంజీఏటీ) సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది.

ఎల్బీ స్టేడియంలో జరిగిన వార్షిక సభ్య సమావేశంలో ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. చైర్మెన్‌గా బివిఎస్ రావు (వినయ్) ఎన్నిక కాగా.. అధ్యక్షుడిగా రాజేంద్ర ప్రసాద్, కార్యదర్శిగా రామారావు వ్యవహరించనున్నారు. ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, జరీనా సుల్తానాలు.. కోశాధికారిగా మోషిన్ అలీ రజ్వీ ఎన్నికయ్యారు.

నవంబర్ 8 నుంచి లెజెండ్స్ లీగ్

● వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌తో ట్రోఫీ టూర్



న్యూఢిల్లీ : వెటరన్ క్రికెటర్లు పోటీపడే లెజెండ్స్ లీగ్ క్రికెట్ 2023 సీజన్ నవంబర్ 8న ఆరంభం కానుంది. డిసెంబర్ 9న టైటిల్‌పోరుతో ముగియనున్న ఈ లీగ్.. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో ట్రోఫీ టూర్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా బుధవారం నుంచి 15 రోజుల పాటు 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైల్‌లో లెజెండ్స్ లీగ్ ట్రోఫీని అభిమానుల కోసం ప్రదర్శనకు ఉంచనున్నారు. ఈ సీజన్ మ్యాచులకు డెహ్రాడూన్, జమ్ము, వైజాగ్, సూరత్ నగరాల్లో వేదిక కానుండగా.. టైటిల్ కోసం ఇండియా క్యాపిటల్స్, మణిపాల్ టైగర్స్, గుజరాత్ జెయింట్స్, అర్బన్ రైజర్స్ హైదరాబాద్, సదరన్ సూపర్ స్టార్స్, బిల్వారా కింగ్స్ పోటీపడనున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

ఎదురులేని వెర్‌స్టాపెన్

● బ్రెజిల్ గ్రాండ్ ప్రీ టైటిల్ వశం



సావోపాలో : రెడ్‌బుల్ డ్రైవర్, మూడుసార్లు ప్రపంచ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఎదురులేకుండా దూసుకుపోతున్నాడు. సావోపాలోలో బ్రెజిలియన్ గ్రాండ్ ప్రీ చాంపియన్‌గా నిలిచిన మాక్స్ వెర్‌స్టాపెన్.. ఫార్ములా వన్ సీజన్‌లో ఏకంగా 17వ టైటిల్‌తో అదరగొట్టాడు. 1.56.48.894 సెకండ్లలో రేసు ముగించిన మాక్స్ వెర్‌స్టాపెన్ 25 పాయింట్లు సొంతం చేసుకున్నాడు. మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ రెండో స్థానంలో నిలిచాడు. 19 పాయింట్లు సాధించిన నోరిస్.. వేగవంతమైన ల్యాప్‌తో బోనస్ పాయింట్‌ను సైతం దక్కించుకున్నాడు.

నవచిత్రం

థగ్ లైఫ్



కమల్‌హాసన్

'నాయకుడు' తర్వాత కమల్‌హాసన్, మణిరత్నం కాంబోలో ఓ సినిమా (కెహెచ్234) ఇటీవల ప్రారంభమైన సంగతి తెలిసిందే. దాదాపు 35 ఏండ్ల తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్ రిపీట్ కానుండటంతో ప్రేక్షకులంతా దీనిపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. తాజాగా ఈ సినిమాలోని కమల్‌హాసన్ ఫస్ట్‌లుక్‌ను రివీల్ చేసి చిత్ర బృందం అందరి అంచనాలను రెట్టింపు చేసింది. నేడు (మంగళవారం) కమల్‌హాసన్ బర్త్‌డే సందర్భంగా 'థగ్ లైఫ్' అనే టైటిల్‌ని ఖరారు చేస్తూ ఓ ప్రత్యేక వీడియోను నిర్మాణ సంస్థ రిలీజ్ చేసింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, జయం రవి తదితర భారీ తారాగణమూ నటిస్తోంది. టైటిల్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా త్రిష స్పందించారు. 'కలలు చాలా సార్లు నెరవేరినప్పుడు ఎంత అదృష్టవంతులమని అనిపిస్తుంది. 'థగ్ లైఫ్'లో భాగం కావడం, కమల్‌హాసన్, మణిరత్నంలతో మరోసారి కలిసి పని చేసే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. యూనివర్స్‌కు థ్యాంక్స్ చెప్పాలని ఉంది' అంటూ త్రిష పేర్కొన్నారు.

బర్త్‌డే గిఫ్ట్.. భాగమతి 2




అనుష్క

ఫేస్ ఆఫ్ ది సినిమాగా చెప్పుకునేది హీరోనే. ఆ హీరోలకు సమానంగా ఇమేజ్‌ని సొంతం చేసుకునే కథానాయికలు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన నాయిక అనుష్క. తన అందం, అభినయం, విజయపరంపరతో హీరోలకు సమానంగా బ్రాండ్ ఇమేజ్‌ని దక్కించుకుంది. ఆమె నటించిన లేడి ఓరియెంటెడ్ సినిమాలు 'అరుంధతి, రుద్రమదేవి, భాగమతి' బాక్సాఫీస్ వద్ద తిరుగులేని విజయాల్ని సాధించి ఈ విషయాన్ని ప్రూవ్ చేశాయి. రీసెంట్‌గా అనుష్క నటించిన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది.

దాదాపు అందరు స్టార్ హీరోలతో బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకుంటూనే సోలోగా హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీస్‌తో మెప్పించడం ఒక్క అనుష్కకే సాధ్యమైంది. 'వేదం' సినిమాలో సరోజ క్యారెక్టర్‌లో అనుష్క నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. 'అరుంధతి, వేదం, రుద్రమదేవి' సినిమాల్లోని నటనకు 'ఫిలిమ్ ఫేర్' పురస్కారాలు వరించాయి. 'బాహుబలి సినిమాలోని 'దేవసేన' పాత్రలో అనుష్క నటన ఆమెను కెరీర్‌లో అగ్ర స్థానంలో నిలబెట్టింది. 'సైజ్ జీరో' సినిమా కోసం అనుష్క చేసిన హార్డ్ వర్క్ సినిమా పట్ల ఆమెకున్న కమిట్ మెంట్ తెలియజేసింది. చిరంజీవి నటించిన 'సైరా నరసింహారెడ్డి'లో అనుష్క ఝాన్సీ లక్ష్మీబాయి పాత్రలో చిరస్మరణీయమైన పాత్రలో కనిపించారు.2021లో విడుదలైన 'నిశ్శబ్దం' ఆమె గొప్ప నటనకు మరో ఉదాహరణగా నిలిచింది. అనుష్క అద్భుతమైన నట ప్రయాణం మరిన్ని ఆసక్తికర సినిమాలతో ముందుకు సాగనుంది. ఇందులో భాగంగా ఆమె బర్త్‌డే కానుకగా అనుష్క 50వ సినిమా 'భాగమతి-2'ని యూవీ క్రియేషన్స్‌లో భారీగా ప్లాన్ చేయటం విశేషం.

ఈగల్.. విశ్వరూపం



రవితేజ

రవితేజ నటిస్తున్న ఇంటెన్స్ అండ్ యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 13న విడుదలకు సిద్ధమవుతోంది. లేటెస్ట్‌గా టీజర్‌ని విడుదల చేసి మేకర్స్ ప్రమోషన్స్‌ను ప్రారంభించారు.

'కొండలో లావాని కిందకి పిలవకు... ఊరు ఉండదు...నీ ఉనికి ఉండదు' అంటూ రవితేజ పవర్‌ఫుల్ వాయిస్ ఓవర్‌తో, స్ట్రాంగ్ వార్నింగ్ ఇస్తూ టీజర్ ఓపెన్ అయ్యింది. ప్రజలకు అపోహగా, ప్రభుత్వాలు దాచిపెట్టిన కథగా హీరో చేసే విధ్వంసాన్ని విజువల్స్ అద్భుతంగా ప్రజెంట్ చేశాయి. చివరిగా రవితేజ పవర్ ఫుల్‌గా పరిచయమౌతూ డిఫరెంట్ అవతార్స్‌లో ప్రేక్షకులను మెస్మరైజ్ చేశారు.

అనుపమ పరమేశ్వరన్, శ్రీనివాస్ అవసరాల మధ్య సంభాషణ, నవదీప్ మాటలు రవితేజ పాత్రకు మరింత ఎలివేషన్ ఇచ్చాయి. వినయ్ రాయ్ డెడ్లీ విలన్‌గా కనిపించారు. కావ్యా థాపర్ మరో కథానాయిక కాగా, మధుబాల కీలక పాత్రలో కనిపించనుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

అంచనాలకు మించి..



ఎస్.జె.సూర్య, రాఘవ లారెన్స్

రాఘవ లారెన్స్, ఎస్.జె.సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన హై యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్' దీపావళి సందర్భంగా ఈ నెల 10న రిలీజ్ అవుతుంది. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో స్టోన్ బెంచ్ ఫిలింస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని కార్తికేయన్ నిర్మించారు. ఈ చిత్రాన్ని తమిళ్, తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా రాఘవ లారెన్స్, ఎస్.జె.సూర్య మీడియాతో మాట్లాడారు.

'కార్తీక్ సుబ్బరాజ్‌పై నమ్మకంతో ఈ సినిమాను చేయటానికి రెడీ అయ్యాం. 'జిగర్ తండ" సినిమానే నేను చేయాల్సింది. కానీ మిస్ అయ్యింది. దాంతో రెండో పార్ట్‌లో నటిద్దామని నేనే కార్తీక్ సుబ్బరాజ్‌ని అప్రోచ్ అయ్యాను. ఇదొక పీరియాడిక్ మూవీ. మంచి బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. సినిమాలో యాక్షన్ పార్ట్‌తో పాటు సెకండాఫ్‌లో మంచి ఎమోషనల్ కంటెంట్‌తో కొత్తగా ఉంటుంది. ఇప్పటి వరకు మీరు చూసిన రాఘవ లారెన్స్‌ను కాకుండా కొత్త లారెన్స్‌ను చూస్తారు. త్వరలోనే ముని 5, కాంచన 4 మొదలు పెడుతున్నాను. రజినీకాంత్ సినిమాలో విలన్‌గా నటిస్తున్నానంటూ వార్తలు వస్తున్నాయి. దాని గురించి ఇప్పుడేం మాట్లాడలేను. అన్నీ కరెక్ట్‌గా కుదిరితే మేకర్స్ చెబుతారు'.

- రాఘవ లారెన్స్

'ఈ సినిమాను వంద కోట్లకు పైగా ఖర్చు పెట్టి నిర్మించారు ప్రొడ్యూసర్ కార్తికేయన్. జిగర్ తండ సక్సెస్‌ఫుల్ సినిమా కావటంతో జిగర్ తండ డబుల్ ఎక్స్ సినిమాపై అంచనాలు ఎక్కువగానే ఉంటాయని తెలుసు. అయితే ఆ ఎక్స్‌పెక్టేషన్స్‌ని రీచ్ అవుతామని అనుకుంటున్నాం. లారెన్స్ గ్యాంగ్‌స్టర్.. నేనేమో డైరెక్టర్ కావాలనుకుని యాక్ట్ చేసే వ్యక్తి. మూవీలో కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు మంచి మెసేజ్ కూడా ఉంది'.

- ఎస్.జె.సూర్య

ఆద్యంతం హాస్యభరితం సోదరా..



సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్ ముఖ్యపాత్రల్లో 'సోదరా' మూవీని నిర్మిస్తున్నారు. అన్నదమ్ముల బంధం ఎంత గొప్పదో మనందరికీ తెలుసు. అలాంటి అన్నదమ్ముల బంధాన్ని వెండితెరపై మనకు ఆవిష్కరించబోతున్న చిత్రమే ఇది.

తెలుగు చిత్రసీమలో ఎందరో సోదరులు ఉన్నారు. అలాంటి సోదరులందరి బంధాన్ని అద్దం పట్టేలా చూపించడానికి ఈ సినిమా వస్తుందని అంటున్నారు మేకర్స్. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన లభించగా, తాజాగా సోమవారం మూవీ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. సంపూర్ణేష్ బాబు, సంజోష్ ఇద్దరు పెళ్లి కొడుకు గెటప్స్‌లో ఒకరు తాళి, ఒకరు రోజా పువ్వు పట్టుకొని ఉండగా వెనక మేళతాళాలతో ఉన్న పోస్టర్‌ని రిలీజ్ చేశారు. పోస్టర్ ని చూస్తుంటే ఈ సినిమా ఆద్యంతం హాస్య భరితంగా ఉండేలా దర్శకుడు మన్మోహన్ మేనంపల్లి ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్టు తెలుస్తోంది. త్వరలోనే ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేయబోతున్నారు. అలాగే సినిమాను కూడా ప్రేక్షకుల ముందుకు అతి త్వరలోనే తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

పోలీసులే కేసులో ఇరుక్కుంటే..?



రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలకపాత్రలు పోషిస్తున్న చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. 'అర్జున ఫల్గుణ' ఫేమ్ తేజ మార్ని డైరెక్ట్ చేస్తుండగా, గీతా ఆర్ట్స్ 2 బ్యానర్‌పై బన్నీ వాస్, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్నారు. సోమవారం ప్రసాద్ ల్యాబ్స్‌లో టీజర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈ చిత్ర టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ, 'రాజకీయ నాయకులు పోలీసులను ఎలా వాడుకుంటున్నారనే దానిపైనే సినిమా ఉంటుంది. పోలీసులు పడే ఇబ్బందులు, బాధలు ఇందులో ఉంటాయి. చాలా సంతృప్తిని ఇచ్చిన కథ ఇది' అని అన్నారు. 'ఇదొక హానెస్ట్ అటెంప్ట్. ఈ నెల 24న ప్రేక్షకులను అలరించడానికి వస్తున్నాం' అని రాహుల్ విజయ్ చెప్పారు. దర్శకుడు తేజ మార్ని మాట్లాడుతూ, 'నేరస్థులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం' అని అన్నారు. 'తేజ డైరెక్షన్‌తో పాటు కాశీ నాగేంద్ర రాసిన డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. ఎలక్షన్స్‌లో పాల్గొనే వారికి, పొలిటీషియన్స్‌కు ఈ సినిమాలోని కొన్ని సీన్స్ ప్రభావితం చేసేలా ఉంటాయి. కొన్ని రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా దీన్ని రూపొందించారు. సిస్టమ్ పాలిటిక్స్‌కు ఎలా లొంగిపోయిందనేది కాన్సెప్ట్. ఏ పార్టీకి కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు' అని నిర్మాతలు బన్నీవాస్, విద్యా కొప్పినీడి అన్నారు.

ఆ ఎమోషన్ వెంటాడుతుంది..



మారేష్ శివన్

దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణలు ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. విజన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై కొమ్మాల పాటి శ్రీధర్ సమర్పిస్తు న్నారు. మారేష్ శివన్ దర్శకుడు. కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మాత. ఈనెల 10న ఈ చిత్రం విడుదల కాబోతోంది. ఈ క్రమంలో దర్శకుడు మారేష్ శివన్ మీడియాతో మాట్లాడుతూ, 'ప్రతీ మనిషిలో జరిగే కథ ఇదే. ప్రేమ, లక్ష్యం ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు?, ఏం చేయాలి అనే మెసెజ్‌తో మూవీని తీశాను. చిత్రాన్ని చూసిన తరువాత కొంత మంది అయినా సరే మారుతారు. థియేటర్ నుంచి బయటకు వచ్చిన తరువాత కూడా అదే ట్రాన్స్‌లో ఉంటారు. నా జీవితం అనే కాదు.. ప్రతీ ఒక్కరి జీవితంలో ఇలాంటి సంఘటనలు జరిగి ఉంటాయి. సినిమాలోని కొన్ని సన్నివేశాలు చూస్తున్నప్పుడు అరె.. ఇలాంటివి మన జీవితంలోనూ జరిగాయి కదా అని ప్రతి ఒక్కరూ అనుకుంటారు. అందుకే ఈ సినిమా అందరికీ బాగా కనెక్ట్ అవుతుందని నమ్మకంగా చెప్పగలను. మా సినిమా కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా. సెన్సార్ బోర్డ్ యు/ఎ సర్టిఫికెట్ ఇచ్చింది. ఈ చిత్రాన్ని మా నిర్మాత ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు. తొలుత 200 థియేటర్లలో విడుదల చేస్తున్నాం. మౌత్ టాక్ బాగుంటే మళ్లీ థియేటర్లను పెంచాలని అనుకుంటున్నాం. ఇలాంటి ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు మా చిత్ర బృందం అంతా గర్వంగా ఫీల్ అవుతున్నాం. మంచి కంటెంట్ ఉన్న సినిమాలను మన ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. ఆ కోవలోకే ఈ సినిమా కూడా చేరుతుందని ఆశిస్తున్నాం' అని తెలిపారు.

సర్కారు వస్తదో..రాదో? పెండింగ్ బిల్లులు ఇస్తదో..ఇయ్యదో !!

ప్రచారంలో మంత్రులు,ఎమ్మెల్యేలకు కాంట్రాక్టర్ల సెగ

- హెచ్‌వోడీలపై తీవ్ర ఒత్తిడి
- ప్రభుత్వాఫీసుల్లో ఘర్షణ వాతావరణం
- నాలుగు ఇంజినీరింగ్ శాఖల్లో
- రూ. 18 వేల కోట్ల బకాయిలు !

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్





రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల రాజకీయ ప్రచారం జోరుగా సాగుతున్నది. గ్రామాలు, మండలాలు, జిల్లాల్లో సీఎం దగ్గర నుంచి మొదలు, కిందిస్థాయి వరకు అందరూ ప్రచారపర్వంలో మునిగితేలుతున్నారు. ఎన్నికల పేర ఎన్నో వింతలు, విశేషాలు చోటుచేసుకుంటున్నాయి. అందులో ప్రజాసమస్యలు సైతం ఉంటున్నాయి. గ్రామాల్లో ఎక్కడ చూసినా ప్రచారహోరు కనిపిస్తున్నది. మంత్రులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష నేతల హడావిడి అంతాఇంతా కాదు. ఇదే సందనుకున్న చోటామోటా కాంట్రాక్టర్లు సందట్లో సడేమియాలా మా పెండింగ్ బిల్లులు ఇప్పించాలంటూ మంత్రులు, ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నారు. ఇస్తివా, చస్తివా అన్న పద్దతిలో వారిని నిలదీస్తున్నారు. తాజా ఎన్నికల్లో బీఆర్ఎస్ సర్కారు వస్తదో, రాదోననే మీమాంస చిన్న కాంట్రాక్టర్లను వేధిస్తున్నది. ఆందోళనకు గురిచేస్తున్నది. కొత్త ప్రభుత్వం వస్తే తమ పరిస్థితి ఏంటనే భయాందోళన వారిలో నెలకొంది. సాగునీటిశాఖ, మిషన్‌భగీరథ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల్లో ఆయా పనులకు సంబంధించి వేల కోట్ల బిల్లులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. పెద్ద పెద్ద కంపెనీలకు పెద్దాయన అభయహస్తం ఉంది. సమయానుకూలంగా వాళ్ల ఖాతాల్లో సొమ్ము జమవుతూనే ఉంటుంది. అదే చోటామోటా కాంట్రాక్టర్లకు ఆ అండదండా లేదు. ఆసరా అసలే లేదు. దీంతో వీరంతా క్షణం నిద్రపట్టక ఆవేదనకు గురవుతున్నారు. వడ్డీలభారం పెరుగుతుంటే కన్నీటిపర్యంతమవుతున్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మంత్రుల దగ్గర తేల్చుకోవాలని నిర్ణయించుకున్నారు. ఎన్నికల ప్రచారాన్నే ఆయుధంగా మలుచుకుంటున్నారు. చోటామోటా కాంట్రాక్టర్లు కావడంతో ఓట్లు పోగేసే శక్తి వారికి ఎంతోకొంత ఉంటుందనేది అందరికి తెలిసిందే. 'మా బిల్లులు ఇప్పిస్తేనే ఓట్లు పడుతయి..లేకుంటే లేదు' అని ఖరాఖండిగా చెబుతుండటంతో మంత్రులు, పోటీలో ఉన్న అభ్యర్థులు ముఖం మాడ్చుకోవాల్సి వస్తున్నది. దీంతో చేసేదిలేక ఆయా శాఖ హెచ్‌వోడీలకు ఫోన్ల మీద ఫోన్లు చేస్తున్నారు. ఎంకి పెండ్లీ సుబ్బీచావుకొచ్చినట్టయింది మంత్రుల, ఎమ్మెల్యేల పరిస్థితి. పెండింగ్ బిల్లులు ఉన్న మాటవాస్తవమేనని, ప్రభుత్వం నిధులిస్తేనే కదా, మేము వర్కింగ్ ఏజెన్సీలకు బిల్లులు చెల్లించగలమంటూ ఆయా శాఖల హెచ్‌వోడీలు అసలు విషయం బయటపెడుతున్నారు. పెండింగ్ బిల్లులు గత మూడేండ్లుగా ఇరిగేషన్ డిపార్ట్‌మెంటులో రూ. 12 వేల నుంచి రూ. 15 వేల కోట్లు, రోడ్లు, భవనాల శాఖలో రూ. 1500 కోట్లు, మిషన్ భగీరథలో రూ. 1000 కోట్లు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖలో రూ. 600 కోట్ల వరకు ఉన్నాయి. ఇందులో సుమారు 40 శాతం నుంచి 50 శాతం వరకు చిన్న, చిన్న కాంట్రాక్టర్ల పద్దులే కావడం గమనార్హం. ఈ నాలుగు ఇంజినీరింగ్ శాఖల్లోనే మొత్తం రూ. 18,100 కోట్ల బకాయిలు ఉన్నాయని సమాచారం. ఇరిగేషన్ శాఖలో పెద్ద, పెద్ద కాంట్రాక్టర్లే పనులు చేస్తారు. వారంతా ఏకంగా ముఖ్యమంత్రి వద్దే బిల్లులు సెటిల్ చేసుకుంటారు. ఆర్థిక శాఖ ద్వారా నేరుగా నిధులు ఇప్పించుకుంటారు. వాళ్ల ఆయా శాఖల హెచ్‌వోడీలను ఇబ్బంది పెట్టరు. సమయానుకూలంగా సొమ్ము వారి ఖాతాల్లో జమవుతూనే ఉంటుంది. అలాగే చిన్న చిన్న పనులు కాంట్రాక్టర్లు మాత్రం ఏండ్ల తరబడి బిల్లుల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు చెప్పులరిగేలా తిరిగినా ఆశలు ఫలించడం లేదు. పెట్టుబడులకు తెచ్చిన నిధులకు, వడ్డీల భారం తడిసిమోపెడవుతున్నది.

ఇటీవల ఓ జిల్లా కాంట్రాక్టర్ ' మా అమ్మాయి ఆరోగ్యం బాగాలేదు..చేతిలో ఒక్కపైసాలేదు. ఏంచేయాలో అర్థంకావడం లేదు..ఏమన్నా సాయం చేయండి " అంటూ ఒక శాఖ హెచ్‌వోడీని ఆవేదనతో బతిమిలాడుకున్నారు. మరో కాంట్రాక్టర్ ' బిల్లుల కోసం రోజూ తిరుగుతున్నా..పెండ్లాం పిల్లలు బతకొద్దా. .మాకష్టాలు తీర్చండి..లేకపోతే సచ్చే పరిస్థితి ఉంది' అంటూ ఆగ్రహం వెళ్లగక్కారు. దీంతో పరిస్థితి తీవ్రత ఎలా ఉందో అర్థంచేసుకోవచ్చు. ఈ వాతావరణం ఆయా శాఖల హెచ్‌వోడీలను ఇబ్బందిపెడుతున్నది. ఏడారిలో ఓయాసిస్సులా అడపాదడపా అత్తెసరు నిధులు వచ్చినా ఎవరికీ ఇవ్వాలో, ఎవరికి ఇవ్వకూడదో అర్థంకాక హెచ్‌వోడీలు జుట్టుపీక్కుంటున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం తదితర జిల్లాల్లో పెండింగ్ బిల్లులపై మంత్రులు, ఎమ్మెల్యేలను నిలదీశారు. ఈనేపథ్యంలో ప్రజాప్రతినిధుల నుంచి హెచ్‌వోడీలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతున్నట్టు సమాచారం. దీంతో పెనంమీద నుంచి పొయ్యిలో పడినట్టయింది హెచ్‌వోడీల పరిస్థితి. ఒకవైపు నిధులు రాక, మరోవైపు కాంట్రాక్టర్ల గోల భరించలేక కార్యాలయాలకు ముఖం చాటేసే పరిస్థితి ఏర్పడుతున్నది. ఆయా కార్యాలయాలకు వచ్చే కాంట్రాక్టర్లు భౌతిక ఘర్షణలకు దిగే అవకాశా లున్నాయి. అంతేగాక బిల్లులు మంజూరు చేయాలంటూ ధర్నాలమీద ధర్నాలు సైతం చేస్తుండటం గమనార్హం.

16 మందితో మూడో జాబితా

విడుదల చేసిన కాంగ్రెస్

రెండు స్థానాలకు అభ్యర్థుల మార్పు

కామారెడ్డిలో కేసీఆర్ పై రేవంత్ రెడ్డి పోటీ

కేటీఆర్ పై కేకే మహేందర్ రెడ్డి

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల మూడో జాబితాను విడుదల చేసింది. 16 మంది అభ్యర్థులతో మూడో జాబితాను సోమవారం చేసింది. ఇందులో రెండు నియోజకవర్గాలకు అభ్యర్థులను మార్చింది. గతంలో ప్రకటించిన వారి స్థానంలో కొత్తవారిని ప్రకటించింది. నామినేషన్లు మరో ఐదు రోజుల్లో ముగియనున్నాయి. టిక్కెట్లు కోసం తీవ్ర పోటీ నెలకొన్న స్థానాలను ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రకటించింది. తొలి జాబితాలో 55 మంది, రెండో జాబితాలో 45 మంది అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్, తాజాగా 16 స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసింది. ఇంకా ఐదు స్థానాలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో సీపీఐకి ఒక స్థానం కేటాయించింది. మిగతా నలుగురు స్థానాల గురించి ఇంకా స్పష్టత రాలేదు.కామారెడ్డి నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు ఏ. రేవంత్ రెడ్డి పోటీ చేస్తున్నారు. కేటీఆర్ పోటీ చేస్తున్న సిరిసిల్ల నియోజకవర్గం నుంచి మరోసారి కేకే మహేందర్ రెడ్డి బరిలోకి దిగుతున్నారు. చెన్నూరు నుంచి ఇటీవలి కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎంపీ జి. వివేక్‌ను ప్రకటించింది.ఇదివరకు ప్రకటించిన బోథ్, వనపర్తి స్థానాల్లో అభ్యర్థులను కాంగ్రెస్ మార్చింది. బోథ్ అభ్యర్థిగా వన్నెల అశోక్ స్థానంలో ఆదే గజేందర్ ను ప్రకటించింది. వనపర్తి అభ్యర్థి చిన్నారెడ్డి స్థానంలో తూడి మేఘ రెడ్డిని రంగంలోకి దింపింది. పటాన్‌చెరు నుంచి నీలం మధు ముదిరాజ్, నిజామాబాద్ అర్బన్ కు షబ్బీర్ అలీని ప్రకటించింది. నారాయణఖేడ్ నుంచి సురేష్ షెట్కార్ ను బరిలోకి దింపింది.

అభివృద్ధే బీఆర్ఎస్‌ను గెలిపిస్తుంది

- పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్

నవతెలంగాణ బ్యూరో హైదరాబాద్ : తొమ్మిదిన్నరేండ్ల అభివృద్ధే బీఆర్ఎస్‌ను గెలిపిస్తుందని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ అబద్దాలను ప్రచారం చేస్తోందని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణను దేశం ఆదర్శంగా తీసుకుంటుంటే జీర్ణించుకోలేక విపక్షాలు అవాకులు, చెవాకులు పేలుతున్నాయని ఆరోపించారు.

కార్మికవర్గ పురిటిగడ్డ పటాన్‌చెరులో సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించాలి

- ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు
- మల్లికార్జున్‌కు బీఫామ్ అందజేత



నవతెలంగాణ-పటాన్ చెరు

కార్మికవర్గ పోరాటాల పురటి గడ్డ పటాన్‌చెరు నియోజకవర్గంలో సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన జొన్నలగడ్డ మల్లికార్జున్‌ను ప్రజలు ఆదరించి గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఇస్నాపుర్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీరం మల్లేశం అధ్యక్షతన సీపీఐ(ఎం) పటాన్ చెరు నియోజకవర్గ వర్క్‌షాప్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి చుక్క రాములు ముఖ్యఅతిథిగా హాజరై.. మల్లికార్జున్‌కి బీ-ఫామ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న సీపీఐ(ఎం)ను ప్రజలు, కార్మికులు గెలిపించాలని కోరారు. ప్రజా ఉద్యమాలను, ప్రజల గొంతుకను శాసనసభలలో వినిపించేందుకు మల్లికార్జున్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రజలు, కార్మిక, రైతులు, మహిళలు, విద్యార్థుల సమస్యల మీద అనేక పోరాటాలు చేసిన అనుభవం కలిగిన వ్యక్తిగా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే తన ఎజెండాగా పోరాటం చేస్తున్న మల్లిఖార్జున్‌ను ప్రజలు ఆదరించాలన్నారు.పేదల భూములు కాపాడాలని, కాలుష్యాన్ని అరికట్టడంలో, మెట్రో రైలు కోసం, నియోజకవర్గ సమగ్ర అభివద్ధి సాధనకై అనేక పోరాటాలు నిర్వహించిన సీపీఐ(ఎం)కు మాత్రమే ఓటు అడిగే నైతిక హక్కు ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజు, మెదక్ జిల్లా కార్యదర్శి ఏ మల్లేష్, సీనియర్ నాయకులు వాజిద్ అలీ, నరసింహారెడ్డి, పాండురంగారెడ్డి, రామచందర్, రాజయ్య, నాగేశ్వరరావు, వివిధ పరిశ్రమల కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బీసీలను విస్మరించిన కాంగ్రెస్

- మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ బీసీలను విస్మరించిందని మంత్రి హరీశ్ రావు విమర్శించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో కాంగ్రెస్ నేత నగేష్ ముదిరాజ్‌కు గులాబీ కండువా కప్పి మంత్రి ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ 2018లో తెలంగాణ ద్రోహులతో కలిసిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడూ అదే పని చేస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్ కోరుతున్న ఒక్కసారి అవకాశమిస్తే ఆగమవుతామన్నారు. 24 గంటల కరెంట్ ఇచ్చే రాష్ట్రంలో 5 గంటలు కరెంట్ ఇస్తామని కాంగ్రెస్ చెబుతున్నదని తెలిపారు.

సీపీఐ(ఎం) రెండో జాబితా

(మొదటిపేజీ తరువాయి)

ఫలితమే ఈ గెలుపు అన్నారు. ఆ తర్వాత రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తనను పక్కన పెట్టుకొని దుమ్ముగూడెం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన విషయాన్ని ప్రస్తావించారు. రూ.600 కోట్లు ప్రాజెక్టుకు కేటాయించినా నిధుల మంజూరు జాప్యం కావడంపైనా విపక్షాలతో కలిసి ఆందోళనలు నిర్వహించామన్నారు. ఆ తర్వాత ఆ ప్రాజెక్టు డిజైన్లు, పేర్లు మారినా..శంకుస్థాపనలు ఎవరు చేసినా మూలం కమ్యూనిస్టుల పట్టుదలే అన్నారు. జిల్లా సమస్యలు, కోల్‌బెల్ట్, విద్యావైద్యం, పోడుభూములు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసే చట్టాలపైనా మాట్లాడేది కేవలం కమ్యూనిస్టులేనని అన్నారు. అందుకే చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉండాల్సిన అవశ్యకత ఉందన్నారు. బాధిత, పీడితుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేది కమ్యూనిస్టులేనని తెలిపారు. పోడుహక్కు పత్రాలు, ఉపాధి బిల్లుల ఆమోదం వంటివి కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉండటం మూలంగానే సాధ్యమయ్యాయని తెలిపారు. కాబట్టి ఈ ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాల్సిందిగా పిలుపునిచ్చారు.

నిర్దిష్టమైన ప్రతిపాదన లేకుండా పొత్తులుండవు...

కాంగ్రెస్ వైపు నుంచి నిర్దిష్టమైన ప్రతిపాదన లేకుండా పొత్తులు కుదరవని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్కకు స్పష్టం చేసినట్టు తమ్మినేని చెప్పారు. ఆదివారం జానారెడ్డి, భట్టిఫోన్ చేశారని తమ్మినేని చెప్పారు. సోమవారం వంశీచందర్‌రెడ్డి ఫోన్ చేసి సీపీఐ కొత్తగూడెంతో పాటు ఒక ఎమ్మెల్సీకి అంగీకరించిందని, మీరు కూడా అంగీకరించాల్సిందిగా కోరారన్నారు. పరిస్థితులు మారాయని, కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరు బాధ్యతగా లేదన్నారు. పొత్తుల గురించి సీపీఐ(ఎం) బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల్లో వేటి వద్దకూ తాము వెళ్లలేదన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రాంతీయ పార్టీలు పుంజుకుంటున్నాయన్నారు. వామపక్షాలు పొత్తు ధర్మాన్ని పాటిస్తున్నాయన్నారు.

ప్లాట్ ఫాంపై దూసుకెళ్లిన బస్సు

విజయవాడ (బస్‌స్టేషన్): ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. బ్రేక్ ఫెయిలవ్వడంతో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి ప్లాట్ ఫాంపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. 12వ నంబర్ ప్లాట్‌ఫాం వద్ద నిరీక్షిస్తున్న ప్రయాణికులపైకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లడంతో కండక్టర్‌తోపాటు ఓ మహిళ, 10 నెలల చిన్నారి మృతిచెందారు. బస్సు డ్రైవర్ రివర్స్ గేర్‌కు బదులు ఫస్ట్ గేర్ వేయడంతో ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. ఈ ప్రమాదంతో 11, 12 ప్లాట్‌ఫాంల వద్ద దిమ్మెలు విరిగి ఫెన్సింగ్, కుర్చీలు ధ్వంసమయ్యాయి. విజయవాడలోని ఆటోనగర్ డిపోకు చెందిన బస్సు.. గుంటూరు వెళ్లాల్సి ఉండగా ఈ ఘటన జరిగింది.

కాంగ్రెస్‌తో సీపీఐ పొత్తు ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డితో సుమారు గంటసేపు సమావేశమయ్యారు. అనంతరం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఏఐసీసీ ఆదేశాల మేరకు సీపీఐతో ఒప్పందానికి వచ్చామని చెప్పారు. దేశ రాజకీయాలు ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్నాయనీ, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అన్నారు. ఇండియా కూటమిగా ఎన్నికలకు వెళ్లి ఎన్డీఏ కూటమిని ఓడించాలన్నారు. అందులో భాగంగానే సీపీఐతో పొత్తు ఖాయమైందని చెప్పారు. ఆ పార్టీకి కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు అధికారంలోకి వచ్చాక రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. సీపీఐ పోటీ చేసే కొత్తగూడెంలో గెలిచేందుకు సంపూర్ణ మద్దతు ఇస్తామని అన్నారు. కమ్యూనిస్టులు పేదలు, సామాన్యుల సమస్యలను ప్రస్తావిస్తారని చెప్పారు. శాసన సభ, శాసనమండలిలో వారి ప్రాతినిధ్యం ఉండాలన్నారు. రాజకీయ పరిస్థితులు, ఒత్తిడులపై వివరిస్తామని అన్నారు. వారు అర్థం చేసుకుని ఎన్నికల్లో సహకరించాలని కోరారు. విశాల ప్రయోజనాల దృష్ట్యా కోదండరామ్ కూడా కాంగ్రెస్‌కు సహకరిస్తు న్నారని చెప్పారు. భవిష్యత్తులో అన్ని విషయాలపై సమన్వయం కోసం కమిటీ వేస్తామ న్నారు. ఏఐసీసీ నాయకులు దీపాదాస్ మున్షి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో సీపీఐతో కాంగ్రెస్ కలిసి పని చేస్తుందన్నారు. ఇది తెలంగాణకు శుభపరిణామమని అన్నారు. ఈ స్నేహం భవిష్యత్తులోనూ కొనసాగుతుందన్నారు.

సీపీఐ(ఎం)తో కొనసాగుతున్న చర్చలు : రేవంత్

సీపీఐ(ఎం)తో చర్చలు కొనసాగుతున్నాయని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ అంశం పరిష్కారమవుతుందనీ, జాతీయ స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. సీపీఐతో చర్చలు కొలిక్కి రావడంతో ఇక్కడకు వచ్చానని వివరించారు. సీపీఐ(ఎం)తోనూ అదే తరహాలో ఉంటుందన్న ఆశ ఉందన్నారు. సీపీఐ(ఎం) అభ్యర్థులను ప్రకటించిందన్న ప్రశ్నకు ఆయన స్పందిస్తూ అభ్యర్థులను ప్రకటించినా సహకరించుకునే పరిస్థితి రాజకీయాల్లో ఉంటుందని చెప్పారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఇద్దరం కూర్చుని మాట్లాడుకుంటామని అన్నారు. కేంద్రంలో మోడీని, రాష్ట్రంలో కేసీఆర్‌ను గద్దె దించాలంటే ఇరు పక్షాలు చర్చించుకుని పరిష్కారం దిశగా పయనించాలని అన్నారు. ఎప్పటి వరకు స్పష్టత వస్తుందన్న ప్రశ్నకు వేచి చూద్దామంటూ ఆయన సమాధానమిచ్చారు.

కేసీఆర్ నియంత పాలనలో దగాపడ్డ తెలంగాణ : నారాయణ

సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలనలో తెలంగాణ దగా పడిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. ప్రజానీకాన్ని విముక్తి చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. మోడీకి వ్యతిరేకంగా ఉండే పార్టీలు, సంస్థలు, ముఖ్యమంత్రులపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో కాంగ్రెస్ మంచి పాలన అందిస్తున్నా మోడీ ప్రభుత్వం దాడులు చేయిస్తున్నదని విమర్శించారు. ఇది నీచ సంస్కృతికి నిదర్శనమని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంకు తేడాలేదనీ, ఒకతాను ముక్కలేనని అన్నారు. దేశంలో ప్రత్యామ్నాయం పేరుతో ఇండియా కూటమికి వ్యతిరేకంగా బీఆర్ఎస్, ఎంఐఎం ప్రయత్నిస్తున్నాయనీ, ప్రత్యక్షంగా, పరోక్షంగా బీజేపీకి సహకరిస్తున్నాయని వివరించారు. మద్యం కుంభకోణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయకుండా బండి సంజయ్‌ను ఇంటికి పంపించారని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పరస్పర అవగాహన ఉంది కాబట్టే కవితను అరెస్టు చేయలేదన్నారు. అంతకు మించిన దొంగలు బయట ఉన్నారనీ, సిసోడియాను అరెస్టు చేశారని అన్నారు. పెద్ద కుంభకోణాలు చేసిన వారున్నా వారి జోలికి పోవడం లేదనీ, కొందరిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని కాపాడ్డమే తమ లక్ష్యమన్నారు. ప్రజలను కాపాడాలనీ, ఫాంహౌజ్ రాజకీయాన్ని ఓడించాలని చెప్పారు. అనివార్య పరిస్థితుల్లోనే ఒక స్థానంలో పోటీ చేస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్న సానుకూల వాతావరణం కనిపిస్తున్నదని చెప్పారు. బీఆర్ఎస్ పోవాలనీ, కర్నాటక తరహాలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని అన్నారు. ఇక్కడ వచ్చే మార్పు దేశంలోనూ మార్పునకు దోహదపడాలని ఆకాంక్షించారు. ప్రశ్నించే గొంతుక అసెంబ్లీలో ఉండాలన్నారు. నిర్బంధం కాకుండా స్వేచ్ఛ ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, పశ్య పద్మ, బి హేమంతరావు, ఈటి నరసింహా, బాలనర్సింహా, విఎస్ బోస్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 22 వరకు ఐజేఎస్‌ఫ్ జ్యువెలరి ఫెస్టివల్

సందడి చేసిన ప్రముఖ నటి శ్రుతి హాసన్



నవతెలంగాణ బ్యూరో, హైదరాబాద్.

అక్టోబర్ 15న ప్రారంభమైన ఇండియన్ జ్యువెలరీ షాపింగ్ ఫెస్టివల్ నవంబర్ 22 వరకు కొనసాగనుందని ఎగ్జిబిషన్ కన్వీనర్ దినేష్ జైన్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంస్థ బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ నటి శ్రుతి హాసన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెమ్ అండ్ జ్యువెలరి కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఫెస్టివల్ ప్రపంచంలోనే అతి పెద్ద ఆభరణాల ఎగ్జిబిషన్‌గా గుర్తింపు పొందిందని అన్నారు. ఇందులో దేశ వ్యాప్తంగా 1500 సంస్థలు భాగస్వామ్యం పొందాయని తెలిపారు. ఈ ఫెస్టివల్ వల్ల జువెలరీ రంగంలో గ్రోత్ పెరిగి, అటు కార్మికులకు, వ్యాపారులకు ఎంతో లబ్ధి జరుగుతుందని పేర్కొన్నారు. నగలు కొనుగోలు చేసే వారికి ప్రతి రూ.25 వేల ఖరీదుపై ఒక కూపన్ ఇస్తున్నామని తెలిపారు ఈ సందర్భంగా ప్రముఖ నటి శ్రుతి హాసన్ సందడి చేశారు. నమ్మకం, నాణ్యత కోసం ఐజేఎస్ఎఫ్ ఫెస్టివల్‌లో పాల్గొని ఆభరణాలు కొనుగోలు చేయాలని కోరారు. తనకు హైదరాబాద్ అన్నా ఇక్కడి ప్రజలన్నా ఎనలేని గౌరవమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెస్టివల్ సభ్యులు సాయియామ్ మెహ్రా, మనోజ్ ఝా, రాజేష్ రోక్డే తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికలు ఎక్కడైనా జెండా సిరిసిల్లాదే...

అన్ని రాజకీయ పార్టీల జెండాలు ఇక్కడే తయారీ

నేత కార్మికులకు చేతినిండా పని

దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా సిరిసిల్ల జెండా ఎగరాల్సిందే. సిరిసిల్ల నేతన్నల నైపుణ్యాన్ని మెచ్చిన రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయి రాజకీయ పార్టీలు తమ ప్రచార జెండాలు, కండువాలు, ఇతర వస్త్ర సామాగ్రి ఆర్డర్లను సిరిసిల్ల నేతన్నలకు ఇస్తారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సిరిసిల్ల నేతన్నలకు మెండుగా ఉపాధి లభిస్తోంది. వివిధ పొలిటికల్ పార్టీల జెండాలు, కండువాలు సిరిసిల్లలో ఉత్పత్తి చేసేందుకు ఆర్డర్ వస్తున్నాయి. తమ పనితనంతో నేతలను మెప్పిస్తున్నారు.

నవతెలంగాణ - సిరిసిల్ల


తెల్లని వస్త్రాన్ని ఉత్పత్తి చేసి దానిపై వివిధ పార్టీల నాయకుల ఫొటోలు, గుర్తులు, పార్టీలకు సంబంధించిన కలర్స్‌తో పూర్తి స్థాయి జెండాలు, కండువాలు తయారవుతున్నాయి. అతి తక్కువ ధరలకే ఎన్నికల ప్రచార సామాగ్రిని సరఫరా చేస్తూ జాతీయ స్థాయి పార్టీల చూపు సిరిసిల్ల వైపు చూసేలా చేస్తున్నారు నేతన్నలు. ఇప్పటికే పలు పార్టీల నుంచి పెద్ద ఎత్తున ఆర్డర్లు వస్తుండటంతోపాటు వారికి కావాల్సిన ధరలో మన్నికతో అందిస్తున్నారు. అదే సమయంలో నేత కార్మికులకు ఎలక్షన్ సందడితో చేతినిండా పని దొరుకుతోంది.

తెలుగు రాష్ట్రాల నుంచి ఆర్డర్లు..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలకు చెందిన రాజకీయ పార్టీల ఆర్డర్‌లు సిరిసిల్ల నేతన్నలకు ఇప్పటికే అందాయి. అందుకనుగుణంగా ఉత్పత్తి ప్రారంభించారు. పార్టీ జెండా తయారీకి మీటరున్నర వస్త్రం, కండువా తయారీకి మీటర్ వస్త్రాన్ని వాడుతున్నారు. వివిధ పార్టీల ఆర్డర్‌లను బట్టి జెండాలను, కండువాలను తయారు చేస్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ 5లక్షల మీటర్ల ఆర్డర్లు ఇచ్చింది. వైసీపీ 5లక్షల మీటర్ల ఆర్డర్లు ఇచ్చింది. మిగతా రాజకీయ పార్టీలు కూడా ఆర్డర్లు ఇచ్చాయి. ప్రస్తుతానికి జెండాలు, కండువాలు తయారు చేస్తున్నారు. జెండారు తయారు చేసే నేతన్నలు రూ.9 చొప్పున మీటరు వస్త్రాన్ని కొనుగోలు చేస్తారు. దీనికి ప్రింటింగ్ కోసం రూ.8 ఖర్చవుతుంది. ఒక జెండా తయారీకి రూ.17 ఖర్చవుతుంది. ఉత్పత్తిదారులు ఈ జెండాలను రూ.19 నుంచి రూ.20కు విక్రయిస్తున్నారు.



నేత కార్మికులకు ఉపాధి..



ప్రస్తుతం జెండాల ఉత్పత్తిలో సిరిసిల్లలో దాదాపు 500మంది నేత కార్మికులు ఉపాధి పొందుతున్నారు. జెండా కట్ చేస్తే ఒక్కో జెండాకు 25పైసలు, కుట్టిస్తే 40పైసల చొప్పున ఇస్తారు. జెండాల తయారీ కార్ఖానాలో స్థానికులు రోజూ ఉపాధి పొందుతున్నారు. ప్రతి ఎలక్షన్ టైంలో సిరిసిల్లలో పలు పార్టీల జెండాలను తయారు చేసేందుకు సిరిసిల్ల నేతన్నలకు ఆర్డర్‌లు ఇస్తారు.

అన్ని జిల్లాలకు సిరిసిల్ల నుంచే..

సిరిసిల్లలో తయారైన పార్టీల జెండాలను అన్ని జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. ఇతర జిల్లాలకు చెందిన ప్రింటింగ్ వ్యాపారులు ఎమ్మెల్యే అభ్యర్థుల ఆర్డర్‌లు తీసుకుని సిరిసిల్లలో ఇస్తుంటారు. ఇక్కడ జెండాలను తయారు చేయించుకుని ఎమ్మెల్యే అభ్యర్థులకు అందజేస్తారు. ఇలా మధ్యవర్తులతో కూడా కొన్ని ఆర్డర్లు లభిస్తాయి.

మరో రెండు చోట్ల సీపీఐ(ఎం) అభ్యర్థులు

నల్లగొండ నియోజకవర్గం

పేరు : ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి (54)
తల్లిదండ్రులు : ముదిరెడ్డి లింగారెడ్డి, చంద్రమ్మ
పుట్టింది : ఇందుగుల గ్రామం, మాడుగులపెల్లి మండలం, నల్లగొండ జిల్లా.



రాజకీయ ప్రస్థానం :
1980లో సీపీఐ(ఎం)లో ప్రాథమిక సభ్యుడిగా ఉద్యమ ప్రస్థానం ప్రారంభం. ఆ తర్వాత డివిజన్ కమిటీ సభ్యులుగా, తిప్పర్తి మండల కార్యదర్శిగా, నల్లగొండ నియోజకవర్గ కార్యదర్శిగా పనిచేసి ప్రస్తుతం నల్లగొండ జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. విద్యార్థి, యువజన, రైతు సంఘాల్లో చేశారు. 2006లో తిప్పర్తి జెడ్పీటీసీగా ఎన్నికై జిల్లా పరిషత్ ఫ్లోర్‌లీడర్‌గా పనిచేశారు.

హుజూర్‌నగర్ నియోజకవర్గం

పేరు : మల్లు లక్ష్మి (53)
తల్లిదండ్రులు : నామిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, రాములమ్మ
పుట్టింది : మొల్కపట్నం, వేములపల్లి మండలం, నల్లగొండ జిల్లా



రాజకీయ ప్రస్థానం :
2006లో రాయినిగూడెం సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచుల గ్రామపంచాయతీలకు ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా 100 కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. లక్ష్మి పాదయాత్రతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిధులను ఒకేసారి విడుదల చేశారు. 2019లో ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. ఐద్వా నల్లగొండ జిల్లా కార్యదర్శిగా పని చేశారు. ప్రస్తుతం ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఉన్నారు.

కాంగ్రెస్‌కు మూకుమ్మడి రాజీనామాలు



కంటతడి పెట్టిన ఆదిలాబాద్ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్

- ఇండిపెండెంట్‌గా పోటీకి సిద్ధం
- చెన్నూర్‌లో పార్టీని వీడిన బోడ జనార్ధన్, డాక్టర్ రాజారమేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్,జైపూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి మంటలు చల్లారడం లేదు. ఆదిలాబాద్, చెన్నూర్ నియోజకవర్గాల్లో ఆ పార్టీ సీనియర్ నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. ఆదిలాబాద్ పార్టీ జిల్లా అధ్యక్షులు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సంజీవ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడారు. ఈ సందర్భంగా సోమవారం మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మా ముగ్గురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పని చేస్తామని అధిష్టానానికి మొదటి నుంచి చెబుతూ వచ్చామని, కానీ అధిష్టానం తమని కాదని కంది శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఖరారు చేయడంతో రాజీనామా చేశామని తెలిపారు. వీరితో పాటు ఓబీసీ జిల్లా అధ్యక్షులు, కౌన్సిలర్ అంబకంటి అశోక్, కేఆర్కే కౌన్సిలర్ రేష్మ ముబారక్, ఆదిలాబాద్ మండల బీసీ సెల్ అధ్యక్షులు వెంకటి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు సుమారుగా 30 నుంచి 35 మంది వరకు మూకుమ్మడి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్టీ జిల్లా అధ్యక్షులు సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ.. జీవితం మొత్తం పార్టీకి అంకితం చేశానని, కాంగ్రెస్ పార్టీతో తనకున్న 20ఏండ్ల అనుబంధాన్ని తెంచుకుం టున్నానని చెప్పడానికి కూడా నోరు రావడం లేదంటూ కంటతడి పెట్టుకున్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని నమ్ముతానని చెప్పిన వ్యక్తికి టికెట్ కేటాయిం చడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్ రాకున్నా ఇండిపెండెంట్‌గా బరిలో ఉండి గెలిచాక మళ్లీ కాంగ్రెస్‌లో చేరుతామని తెలిపారు. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా సంజీవ్‌రెడ్డిని నిలపాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

బీఆర్ఎస్‌లో చేరనున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోడ జనార్ధన్

చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోడ జనార్ధన్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు ప్రకటించారు. పార్టీ బలోపేతం కోసం శ్రమించిన స్థానికులను కాదని స్థానికేతరులు, కార్పొరేట్ వ్యాపారస్తులు వివేక్ వెంకటస్వామికి టికెట్ కేటాయించినందుకు నిరసనగా పార్టీ సభ్యత్వానికి రాజీనామ చేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి పంపిస్తున్నట్టు చెప్పారు. మందమర్రి పర్యటనకు వస్తున్న పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరడంతో పాటు చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు.

సైన్యం నుంచి.. గెరిల్లా దళంలోకి..

వీరతెలంగాణా పోరాట యోధుడు మంచికంటి రాంకిషన్‌రావు

పాలకుల ఆగ్రహాన్ని తట్టుకుని నిలబడిన ధీశాలి

పీడిత ప్రజల విముక్తి కోసం వీరతెలంగాణా సమరాంగణంలో కొదమ సింహంలా విజృంభించి, చివరికంటా ప్రజా ఉద్యమ నిర్మాణంలో ఆణిముత్యమై మెరిసిన వ్యక్తి మంచికంటి రాంకిషన్‌రావు. ప్రజాపోరాటాన్ని అణచడానికి ఆనాటి పాలకులు ఎందరో యోధులతోపాటు మంచికంటిని కూడా జైల్లో పెట్టారు. చింత్రహింసలకు గురిచేసినా మొక్కవోని దీక్షతో ధైర్యంగా ఎదుర్కొన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రజల మనిషిగా తన గొంతును వినిపించారు.



ఆణిముత్యాలు..

నవతెలంగాణ- ఖమ్మంరూరల్

కృష్ణాజిల్లా నందిగామ తాలూకా పెనుగంచిప్రోలులో రాంకిషన్‌రావు సాధారణ కుటుంబంలో జన్మించారు. తండ్రి పర్సా రామానుజరావు. తల్లి సీతమ్మ. రాంకిషన్‌రావుకు ఐదారేండ్ల వయసున్నప్పుడే నాన్న చనిపోయారు. ఆయనకు ఓ అక్క, అన్న కూడా ఉన్నారు. పిల్లలు పెద్దవాళ్లయ్యే వరకూ వ్యవసాయం చేసుకొని ఫలసాయం అప్పుల కింద జమ చేసుకునేలా ఉన్న కొద్దిపాటి పొలాన్ని అప్పుల వాళ్లకు అప్పగించి ఆ కుటుంబం ఖమ్మం వచ్చింది. వీరి కుటుంబ విషయం తెలిసి కాచిరాజుగూడెం భూస్వామి, పట్వారి అయిన మంచికంటి తిరుమలరావు రాంకిషన్‌రావును దత్తత చేసుకున్నారు. అప్పటి నుంచి రాంకిషన్‌రావు.. మంచికంటిగా మారారు. కాచిరాజుగూడెంలో ఇంటి వద్దనే ఉంటూ మూడో తరగతి వరకూ పూర్తి చేశారు.

ఆ తరువాత పై చదువుల కోసం ఖమ్మంలో పెట్టారు. ఆరో తరగతిలో ఉండగానే రాంకిషన్‌రావుకు వివాహమైంది. ఆ తర్వాత రాంకిషన్‌రావు హైదరాబాద్ ల్యాండ్ రెవెన్యూ కార్యాలయంలో చిన్న ఉద్యోగంలో చేరారు. తర్వాత షోలాపూర్ వెళ్లి సైన్యంలో చేరారు. ఆ సమయంలో ఆంధ్ర మహాసభలో పనిచేస్తున్న జాతీయవాది కొమరగిరి నారాయణరావు, భార్య తండ్రి సూచన మేరకు సైన్యం శిబిరం(పూణా) నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. కొన్నేళ్లపాటు అజ్ఞాతవాసంలో గడిపారు.

సుందరయ్య, మాకినేని, చంద్రతో పరిచయం..

కొణతమాత్మకూరులో ఉన్నప్పుడు కమ్యూనిస్టు అగ్రనేతలు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, చండ్ర రాజేశ్వర రావుతో మంచికంటి పరిచయం పెంచుకున్నారు. కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా చేరారు. ఇదే ఆయన రాజకీయ జీవితానికి ఆరంభం. నిజాం నవాబుకు చెందిన రజాకార్లు, భూస్వామ్య శక్తులు.. ప్రజలపై చేస్తున్న దాడులను తిప్పి కొట్టేందుకు ఆయన కృష్ణాజిల్లా కమ్మవారి పాలెంలో గెరిల్లా పోరాట యుద్ధ పద్ధతుల్లో శిక్షణ పొందారు. పిండిప్రోలులో దేశ్‌ముఖ్ జగన్నాధరెడ్డి దొర గడీని కూల్చివేసిన సంఘటనలో రాంకిషన్‌రావు పాల్గొన్నారు.

జైల్లో చిత్రహింసలు

నైజాం సంస్థానానికి సరిహద్దునగల కృష్ణాజిల్లా కమ్మవారిపాలెం, మల్కాపురం గ్రామాల్లో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మొదటి గెరిల్లా పోరాట శిక్షణ కేంద్రాలు ప్రారంభ మయ్యాయి. ఆయుధాల కోసం పోలీసుస్టేషన్లపై దళాల దాడులకు మంచికటి నేతృత్వం వహించారు. తన రాజకీయ జీవితంలో అనేకసార్లు జైల్లో గడిపారు. వరంగల్ జైల్లో రేయింబవళ్లు కాళ్లూ చేతులకు బేడీలు వేయబడి శిక్ష అనుభవించారు. 1964లో సీపీఐ(ఎం) వైపు వచ్చిన ఆయన ప్రభుత్వ ఆగ్రహానికిగురై 16 నెలలపాటు జైలు శిక్ష అనుభవించారు. జైలులో ఉండగానే ఆయన జబ్బున పడ్డారు. 1974లో అధిక ధరలకు నిరసనగా నిర్వహించిన ఆందోళనలో మరో చిర్రావూరి లక్ష్మీనరసయ్యతో పాటు మంచికంటి అరెస్టయ్యారు.

వారి పోరాట పటిమను అణచడానికి ఆనాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు వారిద్దరికీ బేడీలు వేయించి ఖమ్మం పురవీధుల్లో ఊరేగింపజేశారు. తర్వాత ఆ ఖమ్మం గడ్డపైనే చిర్రావూరి మున్సిపల్ చైర్మెన్‌గా, రాంకిషన్‌రావు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. 1975లో ఎమర్జెన్సీలో కూడా రాంకిషన్‌రావును రాజమండ్రి, హైదరాబాద్, వరంగల్ కేంద్ర కారాగారాల్లో నిర్బంధించారు. మళ్లీ ఆయనకు అనారోగ్య పరిస్థితులు ఏర్పడటంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చారు. ఆ స్థితిలో కూడా ఆయనను గొలుసులతో మంచానికి కట్టేసి హింసించారు.

సీపీఐ(ఎం)లో రాంకిషన్‌రావు ఎన్నో బాధ్యతలు నిర్వహించారు. 1982, 1985లో ఖమ్మం శాసనసభ్యునిగా ఎన్నికై శాసనసభలో ప్రజల వాణిని వినిపించారు. ఆ యోధుడు 1995 ఫిబ్రవరి 8వ తేదీన కన్నుమూశారు.

సూర్యాపేట జిల్లా కోదాడ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో టౌన్ ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి సిబ్బందితో కలిసి సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో మధ్యప్రదేశ్, చింద్వారా గ్రామానికి చెందిన భరత్ లాల్ కమ్లే వాహనంలో రూ.10.50లక్షలను పట్టుకున్నారు. ఆ నగదును ఎన్నికల అధికారులకు అందజేశారు.

నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ గుట్ట ఏరియాలో చేపట్టిన వాహనాల తనిఖీలో రూ.25లక్షల 73వేలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఐటీ అధికారులకు అప్పగించనున్నట్టు ఏసీపీ తెలిపారు.



ఓటు వేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించి వేయండి. ఎందుకంటే మీరు వేసే ఓటు ఓ మంచి నాయకుడిని ఎన్నుకోవడానికి ఉపయోగపడాలే కాని అవినీతిపరుడ్ని ఎన్నుకోవడానికి కాదు!!

పంచ్ తంత్రం!



ప్రజకోసమే తాను పార్టీమారితినంటు
పచ్చి అబద్ధమ్ము పలుకువాడు
కుల బాగుకోసమే కుస్తీబట్టగతాను
రక్తమోడితి నంటరిచెడివాడు
మనమతంలోనున్న మహాత్మెక్కడుందని
అరచిజబ్బలుచాచి చరచువాడు
ప్రాంతాల తేడాను పట్టిలాగితి గాన
లాభమ్ము జరిగెనన్ లోభిగాడు

అడ్డమైనట్టి మాటలనాశ్రయించి
చేతికొచ్చిన పనులెల్ల జేసుకొనుచు
గద్దెనెట్లెక్క వలెనన్న విద్యనేర్చి
తిరుగుచుండిరి రాచబజారునందు

- ఏనుగు నరసింహారెడ్డి



తెలంగాణ చిత్రం

మొత్తం జిల్లాలు	33
రెవెన్యూ మండలాలు	74
మండలాలు	613
అర్బన్ ప్రాంతాలు	141
పార్లమెంటు స్థానాలు	17 (ఎస్సీ3, ఎస్టీ2, జనరల్12)
అసెంబ్లీ సీట్లు	119 + ఆంగ్లో ఇండియన్
విస్తీర్ణంలో పెద్ద నియోజకవర్గం	ములుగు
విస్తీర్ణంలో చిన్న నియోజకవర్గం	చెన్నూరు
ఓటర్ల సంఖ్యలో పెద్ద నియోజకవర్గం	శేరిలింగంపల్లి(ఓట్లు 6,94,968)
ఓటర్ల సంఖ్యలో చిన్న నియోజకవర్గం	భద్రాచలం(1,46,183)

ఓట్లు

ఏడాది	మేల్	ఫీమేల్	థర్డ్‌జండర్	మొత్తం ఓట్లు
2018 లో...	1,41,56,355	1,39,06,586	2,691	2,80,75,914
2/11/2023	1,60,97,014	1,60,89,156	2,583	3,21,88,753

వయస్సువారీగా

వయస్సు	మేల్	పీమేల్	థర్డ్ జండర్	మొత్తం
18-19	5,21,026	3,89,681	103	9,10,810
20-29	32,12,750	30,44,376	958	62,58,084
30-40	49,95,308	50,26,234	1024	1,00,22,566
41-60	53,44,570	54,58,801	388	1,08,03,759
60	20,23,360	21,70,064	110	41,93,534

ఆల్ ఉమెన్ మేనేజ్‌డ్ పోలింగ్ స్టేషన్స్	610
పిడబ్ల్యుడి మేనేజ్‌డ్ పోలింగ్ స్టేషన్స్	119
మోడల్ పోలింగ్ స్టేషన్స్	670
వెబ్ కాస్టింగ్ ఆన్ వేరియస్ పోలింగ్ స్టేషన్స్	27,000
అవరేజ్ నెంబర్ ఆఫ్	
ఎలక్ట్రోర్స్ ఫర్ పోలింగ్ స్టేషన్	893
యూత్ మేనేజ్‌డ్ పోలింగ్ స్టేషన్	119
నెంబర్ ఆఫ్ ఈవిఎమ్‌లు, వీవీపీఎటీఎస్	
బీయూఎస్	72931
సీయూఎస్	57,692
వీవీపీఏటీఎస్	56,747



పోలింగ్ స్టేషన్లు

అర్బన్	14,458
రూరల్	20.898
మొత్తం	35,356

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	61,470	▼	170
22 క్యారెట్లు	56,350	▼	150
కిలో వెండి	78,200	▲	200



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 94
రిటైల్ (లైవ్)	రూ. 116
స్కిన్‌తో	రూ. 168
స్కిన్‌లెస్	రూ. 191

బిజినెస్

వాహన అమ్మకాల్లో 8 శాతం పతనం

- ఎఫ్ఎడిఎ గణంకాల వెల్లడి
- పండుగ సీజన్‌లో డిమాండ్ కొరత



న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థకు అద్దం పట్టే వాహన అమ్మకాల్లో పతనం చోటు చేసుకుంది. ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో వాహన విక్రయాలు 8 శాతం క్షీణించాయని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఎఫ్ఎడిఎ) సోమవారం వెల్లడించింది. ఈ ఏడాది అక్టోబర్‌లో 7.73 శాతం క్షీణించి 21,17,596 యూనిట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే నెలలో 22,95,099 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. గడిచిన నెలలో ద్విచక్ర వాహన విక్రయాల్లో తగ్గుదల వల్లే మొత్తం అమ్మకాలపై ప్రభావం చూపిందని ఎఫ్ఎడిఎ వెల్లడించింది. కాగా.. పండుగ సీజన్‌లో వాహన అమ్మకాలు పడిపోవడం ఆర్థిక వ్యవస్థలో ప్రతికూలతలకు నిదర్శనం. ముఖ్యంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబించే ద్విచక్ర వాహన అమ్మకాలు భారీగా పడిపోవడం ఆందోళనకరం. పండుగ సీజన్‌లో అమ్మకాలు పడిపోవడం వాహన పరిశ్రమను ఆందోళనకు గురి చేస్తుంది. వచ్చే నెలల్లో అమ్మకాలపై మరింత ఒత్తిడి ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఎఫ్ఎడిఎ రిపోర్ట్ ప్రకారం.. క్రితం అక్టోబర్‌లో దిచక్ర వాహన విక్రయాలు 12.60 శాతం క్షీణించి 15.07 లక్షల యూనిట్లకు తగ్గాయి. గతేడాది ఇదే నెలలో 17.25 లక్షల టూవీలర్ల అమ్మకాలు జరిగాయి. ప్రయాణీకుల వాహన విక్రయాలు 1.35 శాతం తగ్గి 3,53,990 యూనిట్లుగా నమోదయ్యాయి. గతేడాది 3,58,884 యూనిట్ల విక్రయాలు జరిగాయి. మూడు చక్రాల వాహన అమ్మకాలు 45.63 శాతం పెరిగి 1,04,711 యూనిట్లుగా ఉన్నాయి. ట్రాక్టర్ల అమ్మకాలు 6.15 శాతం పెరిగి 62,440 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. వాణిజ్య వాహన రిటైల్ విక్రయాలు 10.26 శాతం పెరిగి 88,699 యూనిట్లకు చేరాయి. నవరాత్రి సమయంలో మాత్రం అమ్మకాలు మెరుగ్గా జరిగాయని.. స్థూలంగా అక్టోబర్‌లో తగ్గాయని ఎఫ్ఎడిఎ వెల్లడించింది.

విల్మర్‌లో అదానీ వాటాల విక్రయం..!



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసిజి ఉత్పత్తుల అదానీ విల్మర్ నుంచి వైదొలగాలని అదానీ గ్రూపు యోచిస్తోంది. ఇందుకోసం తన వాటాను విక్రయించేందుకు పలు అంతర్జాతీయ స్థాయి కంపెనీలతో చర్చలు జరుపు తుందని సోమవారం పలు రిపోర్ట్‌లు వచ్చాయి. అదాని విల్మర్ ప్రధానంగా ఫోర్చ్యూన్‌లో పలు రకాల వంట నూనెలు, పప్పులు, బియ్యం, చక్కెర తదితర అహార ఉత్పత్తులను విక్రయిస్తుంది. ఇకపై కేవలం కీలక రంగాల వ్యాపారా లపై మాత్రమే దృష్టి పెట్టాలని అదానీ గ్రూప్ నిర్ణయించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే సింగపూర్‌కు చెందిన 'విల్మర్ ఇంటర్నేషనల్' భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్‌ను వైదొలగాలని అదాని గ్రూప్ ఉంది. అదాని విల్మర్‌లో ఇరు సంస్థలకు 43.97 శాతం చొప్పున వాటాలు న్నాయి. ఈ నెల చివరి కల్లా విక్రయంపై స్పష్టత రానుందని సమాచారం.

బిగ్ సిలో దీపావళి ధమాకా ఆఫర్లు

- ఆన్‌లైన్ కంటే తక్కువ ధరలకే..!



హైదరాబాద్ : ప్రముఖ రిటైల్ చెయిన్ సంస్థ బిగ్ సి దీపావళి పండుగ సందర్భంగా ఆకర్షణీయమైన ఆఫర్లను అందిస్తున్నట్లు ప్రకటించింది. ఈ ధమాకా ఆఫర్స్‌లో ప్రతీ స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.10,000 వరకు ఇన్‌స్టాంట్ క్యాష్ బ్యాంక్‌తో పాటు రూ. 4,000 వరకు విలువ కలిగిన ఖచ్చితమైన బహుమతి ఇవ్వనున్నట్లు బిగ్ సి ఫౌండర్, సిఎండి బాలు చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా స్మార్ట్ వాచ్ ఆఫర్, లాయల్టీ పాయిం ట్స్, స్మార్ట్ టివి తదితర మరెన్నో ఆఫర్లు అందిస్తున్నామన్నారు. బజాజ్ ఫైనాన్స్ ద్వారా మొబైల్‌స కొనుగోలుపై రూ.9వేల వరకు ఇన్‌స్టాంట్ క్యాష్ బ్యాంక్, ప్రతీ మొబైల్, స్మార్ట్ టివి, ట్యాప్‌టాప్ కొనుగోలుపై ఎస్‌బిఐ ద్వారా రూ.3వేల వరకు, ఐడిఎఫ్‌సి ద్వారా రూ.7,500 వరకు ఇన్‌స్టాంట్ డిస్కౌం ట్ ఇస్తోన్నట్లు పేర్కొన్నారు. ఎంపిక చేయబడిన మొబైల్స్ కొనుగోళ్ళపై రూ.5వేల విలువ కలిగిన ఫైర్ బోల్ట్ స్మార్ట్ వాచ్‌ను కేవలం రూ.499కే పొందవచ్చని తెలిపారు. ప్రతీ స్మార్ట్ టివిపై ఖచ్చితమైన బహుమతితో పాటు రూ.5199 విలువ కలిగిన ఫింగర్స్ బార్ స్పీకర్‌ను కేవలం రూ. 2499కు, ఐఫోన్ మొబైల్ కొనుగోలుపై రూ.7,000 వరకు ప్రయోజనాలు కల్పిస్తున్నామన్నారు. బ్రాండెడ్ అస్సెసరీస్‌పై 51 శాతం వరకు డిస్కౌంట్‌ను పొందవచ్చన్నారు. అదే విధంగా ఎటిఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్ పేమె ంట్ లేకుండానే ఉత్పత్తులు కొనుగోలు చేయవచ్చన్నారు. ప్రతీ పండుగను ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ఆఫర్లను ప్రకటించడం బిగ్ సి ఆనవాయితని.. ఈ దఫా దీపావళికి ప్రకటించిన ఆకర్షణీయ రాయితీలనూ వినియోగదారులు ఉపయోగించుకోవాలని బాలు చౌదరీ కోరారు.

సీఐసీగా సమారియా

సమాచార కమిషనర్లను నియమించిన కేంద్రం



న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ)గా హీరాలాల్ సమారియాను నియమించింది. కేంద్ర సమాచార కమిషన్‌లో ఈ పదవి గత నెల 3వ తేదీ నుండి ఖాళీగా ఉంది. గతంలో సీఐసీగా పనిచేసిన యశ్వర్ధన్ కుమార్ సిన్హా పదవీ విరమణ చేశారు. 2020 నవంబర్ 7వ తేదీ నుండి సమాచార కమిషనర్‌గా పనిచేస్తున్న సమారియాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం పదోన్నతి కల్పించారు. సమాచార కమిషనర్‌గా సమారియా పదవీకాలం మంగళవారంతో ముగుస్తున్న నేపథ్యంలో ఆయనకు పదోన్నతి లభించింది. గతంలో కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పనిచేసిన సమారియా 2025 సెప్టెంబర్ 13 వరకూ ఈ పదవిలో కొనసాగుతారు.

కాగా సమాచార కమిషనర్లుగా పనిచేస్తున్న సరోజ్ పున్హానీ, ఉదయ్ మహుర్కర్‌ల పదవీకాలం కూడా సోమవారంతో ముగిసింది. అయితే వీరి స్థానంలో ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు. వాస్తవానికి కేంద్ర సమాచార కమిషన్‌లో సీఐసీతో పాటు పది మంది కమిషనర్లు ఉండాలి. అయితే ప్రస్తుతం సీఐసీ, ఇద్దరు సభ్యులు మాత్రమే ఉన్నారు. ఆ ఇద్దరి పదవీకాలం కూడా ముగిసింది. అంటే ప్రస్తుతం కేంద్ర సమాచార కమిషన్‌లో సీఐసీ సమా రియా మాత్రమే ఉన్నారు. సమాచార కమిషనర్ల పోస్టులను భర్తీ చేయకపోవడంపై గత నెల 30న సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దీనివల్ల సమాచార హక్కు చట్టం మృతప్రాయమైందని ఘాటుగా వ్యాఖ్యానించింది. సమాచార కమిషనర్ల పోస్టులను భర్తీ చేయాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లకు సూచించింది. రాష్ట్రాల సమాచార కమిషన్లలో ఎన్ని కమిషనర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయో తెలుసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్ర చూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సిబ్బంది మంత్రిత్వ శాఖను ఆదేశించింది. 2019లో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ రాష్ట్రాలు సమాచార కమిష నర్ల నియామకం జరపడం లేదని పిటిషనర్ అంజలి భరద్వాజ్ తరపున వాదించిన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తెలిపారు. దీంతో పెండింగ్ కేసుల సంఖ్య పెరిగిపోతున్నాయని ఆయన చెప్పారు. 256 దరఖాస్తులు వచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎనిమిది నెలలుగా సమాచార కమిషన్‌లో ఎలాంటి నియామ కాలు జరపలేదని ఆర్‌టీఐ కార్యకర్త లోకేష్ బత్రా ఆగస్టులో తెలియజేశారు.

జంతర్ మంతర్‌లో కుకీల ధర్నా

న్యూఢిల్లీ : మణిపూర్‌లో తమపై జరుగుతున్న దాష్టీకాలను నిరసిస్తూ కుకీ-జో జాతికి చెందిన రెండు వేల మందికి పైగా ప్రజలు దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఢిల్లీ యూని వర్సిటీలో విద్యాభ్యాసం చేస్తున్న తాము మేలో హింస ప్రారంభమైనప్పటి నుండి సరైన తిండి, నిద్ర లేకుండా గడుపుతున్నామని పలువురు విద్యార్థులు వాపోయారు. చదువుపై కూడా సరిగా దృష్టి పెట్టలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిర్బంధాలు కొనసాగుతుండడంతో మణి పూర్‌కు వెళ్లి కుటుంబ సభ్యులను కలవలేకపోతున్నామని తెలిపారు. హింసాకాండలో చనిపోయిన కుకీల కుటుంబసభ్యులు తమ కష్టాలు వివరించారు. గత ఆరు నెలల కాలంలో మణిపూర్‌లో పరిస్థితులు ఏ మాత్రం మారలేదని కుకీ-జో మహిళా గ్రూపు వ్యవస్థాపకుల్లో ఒకరైన మేరీ గ్రేస్ చెప్పారు. కొద్దికాలం హింసాకాండను నిలిపేసిన మైతీలు తిరిగి దాడులు మొదలు పెట్టారని అన్నారు. ప్రస్తుతం కుకీలు ప్రాణ భయంతో ఆడవుల్లో తలదాచుకుంటున్నారని, వారి ఇళ్లపై దాడి చేసి దోచుకున్నారని వివరించారు. 'ఇది కుకీలను కాపాడుకోవడం కోసం చేపట్టిన ఆందోళన మాత్రమే కాదని అర్థం చేసుకోండి. భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం జరుగు తున్న ఉద్యమం ఇది. మేము సంఖ్యాపరంగా చూస్తే ఏడు లక్షల మందిమే. కుకీలు నష్టపోవడం అంటే దేశం నష్టపోవడమే. హింస ఇప్పుడే నెమ్మదిగా మొదలైంది. దేశంలో మైనారిటీలకు స్థానం లేకుండా పోతోంది' అని తెలిపారు. మణిపూర్‌లో మెజారిటీ మైతీలు మైనారిటీ కుకీలను పీడిస్తున్నా రని, ఈ విధానం దేశమంతటికీ వ్యాపిస్తుందని ఆమె హెచ్చరించారు. ధర్నాలో పాల్గొన్న కుకీ జాతీయులు త్రివర్ణ పతాకాలు, ప్లకార్డులు చేబూని తమ నిరసన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో హింసాకాండ చెలరేగిన తర్వాత ఆ రాష్ట్రంలో పర్యటించిన నిజ నిర్ధారణ బృందంలో సభ్యుడైన పాత్రికేయుడు జాన్ దయాల్ ధర్నానుద్దేశించి ప్రసంగించారు. బాధితులు ఒంటరిగా మిగిలిపోవాల్సి వచ్చిందని చెప్పారు.

కాళేశ్వరం అవినీతిపై మోడీ ఎందుకు స్పందించరు?

కమీషన్ల కోసమే ప్రాజెక్టుల వ్యయం పెంచారు: వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదనీ, ప్రజల సొమ్ము గంగపాలు కావటానికి కేసీఆర్ అవినీతి కారణమనీ, ఈ విషయంలో మోడీ ప్రభుత్వం ఎందుకు స్పందించటం లేదని వైఎస్ఆర్ టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై సీబీఐ విచారణకు మోడీ ఆదేశించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ తోడు దొంగలేనని విమర్శించారు. ఎన్నికల్లో గెలిచిన బీజేపీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌కు మద్దతిస్తారనీ, బీఆర్ఎస్ ఎంపీలు కేంద్రం లో బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలకు బిల్లులకు మద్దతిస్తారని చెప్పారు. ఈడీ మోడీ చేతుల్లో ఉంటే..ఐటీ అమిత్‌షా చేతుల్లో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా..మెగా కృష్ణారెడ్డి, సీఎం కేసీఆర్ పై సీబీఐ దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు..రూ.38 వేల కోట్లతో 16 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలని ప్రతిపాదించారని గుర్తుచేశారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.లక్షా 20వేల కోట్ల వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణం చేస్తే..అది కుక్క తోక తగిలితే కూలి పోయేలా ఉందని ఎద్దేవా చేశారు. అన్నారం పంపు హౌస్ , మేడిగడ్డ పరిస్థితిపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ వాళ్ళు నిగ్గు తేల్చారన్నారు. 20 అంశాలపై వివరణ అడిగితే 11అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వడమేంటని ప్రశ్నించారు. బ్యారేజ్ నిర్మాణమే పనికి రాదని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ రిపోర్ట్ ఇచ్చిందన్నారు. మేడిగడ్డకు వచ్చిన ఇబ్బంది రాబోయే రోజుల్లో అన్నారం , సుందిళ్లకు కూడా రానుందని వారు హెచ్చరించినట్టు తెలిపారు. కేవలం కమిషన్ల కోసమే ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచారని వెల్లడించారు. అసెంబ్లీ వేదికగా సాగునీటిపై అనేక అబద్ధాలు చెప్పారనీ, రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టించారని ఆరోపించారు.

రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించానని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయలేదని విమర్శించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రుణమాఫీ, పోడు భూములు, మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్ల అమలు, ఉద్యోగాల కల్పనలో నిర్లక్ష్యంపై ప్రశ్నించినందుకే తెలంగాణ ద్రోహిగా ముద్ర వేయాలని చూస్తున్నారన్నారు.

నిఘా నేత్రాలు పెంచండి

- ఎక్కడి పోలీసులు అక్కడే వద్దు
- సీ-విజిల్‌కు విస్తృత ప్రచారం ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల బృందం దిశానిర్దేశం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎన్నికల ప్రచారం, పోలీసు బందోబస్తు, పోలింగ్, కౌంటింగ్ సహా అన్నింటిపై వీడియో కెమెరాల నిఘాను పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక బృందం రాష్ట్ర అధికారుల్ని ఆదేశించింది. సెల్‌ఫోన్లతో వీడియోలు తీయొద్దనీ, కచ్చితంగా వీడియో కెమెరాలనే వినియోగించాలని స్పష్టంచేసింది. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయంలో సోమవారం వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, పోలీసు శాఖలకు చెందిన అధికారులతో సీఈఓ వికాస్‌రాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ ఎలక్షన్ కమీషనర్ అజయ్ బాదూ, డైరెక్టర్ (వ్యయం) పంకజ్ శ్రీవాస్తవ్, ప్రత్యేక వ్యయ పరిశీలకులు బాలకష్ణన్ మాట్లాడారు. ఎన్నికల ఏర్పాట్లపై వారు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే పోలీసులు, ఆ కేంద్రాల పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ప్రస్తుతం పనిచేస్తున్న వారు కాకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించే పోలీసులకు... చేయాల్సిన పనులు, చేయకూడని పనులతో రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారులు ప్రత్యేక జాబితా రూపొందించి ఇవ్వాలని సూచించారు. రాజకీయ కార్యక్రమాలను వీడియోలు తీయడంపై అన్ని వీడియో నిఘా బృందాలకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి పెండింగ్‌లోని 6వ నంబరు ఫారాలను నవంబర్ 10వ తేదీ లోగా పరిష్కరించాలని చెప్పారు. ప్రతి జిల్లాలో ఓటర్ల జాబితాపై వచ్చిన కంప్లయింట్‌లను ఫిర్యాదుదారు ఫోన్ నంబర్‌తో సహా నమోదు చేసి, ర్యాండమ్‌గా క్రాస్ చెక్ చేసి ధృవీకరించుకోవాలని చెప్పారు. అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు తమ మొబైల్ ఫోన్లలో సీ-విజిల్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకున్నట్లు రిటర్నింగ్ అధికారులు నిర్ధారించుకోవాలని అన్నారు. సీ-విజిల్ యాప్‌కు రాష్ట్ర స్థాయి వార్తాపత్రికల్లో ప్రకటనల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల బయట వీడియోగ్రఫీ ఫుటేజ్‌ను పోలీసు కంట్రోల్ రూమ్‌లతో అనుసంధానించాలని తెలిపారు. పోలింగ్ రోజున మీడియా చానళ్లపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలనీ, ప్రతికూల వార్త ప్రసారమయితే, నోడల్ అధికారి వెంటనే వాస్తవ వివరాలను తెలుసుకొని, వాటిని తిరిగి సంబంధిత చానళ్లకు తెలియజేయాలని దిశానిర్దేశం చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని చెప్పారు. అంతకుముందు సీఈఓ వికాస్‌రాజ్ రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కేంద్ర బృందానికి వివరించారు.

పోరాటాన్ని కొనసాగించు..

- ప్రబీర్ పుర్కాయస్థ స్వీయ జీవిత చరిత్ర)

న్యూఢిల్లీ : న్యూస్‌క్లిక్ పోర్టల్ వ్యవస్థాపక సంపాదకుడు ప్రబీర్




పుర్కాయస్థ స్వీయ జీవిత చరిత్ర 'కీపింగ్ అప్ ది గుడ్ ఫైట్' పేరుతో వెలువడింది. దేశాన్ని ప్రభావితం చేసిన సంఘటనలతో పాటూ ఆయన జీవిత కథను, ఆ మార్గంలో ఆయన నేర్చుకున్న పాఠాలను 200పేజీలతో వెలువడిన ఈ పుస్తకం మనకు తెలియచేస్తుంది. అధికార మదాన్ని ధీటుగా ఎదురొడ్డి నిలిచిన జాతి కథతో పుర్కాయస్థ తన వ్యక్తిగత జీవిత కథను అల్లుకున్నారు. ఆయన మాటల్లోనే చెప్పాలంటే, "భారత రిపబ్లిక్‌కు ఎంత వయస్సు వుందో నాకు కూడా అంతే వయస్సు వుంది. ఈ 75ఏళ్ళ జీవితంలో నేను నేర్చుకున్న వాటిని గురించి సులభంగా చెప్పాలంటే, 'సుసంపన్నమైన, వైవిధ్యభరితమైన నా దేశంలో ఎలా భాగం కావాలో నేర్చుకున్నాను, అదే స్థాయిలో, అద్భుతమైన, మరింత సంక్లిష్టమైన ఈ ప్రపంచంలో భాగం కావడం నేర్చుకున్నా, అందరి కోసం మరింత మెరుగైన ప్రపంచాన్ని నిర్మించేందుకు నేను పోరాడాల్సిన అవసరం వుందని గుర్తించా." అంటారు.

1975 ఎమర్జన్సీ సమయంలో పట్టపగలే కిడ్నాప్ అయినపుడు కానీ, ఈ ఏడాది అక్టోబరు 3న అరెస్టయినపుడు గానీ ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, తాను బాధితుడిని అనే కోణం నుండి చూసుకోవడానికి ఇష్టపడనని ప్రబీర్ పుర్కాయస్థ అంటారు. ఎందుకంటే, చరిత్ర సృష్టిలో భాగస్వామ్యాన్ని బాధితత్వం దోచేస్తుంది, మనల్ని కేవలం చరిత్రలో వస్తువులుగా మార్చేస్తుంది. దానికి బదులుగా, చరిత్ర సృష్టికర్తలుగా ప్రజలు వుండాలని నేను అనుకుంటాను. ఆ రోజున అధికారంలో వున్న ప్రభుత్వం వ్యక్తులపై, సంస్థలపై ఆధిపత్యం చెలాయించినట్లు కనిపిస్తుంది. కానీ అంతిమంగా చరిత్రను నిర్ణయించేది ప్రజలు, వారి చర్యలే, అంతేకానీ, మనకు నచ్చినపుడు, మనకు ఇష్టమైనట్లుగా కాదు, ప్రజలు గానీ వారి పాలకులు గానీ ఊహించని రీతిలో వుంటుంది." అని ఆయన పేర్కొంటారు.

సరళమైన, స్పష్టమైన భాషతో సాగిన ఈ జీవిత చరిత్ర కథనం ఎక్కడా బోర్ కొట్టదు, తనకు తాను గురించి గొప్పలు చెప్పుకోదు. తన జీవితంపై యోధుని పరిశీలనగా వుంటుంది. తన జీవితాన్ని తీర్చిదిద్దిన వారి గురించి వుంటుంది. తన పట్ల సరిగా వ్యవహరించని వ్యక్తులను కూడా విలన్లుగా చిత్రీకరించలేదు. వారందరూ కేవలం పరిస్థితులకు బానిసలనే ఆయన వ్యాఖ్యానిస్తారు. సైన్స్, టెక్నాలజీ, రాజకీయాలు ఈ మూడు రంగాలు తనకు ఎంతో ఇష్టమైనవని ఆయన అంటారు. 'ప్రతీ తరం ఎమర్జన్సీని ఎదుర్కొనాల్సిందేనా' అన్న శీర్షికతో గల అధ్యాయంతో ఈ పుస్తకం ప్రారంభమవుతుంది. ప్రజల మౌనాన్ని అంగీకారంగా భావించరాదని ఆయన చివరగా హెచ్చరిస్తారు.

పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఎ సవాలుపై

సుప్రీం విచారణ వాయిదా



న్యూఢిల్లీ : పౌరసత్వ చట్టం, 1955లోని సెక్షన్ 6ఎ రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తున్న పలు పిటిషన్లపై రాజ్యాంగ ధర్మాసనం విచారణను సుప్రీంకోర్టు సోమవారం వాయిదా వేసింది. షెడ్యూల్ ప్రకారం మంగళవారం ఈ విచారణ జరగాల్సి వుండగా, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ఇందిరా జైసింగ్, పలువురు లాయర్ల అభ్యర్ధనపై విచారణను ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ వాయిదా వేశారు.

అస్సామీల సంస్కృతి, వారసత్వం, భాష, సామాజిక గుర్తింపును పరిరక్షించేందుకు గానూ అస్సాం ఉద్యమ నేతలతో ఆనాటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం 1985 ఆగస్టు 15న కుదుర్చుకున్న ఒప్పందానికి కొనసాగింపుగా సెక్షన్ 6ఎను చట్టంలో ప్రత్యేక నిబంధనగా పొందుపరిచారు.

అక్రమ శరణార్ధులను ప్రధానంగా బంగ్లాదేశ్ నుండి వచ్చేవారిని గుర్తించి, రాష్ట్రం నుండి పంపివేయడానికి ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ (అసు) ఆరేళ్లుగా చేసిన ఉద్యమం ఫలితంగా ఈ ఒప్పందం అమల్లోకి వచ్చింది. సెక్షన్ 6ఎ కింద 1966 జనవరి 1కి ముందుగా అస్సాంలోకి ప్రవేశించిన వారిని సాధారణ పౌరునిగా గుర్తిస్తారు. వారికి భారత పౌరులకు వుండే అన్ని హక్కులు, బాధ్యతలు వర్తిస్తాయి. 1966 జనవరి 1 నుండి 1971 మార్చి 25 మధ్య రాష్ట్రంలోకి ప్రవేశించిన వారికీ అన్ని హక్కులు వుంటాయి, కానీ వారు పదేళ్లపాటు ఓటు వేయలేరు. అయితే సెక్షన్ 6ఎ స్వభావం వివక్షతో కూడి వుందంటూ దాన్ని సవాలు చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఇమ్మిగ్రెంట్లకు పౌరసత్వం మంజూరు చేసే కటాఫ్ డేట్‌ను రాజ్యాంగంలోని సెక్షన్ 6కింద 1948 జులై 19గా నిర్దేశించారని ఆ పిటిషన్‌దారులు వాదిస్తున్నారు. 2015లో త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించింది. ఇన్నేళ్లుగా సెక్షన్ 6ఎ కేసు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో వుంది. 19లక్షల మందిని మినహాయిస్తూ 2019 ఆగస్టులో తుది అస్సాం ఎన్ఆర్‌సి జాబితాను సిద్ధం చేశారు. మళ్లీ ఆ జాబితాను పరిశీలించాలంటూ అస్సాం ఎన్ఆర్‌సి అథారిటీ కోర్టును ఆశ్రయించింది.

కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం పచ్చగా..!

ఢిల్లీ దొరల చేతిలో మరోసారి తెలంగాణ బంధి కావాలా..!

- కేసీఆర్ అంటేనే భరోసా, యువతకు భవిష్యత్..
- కాంగ్రెస్ చిల్లర మాటలకు లొంగొద్దు
- ఒక్కసారి ఆలోచించి.. ఓటు వేయండి: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-సిరిసిల్ల/వేములవాడ

సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో ఎటు చూసిన పచ్చదనం, సాగు నీరు, తాగునీరు, సమద్ధిగా కరెంటు, సుభిక్షంగా పంటలు పండుతున్నాయని, బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, కాబట్టి కాంగ్రెస్ పార్టీ చిల్లర మాటలకు లొంగిపోకుండా ప్రజలు ఒక్కసారి ఆలోచించి ఓటు వేయాలని మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు కె.తారక రామారావు అన్నారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ టెక్‌సెల్ వింగ్‌ను మంత్రి కేటీఆర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గులాబీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలకు కడుపు నిండా సంక్షేమ పథకాలు అందుతున్నాయ న్నారు. ఈ తొమ్మిదిన్నరేండ్లలో సీఎం కేసీఆర్ ఒక్కసారి కూడా కులాల పేరుతో కుంపట్లు, మతాల పేరుతో మంటలు పెట్టలేదని, ప్రాంతం పేరుతో పంచాయితీ లు పెట్టే ప్రయత్నం చేయలేదన్నారు. అభివృద్ధే కులంగా, సంక్షేమమే మతంగా పరిపాలన సాగించారని వెల్లడించారు. అలాంటి నాయకుడిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. సిరిసిల్ల జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల్లో మళ్లీ గులాబీ జెండా ఎగరాలని చెప్పారు. ఇటీవల జరుగుతున్న ప్రపంచ వరల్డ్‌కప్‌లో విరాట్ కోహ్లీ సెంచరీ కొట్టినట్టు రాష్ట్రంలో 100 సీట్లు సాధిద్దామని ప్రజలను ఉత్తేజపరిచారు. కార్య క్రమంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్, నాస్కాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్రావు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మెన్ గూడూరి ప్రవీణ్, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు తోట ఆగయ్య, గ్రంథాలయ చైర్మెన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ సిరిసిల్ల టౌన్ అధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొన్నారు.

ఢిల్లీ దొరల చేతిలో మరోసారి తెలంగాణ బంధి కావాలా..!

వేములవాడ పట్టణంలో జరిగిన యువ ఆత్మీయ సమ్మేళనానికి కేటీఆర్ మాట్లాడుతూ.. ఢిల్లీ దొరల చేతిలో మరోసారి తెలంగాణ బందీ కావాలా.. లేక సీఎం కేసీఆర్ చేతిలో ముక్తి పొందాలో



తెలంగాణ ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. కేసీఆర్ అంటేనే భరోసా, యువతకు భవిష్యత్ అని అన్నారు. వేములవాడ నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహా రావును భారీ మెజారిటీతో గెలిపిస్తే, వేములవాడ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నర్సింహారావు మాట్లాడుతూ.. యువ నాయ కుడు కేటీఆర్ కేవలం వ్యక్తి కాదు, తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్ అని అన్నారు. యువకుల భవిష్యత్ బాగుండా లని, ప్రపంచంలోని చాలా దేశాలు తిరిగి పెట్టుబడులు తీసుకొచ్చారని కొనియాడారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ లోక బాపు రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ రాఘవ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, విద్యార్థి జేఏసీ నాయకులు మందాల భాస్కర్, సీనియర్ నాయకులు మనోహంరెడ్డి, దరువు ఎల్లన్న, నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, ఈర్లపల్లి రాజు, కౌన్సిలర్లతో పాటు ఆయా మండలాల యువజన, విద్యార్థి విభాగం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

ఇఫ్లూ అప్రజాస్వామిక చర్యలకు ఎస్ఎఫ్ఐ ఖండన

విద్యార్థులను రౌడీల్లా అరెస్టు చేసి కేసులు నమోదు చేయడం దుర్మార్గం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ ఇంగ్లీషు అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్శిటీ (ఇఫ్లూ)లో అప్రజాస్వామిక చర్యలను భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతనెల 18న విద్యార్థినిపై లైంగిక దాడి జరిగిందని తెలిపారు. దీంతో విద్యార్థులకు భద్రత కల్పించడంలో ఇఫ్లూ పరిపాలన విభాగం విఫలమైందని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో వీసీ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. వీసీ పదవీకాలం పూర్తయినా కూడా కేంద్ర ప్రభుత్వం అండదండలతో వర్సిటీలో విద్యార్థుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడిని నిగ్గు తేల్చాలంటూ ఆందోళన కొనసాగిస్తునే ఉన్నారని తెలిపారు. నిరసన దీక్ష చేస్తున్న విద్యార్థులను ఓయూ పోలీసులు గేట్లకు తాళం వేసి నిర్బంధించారని పేర్కొన్నారు. వారికి మద్దతుగా నిలబడిన హెచ్‌సీయూ విద్యార్థులను గేట్ ముందు బలవంతంగా అరెస్టు చేశారని తెలిపారు. 32 మంది విద్యార్థులపై క్రిమినల్ కేసులు పెట్టారరని పేర్కొన్నారు. ఇఫ్లూ యాజమాన్యం, వీసీ విద్యార్థులను రౌడీలుగా భావించి అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నారని విమర్శించారు. వీసీని తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై దాడి చేసి అక్రమంగా పెట్టిన కేసులను రద్దు చేయాలని కోరారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల తరుపున, వారికి మద్దతుగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.